V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శనివారం
26-10-2024

సంపుటి : 01 । సంచిక : 174 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD

# ఉద్రిక్తతలు, ఘర్షణతో ప్రపంచం



## ఇండో-పసిఫిక్ ప్రాంతంలో తీవ్ర సమస్యలు

ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర ఆవేదన

భారత్, జర్మనీ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం

జర్మనీ ఛాన్సలర్ ఒలాఫ్ షోల్జ్‌తో భేటీ

**ఢిల్లీ:** ఉద్రిక్తతలు, ఘర్షణలు, అనిశ్చితి వంటి పరిస్థితులను ప్రపంచం ఎదుర్కొంటుందని ప్రధాని నరేంద్ర మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో తీవ్రమైన సమస్యలు ఉన్నాయని తెలిపారు. అలాంటి సమయంలో భారత్, జర్మనీ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం దృఢమైన బంధంగా మిగతా2లో...

# సరిహద్దుల్లో బలగాల ఉపసంహరణ

- వాస్తవాధీన రేఖ వెంట ఉద్రిక్తతలకు ముగింపు
- భారత్, చైనా ఒప్పందం ప్రకారం మొదలైన ప్రక్రియ
- వెల్లడించిన భారత రక్షణ శాఖ అధికారులు



**లద్దాఖ్:** భారత్, చైనా మధ్య వాస్తవాధీన రేఖ వెంబడి గత నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలికేలా ఇటీవల ఇరు దేశాల మధ్య కీలక ఒప్పందం జరగ్గా, సరిహద్దుల్లో బలగాల ఉపసంహరణ ప్రక్రియ మొదలైంది. తూర్పు లద్దాఖ్ సెక్టార్‌లోని రెండు కీలక ప్రాంతాలు అయిన డెమ్చోక్, డెస్పాంగ్ నుంచి రెండు దేశాల బలగాలు వెనక్కి మరలుతున్నాయి. ఈ మేరకు భారత రక్షణశాఖ అధికారులు శుక్రవారం ఉదయం వెల్లడించారు. ఒప్పందం ప్రకారం సరిహద్దు ప్రాంతంలోని సైనిక సామగ్రి, ఇతర పరికరాలను భారత బలగాలు వెనక్కి తీసుకొస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇక్కడి టెంట్లు, తాత్కాలిక నిర్మాణాలను కూడా ఇరు దేశాల బలగాలు తొలగిస్తున్నట్లు వెల్లడించారు. చార్డింగ్ లా పాస్‌కు సమీపంలోని నదీకి పశ్చిమ దిశగా భారత బలగాలు, తూర్పు దిశగా చైనా బలగాలు మిగతా2లో...

## టెస్లా కారులో చెలరేగిన మంటలు

నలుగురు భారతీయుల మృతి

డివైడర్‌ను ఢీకొట్టిన కారు

ఫలించని రక్షణ ప్రయత్నాలు



**టొరంటో:** కెనడాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. టొరంటో సమీపంలో అర్ధరాత్రి సమయంలో ఓ టెస్లా కారు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఇద్దరిని గుజరాత్ లోని గోద్రాకు చెందిన వారిగా గుర్తించారు. గోద్రాకు చెందిన 30 ఏళ్ల కేతా గోహిల్, 26 ఏళ్ల మిగతా2లో...



# దేశంలోనే అత్యుత్తమంగా క్రీడా విధానం

## నవంబర్ నెలాఖరులోగా తుది ముసాయిదా సిద్ధం చేయాలి

రెండేళ్లలో రాష్ట్రంలో జాతీయ క్రీడలు నిర్వహించేలా చూడాలి..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర క్రీడా విధానానికి (స్పోర్ట్స్ పాలసీ) సంబంధించిన తుది ముసాయిదాను నవంబరు నెలాఖరులోగా సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మనం రూపొందించే పాలసీ దేశంలోనే అత్యుత్తమ పాలసీగా ఉండాలని, అందుకు విస్తృత అధ్యయనం, నిపుణులు, క్రీడాకారులతో విస్తృత స్థాయిలో సంప్రదింపులు చేయాలని ఆయన సూచించారు. తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ పాలసీపై తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అందుబాటులో ఉన్న క్రీడా వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని, ఇప్పటికే ఉన్న స్టేడియాలు, మిగతా6లో...

## తెలంగాణ నుంచే కులగణన

- ఈనెల 28 నుంచి ప్రారంభం
- డిసెంబర్ 9న ప్రభుత్వానికి నివేదిక
- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ



2

# అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ అభివృద్ధి

## రియల్టర్లు, బిల్డర్లు భాగస్వామ్యం కావాలి

- కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి స్పష్టత ఉంది
- రాష్ట్ర బడ్జెట్ లో 10,000 కోట్లు కేటాయింపు
- రియల్టర్ల తో పాటు నిర్మాణదారులకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- ఇప్పటికే అనుమతులు పొందిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- నరేడ్కో 14 వ ప్రాపర్టీ షో ప్రారంభోత్సవలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్ :** రియల్ ఎస్టేట్ రంగంతో పాటు నిర్మాణ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎవరూ అధైర్యానికి లోనూ కావొద్దని ఆయన హితవు పలికారు. శుక్రవారం హైటెక్స్ లో నరేడ్కో 14 వ ప్రాపర్టీ షో ను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నిర్మాణ రంగంలో ఉన్న వారితో పాటు రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్న వారికి మిగతా2లో...

## ఫలించిన కానిస్టేబుళ్ల కుటుంబాల పోరాటం




**విశ్వంభర, హైదరాబాద్:** బెటాలియన్ పోలీస్ కానిస్టేబుళ్ల కుటుంబాల పోరాటం ఫలించింది. ఎట్టకేలకు దిగొచ్చిన ప్రభుత్వంలో గతంలో ఇచ్చిన మిగతా2లో...

# 33 కోర్సులను ప్రక్షాళన చేసి విద్యార్థులకు అందిస్తాం


- గడిచిన పదేళ్లలో టెక్నికల్ వ్యవస్థలు మూలనపడ్డాయి
- ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తం చేసారు
- రాష్ట్ర ప్రభుత్వం విద్య.. వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది



**విశ్వంభర, హైదరాబాద్:** గత ప్రభుత్వం పదేళ్లలో 40 వేల ఉద్యోగాలివ్వలేదని విమర్శించారు ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన మిగతా2లో...

## గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడి

- 38 మంది మృతి
- లెబనాన్‌పై కూడా దాడుల పెంపు
- ప్రాణాలు కోల్పోయిన టీవీ జర్నలిస్టులు



**గాజా:** గాజాపై ఇజ్రాయెల్ చేసిన దాడిలో 38 మంది మృతి చెందారు. ఈ మేరకు గాజా ఆరోగ్య శాఖ అధికారులు వివరాలు వెల్లడించారు. గాజా, మిగతా2లో...

## పత్తి రైతులకు వాట్సప్ సేవలు

ఎప్పటికప్పుడు క్రయవిక్రయాల వివరాలు .. మంత్రి తుమ్మల వెల్లడి



**విశ్వంభర, హైదరాబాద్:** పత్తి రైతుల సౌకర్యార్థం తెలంగాణ ప్రభుత్వం వాట్సప్ సేవలను ప్రారంభించింది. వాట్సప్ నంబర్ 8897281111 ద్వారా పత్తి అమ్మకం, కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను అందించేందుకు వ్యవసాయ మార్కెటింగ్ మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 120 | రిటైల్ ₹ 142 |
| స్కిన్ ₹ 206 | స్కిన్ లెస్ ₹ 234 |

## మంత్రిగా ఉండి ఇలాంటి వ్యాఖ్యలా?

కొండా సురేఖపై కోర్టు ఆగ్రహం



**విశ్వంభర, హైదరాబాద్:** మంత్రి కొండా సురేఖకు కోర్టు మొట్టికాయలు వేసింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన రూ.100 కోట్ల పరువునష్టం కేసులో మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై నాంపల్లి కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సురేఖ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని మండిపడింది. ఓ బాధ్యత కలిగిన మహిళా మంత్రి ఇలాంటి కామెంట్లు చేయడం ఆశ్చర్యాన్ని కలిగించిదని వ్యాఖ్యానించింది. అలాంటి వ్యాఖ్యలు సమాజంలో చెడు ప్రభావాన్ని మిగతా2లో...

# అల్లుడి కోసమే మూసీ డ్రామాలు



- ఇది అతిపెద్ద కుంభకోణం
- చచ్చిపోయిన కాంగ్రెస్ పునరుజ్జీవ యత్నం
- తెలంగాణ సొమ్మును మళ్లించే కుట్ర
- కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు
- ఇందిరా పార్క్ వద్ద మూసీ బాధితుల మహా ధర్నా

**విశ్వంభర, హైదరాబాద్:** అల్లుడి కోసమే మూసీ డ్రామాలాడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మూసీ బాధితులకోసం బీజేపీ శుక్రవారం హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ చౌక్ వద్ద మహా ధర్నాలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ పాల్గొన్నారు. అనంతరం బండి సంజయ్ మాట్లాడుతూ.. ఇది మూసీ పునరుజ్జీవం కాదు... దేశంలో చచ్చిపోయిన కాంగ్రెస్ పార్టీకి తిరిగి పునరుజ్జీవింప చేసేందుకే తెలంగాణ సొమ్మును ఖర్చు చేయాలని చూస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ దోపిడీని అడ్డుకుని తీరుతామన్నారు. లండన్, సియోల్ కాదు.... మూసీ బాధితుల వద్దకు వెళ్లే దమ్ముందా? మిగతా2లో...



2

## సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నాం

- మూసీ పరీవాహక ప్రాంతంలో ఉండేందుకు మేం సిద్ధమే
- సుందరీకరణకు మేం వ్యతిరేకం కాదు
- పేదల ఇళ్ల కూల్చివేతకు మాత్రమే వ్యతిరేకం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

## పంచాంగం

**26-10-2024, శనివారం**

శ్రీ క్రోధినామ సంవత్సరం
ఆశ్వయుజ మాసం కృష్ణపక్షం
**తిథి:** దశమి తె.05.24 వరకు తర్వాత ఏకాదశి
**నక్షత్రం:** ఆశ్లేష ఉ.09.43 వరకు
**సూర్యోదయం:** ఉ.6.16
**సూర్యాస్తమయం:** సా.5.43
**వర్జ్యం:** రా.11.05 నుంచి రా.12.51వరకు
**దుర్ముహూర్తం:** ఉ.07.48 నుంచి ఉ.08.33 వరకు
**రాహుకాలం:** ఉ.09.08 నుంచి ఉ.10.34 వరకు
**అమృత ఘడియలు:** ఉ.08.01 నుంచి ఉ.09.45 వరకు

# తెలంగాణ నుంచే కులగణన

**ఢిల్లీ:** ఢిల్లీ పర్యటనలో భాగంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కశుక్రవారం సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన ప్రక్రియపై వివరణ ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వచ్చిన సందర్భంగా గతేడాది రాహుల్‌గాంధీ కులగణనపై స్పష్టమైన హామీ ఇచ్చారని, దేశవ్యాప్తంగా చేపట్టే ప్రక్రియలో భాగంగా తెలంగాణ నుంచే మొదట ప్రారంభిస్తామన్న మాట మేరకు ఈ విధాన నిర్ణయం తీసుకున్నట్లు డిప్యూటీ సీఎం వివరించారు. గత కొన్ని రోజులుగా కులగణన చేపట్టడానికి అనుసరించాల్సిన విధానంపై స్టేట్ బీసీ కమిషన్ కసరత్తు చేస్తున్నదని, ప్రక్రియ సజావుగా, సంతృప్తికరంగా, ఫలితాలు అందించే విధంగా ఉండేందుకు రాష్ట్ర ప్లానింగ్ డిపార్టుమెంటును నోడల్ ఏజెన్సీగా నియమించి నిర్వహిస్తున్నట్లు కేసీ వేణుగోపాల్‌కు వివరించారు. ఈ ప్రక్రియ ద్వారా రానున్న ఫలితాలు, దానికి అనుగుణంగా ప్రభుత్వం అమలుచేసే



సంక్షేమ పథకాల్లో లబ్ధిదారుల గుర్తింపు సులభతరం కావడం, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ ఫార్ములాను ఫైనల్ చేయడానికి దోహదపడడం... ఇలాంటి అనేక అంశాలను వివరించారు. కులగణన కోసం రూపొందించిన ప్రశ్నావళి, ప్రొఫార్మాను అందజేశారు.
ఈ నెల 28 నుంచి రాష్ట్రవ్యాప్తంగా కులగణన ఎనిమిది వారాల పాటు (60 రోజులు) జరగనున్నదని, డిసెంబరు 9వ తేదీ నాటికి ప్రభుత్వానికి నివేదిక అందనున్నట్లు కేసీ వేణుగోపాల్‌కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వివరించారు. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు ఏఐసీసీ సీనియర్ అబ్జర్వర్‌గా పార్టీ హైకమాండ్ నియమించినందున గత వారం జరిపిన పర్యటన వివరాలను కూడా వేణుగోపాల్‌తో పంచుకున్నారు. అక్కడి పరిస్థితులను వివరించి పార్టీపరంగా తీసుకోవాల్సిన చర్యలు, సమన్వయం కోసం రూపొందించాల్సిన మెకానిజం తదితరాలపై కూడా చర్చించినట్లు తెలిసింది. ఇదే విషయమై అజయ్ మాకెన్‌తో కూడా విడిగా భేటీ అయిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభిప్రాయాలను పంచుకున్నారు. సాయంత్రానికి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. త్వరలో కొన్ని రోజుల పాటు జార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు.

**సెంట్రల్ ఫైనాన్స్ సెక్రెటరీతో భేటీ**

గత ప్రభుత్వం చేసిన అప్పులు ప్రస్తుతం భారంగా మారడంతో రిలీఫ్ కోసం గత కొంతకాలంగా జరుగుతున్న ప్రయత్నాల్లో భాగంగా స్టేట్ ఫైనాన్స్ సెక్రెటరీ ఢిల్లీకి వెళ్ళి సెంట్రల్ ఫైనాన్స్ సెక్రెటరీ, పలువురు అధికారులతో సమావేశమయ్యారు. పాత ప్రభుత్వం చేసిన అప్పుల్లో 'అసలు', వడ్డీ చెల్లించాల్సి ఉన్నందున అంచనాలకు మించి భారంగా మారడంతో రుణాలను రీ షెడ్యూలు చేయడంతో పాటు వడ్డీ శాతాన్ని తగ్గించడానికి ఉన్న వెసులుబాటుపైనా చర్చించారు. గత ప్రభుత్వంలో రుణాలు ఇచ్చేటప్పుడు కుదిరిన ఒప్పందంలో రీపేమెంట్ కోసం నిర్దేశించుకున్న గడువును పొడిగించేలా పవన్ ఫైనాన్స్ కార్పొరేషన్, రూరల్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ యాజమాన్యాలతో సంప్రదింపులు జరపాల్సిందిగా కోరినట్లు తెలిసింది. గతంలో ఢిల్లీ పర్యటన సందర్భంగా ప్రధానిని కలిసినప్పుడు పాత అప్పుల రీషెడ్యూలుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. ఆ కసరత్తులో భాగంగానే స్టేట్, సెంట్రల్ ఫైనాన్స్ డిపార్టుమెంటు అధికారుల మధ్య సమావేశాలు జరుగుతున్నాయి. సెంట్రల్ ఫైనాన్స్ సెక్రెటరీ సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది.

## టెస్లా కారులో చెలరేగిన మంటలు

(మొదటి పేజీ తరువాయి)
నిల్ గోహిల్.. మరో ఇద్దరు వ్యక్తులతో టెస్లా కారులో ప్రయాణిస్తున్నారు. అయితే, వీరు ప్రయాణిస్తున్న టెస్లా కారు టొరంటో సమీపంలో డివైడర్‌ను ఢీ కొట్టింది . అనంతరం కారులో మంటలు చెలరేగాయి . ప్రమాదం అనంతరం కారు బ్యాటరీకి మంటలు అంటుకున్నట్లు గుర్తించారు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారంతా ప్రాణాలు కోల్పోయారు. అటుగా వెళ్తున్న వాహనదారులు కారులోని వారిని రక్షించేందుకు ఎంత ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. మంటల దాటికి వారి ప్రయత్నాలు ఫలించలేదు. ఫలితంగా నాలుగు నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోవాల్సి వచ్చింది. మృతుల్లో ఇద్దరు ఇటీవలే కెనడా పౌరసత్వం పొందినట్లుగా తెలిసింది.

## పోలీసు శాఖ కీలక ఉత్తర్వులు

(మొదటి పేజీ తరువాయి)
జీవోను తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ మేరకు స్పెషల్ అదనపు డీజీపీ శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సెలవుల విషయంలో తెలంగాణ బెటాలియన్ కానిస్టేబుళ్లకు ఊరట లభించింది.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు బెటాలియన్ కానిస్టేబుళ్లు 15 రోజులకు ఒకసారి సెలవుపై వెళ్లే అవకాశం ఉండేది. కానీ ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిబంధనలను మార్చి కొత్త లీవ్ మాన్యువల్‌ను అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు కొత్త జీవోను విడుదల చేసింది. దీని ప్రకారం ఇప్పటివరకు 15 రోజులకు ఒకసారి ఇంటికి వెళ్లిన కానిస్టేబుళ్లు.. ఇకపై 26 రోజులకు ఒకసారి ఇంటికి వెళ్లాల్సి వస్తుంది. ఈ మ్యాన్యువల్‌పై బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలు బెటాలియన్ల ముందు ధర్నా చేయగా.. ఇవాళ సెక్రటేరియట్ ముట్టడికి కూడా యత్నించారు. దీంతో రేవంత్ సర్కార్ దిగొచ్చి ఆ జీవోను తాత్కాలికంగా నిలిపివేసింది.

## పత్తి రైతులకు వాట్సప్ సేవలు

(మొదటి పేజీ తరువాయి)
శాఖ సిద్ధమైంది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు పత్తి పంట క్రయవిక్రయాల్లో ఎలాంటి జాప్యం జరగకూడదని ఈ సేవలను ప్రారంభించింది. పత్తి కొనుగోళ్లు, అమ్మకం, అర్హత, తదితర వివరాలు, చెల్లింపు స్థితి, సీసీఐ సెంటర్లలో వేచి ఉండే సమయం వంటి వివరాలను రైతులు తమ ఇంటి వద్దనే ఉండి ఈ నంబరు ద్వారా తెలుసుకోవచ్చని మంత్రి తెలిపారు. రైతులందరూ మార్కెటింగ్ శాఖ తీసుకొచ్చిన ఈ వాట్సప్ యాప్‌ను ఉపయోగించి ఎలాంటి ఇబ్బందులు పడకుండా పత్తిని విక్రయించుకోవాలని రైతులను కోరారు. అలాగే, రైతులకు ఎటువంటి ఫిర్యాదులున్నా వాట్సప్ ద్వారా సమాచారమిస్తే.. మార్కెటింగ్ శాఖ సత్వరమే చర్యలు తీసుకుంటుందని మంత్రి తుమ్మల తెలిపారు.

## 33 కోర్సులను ప్రక్షాళన చేసి విద్యార్థులకు అందిస్తాం

(మొదటి పేజీ తరువాయి)
పది నెలల్లోనే 50 వేల పై చిలుకు ఉద్యోగాలుచ్చామని ఆయన తెలిపారు. గ్రూప్ 1 పరీక్షకు ముందు విద్యార్థులను రెచ్చగొట్టి బీఆర్ఎస్ పరీక్షలను అడ్డుకునే ప్రయత్నం చేసిందని ఆయన మండిపడ్డారు. గడిచిన పదేళ్లలో టెక్నికల్ వ్యవస్థలు మూలనపడ్డాయని, ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తం చేసారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం పై ప్రత్యేకమైన శ్రద్దగా పెట్టిందని, పాలమూరులో రెండు ఏటీసీ ( అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్స్) ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. యువతలో నైపుణ్యాన్ని పెంచేందుకు స్కిల్ యూనివర్సిటీ ని ఏర్పాటు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. పాలమూరులో స్కిల్ యూనివర్సిటీ విభాగం ఏర్పాటు చేసి విద్యార్థులకు నైపుణ్యాలు అందిస్తామని, గత ప్రభుత్వం యూనివర్సిటీలకు వీసీలను నియమించలేదని మండిపడ్డారు.యూనివర్సిటీలో ఇంక్యుబేషన్ సెంటర్ల ఏర్పాటు ద్వారా పరిశ్రమలు అనుసంధానం చేసి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, టాటా టెక్నాలజీస్ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇప్పిస్తామన్నారు. 33 కోర్సులను ప్రక్షాళన చేసి విద్యార్థులకు అందిస్తామని, బీఏ, బీకాం చదివే విద్యార్థులకు బ్యాంకింగ్ , ఫైనాన్షియల్ కోర్సులను జోడించి నైపుణ్యం కల్పిస్తామన్నారు. విద్యార్థుల పరిశోధనలకు తోడ్పాటు నందిస్తామని ఆయన వెల్లడించారు. పారిశ్రామీకరణకు విద్యను అనుసంధానం చేస్తామని, విద్యార్థుల భవిష్యత్తుకు మాది బాధ్యత.. పాలమూరు జిల్లా సీఎం జిల్లా. ఇక్కడ పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉద్యోగాలు కల్పిస్తామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

## మంత్రిగా ఉండి ఇలాంటి వ్యాఖ్యలా?

(మొదటి పేజీ తరువాయి)
చూపుతాయని తెలిపింది. ఆమె వ్యాఖ్యలను మీడియా, సోషల్ మీడియా, యూట్యూబ్, ఫేస్‌బుక్, గూగుల్ ప్లాట్‌ఫామ్‌ల నుంచి తొలగించాలని ఆదేశించింది. ఇంకెప్పుడూ కేటీఆర్ గురించి అడ్డగోలు వ్యాఖ్యలు చేయవద్దని స్పష్టం చేసింది.

**దేశంలో ఇదే మొదటి సారి..**

పరువు నష్టం కేసుకు సంబంధించిన ఓ కేసులో మంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తిపై కోర్టు ఇంత ఆగ్రహం వ్యక్తం చేయటం ఇదే తొలిసారి. గతంలోనూ కొండా సురేఖ ఇలాంటి వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంఘం ఈ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించింది. అయినప్పటికీ మంత్రి కొండా సురేఖలో ఎలాంటి మార్పు రాలేదు. తన వ్యక్తిత్వ హననం చేసే విధంగా చేసే ఏ ఆరోపణలను సహించేది లేదని ఇప్పటికే కేటీఆర్ స్పష్టం చేశారు. ఇకపై తన గురించి ఇలాంటి వ్యాఖ్యలు చేసే వారికి ఆయన ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు.

# అల్లుడి కోసమే మూసీ డ్రామాలు

(మొదటి పేజీ తరువాయి)
అని ప్రశ్నించారు. మూసీ పునరుజ్జీవం అతి పెద్ద కుంభకోణం అన్నారు. సబర్మతి, నమామి గంగతో మూసీకి పోలికా? అని ప్రశ్నించారు. సబర్మతి, నమామి ఖర్చు కు, మూసీ అంచనాకు పోలిక ఎక్కడ? అని మండిపడ్డారు. మీ అల్లుడి (వాద్రా) కోసం మూసీ దోపిడీకి ప్లాన్ చేస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో తామంతా మూసీ బాధితులకు అండగా ఉంటామన్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండల్లో పుట్టిన మూసీ 287 కి.మీలు ప్రవహిస్తోందన్నారు. మూసీ డ్రైనేజీ నీటితో దాదాపు 12వేల పరిశ్రమల నుండి వెలువడే రసాయనాలతో విష తుల్యంగా మారిందని తెలిపారు. తన పాదయాత్రలో భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో విషం చిమ్ముతూ ఎగిసిపడుతున్న మూసీని, జనం బాధలను కళ్లారా చూశామన్నారు. 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్, 10 ఏళ్లు పాలించిన బీఆర్ఎస్సే అందుకు కారణం అన్నారు. మూసీ ప్రక్షాళన ఓ జోక్... 1997లో ప్రక్షాళన పేరుతో డ్రామాలు... కర్మన్ ఘాట్ లో ''నందనవనం' అన్నారు. 2005లో ''సేవ్ మూసీ క్యాంపెయిన్'' పేరుతో హంగామా... నేషనల్ రివర్ కన్జర్వేషన్ ప్లాన్ , జైకా, జపాన్ నిధుల ఖర్చు... 2014 వరకు సమైక్య పాలనలో కొనసాగిన దోపిడీ అన్నారు. కేటీఆర్ పాలనలో 16 వేల 634 కోట్లతో 'మూసీ సుందరీకరణ' డ్రామా... హుస్సేన్ సాగర్ కొబ్బరి నీళ్లుఅంటూ 'మూసీ రివర్‌ఫ్రంట్' ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. 8 వేల 500 పైచిలుకు అక్రమ కట్టడాల గుర్తించారు. 15 వేల మంది నిర్వాసితులకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని హామీ అన్నారు. అడుగు ముందుకు పడలే... మూసీ రివర్ ఫ్రంట్ కార్పొరేషన్ ఏర్పాటుతో రాజకీయ పునరావాసం.. తెలంగాణ సొమ్ము కర్ణాటక , మహారాష్ట్ర, పంజాబ్ పాలయ్యాయని ఆరోపించారు. ఇకఇప్పుడు రేవంత్ రెడ్డి వంతు... మూసీ ప్రక్షాళన... సుందరీకరణ... ఇప్పుడు పునరుజ్జీవం... లక్షన్నర కోట్లు ఖర్చు చేసి లండన్ లోని థేమ్స్ మాదిరిగా మారుస్తానని సీఎం అంటే... మంత్రులేమో దక్షిణ కొరియా సియోల్ లోని 'చంగ్ ఏ చంగ్' నదిలా మారుస్తామంటున్నారని తెలిపారు. మూసీని అడ్డుపెట్టుకుని కబ్జా చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం నేతల బిల్డింగ్ ల జోలికి పోయే దమ్ముందా? అని సవాల్ విసిరారు. పేదల ఇండ్ల జోలికొస్తే ఖబడ్దార్. వాళ్ల ప్రాణాలకు మా ప్రాణాలు అడ్డు పెడతామన్నారు. బుల్డోజర్లు రావాలంటే మమ్ముల్ని దాటిపోవాలే అన్నారు. మూసీ ప్రక్షాళనకు సబర్మతి నదితో పోలికా? నమామి గంగే ప్రాజెక్టుతో పోలికా? సబర్మతికి 7 వేల కోట్ల ఖర్చు అని తెలిపారు. వందల కి.మీల పొడవున్న నమామి గంగేకు 40 వేల కోట్లు మాత్రమే ఖర్చు అన్నారు. మూసీ ప్రాజెక్టు లక్షన్నర కోట్లు ఎందుకు? కిలోమీటర్ కు 2 వేల కోట్ల ఖర్చు ఎందుకు? అని ప్రశ్నించారు. అల్లుడి కోసమే మూసీ డ్రామాలాడుతున్నారని కీలక వ్యాఖ్యలు చేశారు.



## కేసీ వేణుగోపాల్‌తో మహేష్ కుమార్ గౌడ్ భేటీ

**పార్టీ కార్యకలాపాలపై వివరణ**

**ఢిల్లీ, విశ్వంభర:** ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ శుక్రవారం కుటుంబ సమేతంగా భేటీ అయ్యారు. సుమారు అరగంట పాటు ఈ భేటీ కొనసాగింది. ఈ సందర్భంగా కేసీ వేణుగోపాల్ తో రాష్ట్ర రాజకీయాల గురించి చర్చించారు. టీపీసీసీ అధ్యక్షునిగా 50 రోజుల పాటు తాను చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళుతున్న తీరును తెలియజెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం గత పది నెలలుగా చేపట్టిన 6 గ్యారంటీలు, రుణ మాఫీ, ఉద్యోగాల నియామకాలు, స్పోర్ట్స్, స్కిల్ యూనివర్సిటీల ఏర్పాటు, విదేశీ పెట్టుబడులు తదితర అంశాలను వివరించారు. నామినేటెడ్ పోస్టుల భర్తీలో పార్టీ కోసం పని చేసిన వారికి ప్రాధాన్యం, నాయకుల మధ్య సమన్వయం తదితర అంశాలను ప్రస్తావించారు. పార్టీ కార్యవర్గ ఏర్పాటు పై కూడా చర్చించారు.

## సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నాం: కిషన్‌రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** మూసీ సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని.. పేదల ఇళ్ల కూల్చివేతకు మాత్రమే వ్యతిరేకమని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. పేదల ఇళ్లను కూల్చే దుర్మార్గపు అలోచనను సీఎం రేవంత్ రెడ్డి విరమించుకోవాలని సూచించారు. 'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నాం.. మూసీ పరీవాహక ప్రాంతాల్లోని పేద ప్రజల ఇళ్లల్లో ఉండేందుకు మేం సిద్ధమే'' అన్నారు. సీఎంకు చిత్తశుద్ధి ఉంటే మూసీ పరీవాహక ప్రాంతాల్లో పర్యటించాలని డిమాండ్ చేశారు. మూసీ సుందరీకరణ-పునరుజ్జీవం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లను కూల్చుతున్న తీరును వ్యతిరేకిస్తూ.. మూసీ బాధితులకు అండగా నిలిచి వారికి భరోసా కల్పించేందుకు ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద బీజేపీ చేపట్టిన మహాధర్నాలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ప్రజల కనీస సౌకర్యాలు ముఖ్యమా.. రూ.లక్షల కోట్లు అప్పు చేసి మూసీ సుందరీకరణ ముఖ్యమో సీఎం తేల్చుకోవాలన్నారు. మూసీకి ఇరువైపులా రిటైనింగ్ వాల్ కట్టాలని సూచించారు. ఈ మహా ధర్నాలో మూసీ బాధితులు, భాజపా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ముఖ్య నేతలు నిరసన తెలిపారు.

# ఉద్రిక్తతలు, ఘర్షణతో ప్రపంచం

(మొదటి పేజీ తరువాయి)
ఏర్పడిందని చెప్పారు. తమది సమర్థత కలిగిన ప్రజాస్వామ్యాల భాగస్వామ్యమని అన్నారు. భారత పర్యటనలో భాగంగా ఢిల్లీ వచ్చిన జర్మనీ ఛాన్సలర్ ఒలాఫ్ షోల్జ్‌తో ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ద్వైపాక్షిక చర్చలు జరిపారు. జర్మనీ అమలు చేస్తున్న ఫోకస్ ఆన్ ఇండియా స్ట్రాటజీని తాము స్వాగతిస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. తమ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించాలనుకుంటున్నట్లు ఒలాఫ్ షోల్జ్‌తో చెప్పారు. జర్మన్ బిజినెస్ ఆసియా-పసిఫిక్ కాన్ఫరెన్స్‌లో తాను పాల్గొన్నానని, దాని వల్ల తమ ఆర్థిక సహకారానికి ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు. ఆర్థిక వ్యవస్థలను వైవిధ్యపరచడంలో సహాయపడుతుందని చెప్పారు. విద్య, నైపుణ్యం సహా పలు అంశాలపై రెండు దేశాలు కలిపి పనిచేస్తున్నందుకు సంతోషంగా ఉందని పేర్కన్నారు. యుద్ధం సమస్యలను పరిష్కరించదని, శాంతి కోసం సాధ్యమైన ప్రతి సహకారం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని వెల్లడించారు. అంతకుముందు ఢిల్లీలోనే జరిగిన 18వ ఆసియా-పసిఫిక్ కాన్ఫరెన్స్ ఆఫ్ జర్మన్ బిజినెస్-2024కు మోదీ హాజరై పలు వ్యాఖ్యలు చేశారు. దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు జర్మనీ పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. పెట్టుబడులకు భారత్ కంటే మెరుగైన ప్రాంతం మరొకటి లేదని చెప్పారు. దేశ ప్రగతి ప్రయాణంలో భాగస్వామి అయ్యేందుకు ఇదే సరైన సమయమని అన్నారు. విదేశీ పెట్టుబడిదారులంతా 'మేక్ ఇన్ ఇండియా' చొరవతో 'మేక్ ఫర్ ది వరల్డ్'లో చేరడానికి సరైన సమయం ఇదేనని ప్రధాని ఉద్ఘాటించారు. భారతీయుల నైపుణ్యంపై జర్మనీ వ్యక్తం చేసిన విశ్వాసం అద్భుతమని మోదీ అన్నారు. భారతీయులకు ఇచ్చే వీసాల సంఖ్యకు 20,000 నుంచి 90,000కు పెంచిన నిర్ణయాన్ని ప్రస్తావించారు. భారత్ గ్లోబల్ ట్రేడ్, మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారుతోంది మోదీ తెలిపారు. రోడ్లు, ఓడరేవుల్లో రికార్డు స్థాయిలో పెట్టుబడులు పెడుతున్నామని తెలిపారు. ప్రపంచ భవిష్యత్తుకు ఇండో-పసిఫిక్ ప్రాంతం చాలా ముఖ్యమైనదని అన్నారు. మరోవైపు, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో సమావేశం నిర్వహించుకుంటున్నామని ఓలాఫ్ స్కోల్జ్ తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ భారత్‌ది అంటూ కితాబిచ్చారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు వచ్చిన ఓలాఫ్ స్కోల్జ్, శుక్రవారం ఉదయం ప్రధాని నరేంద్ర మోదీ అధికారిక నివాసంలో ఆయనను కలిశారు.

## సరిహద్దుల్లో బలగాల ఉపసంహరణ

(మొదటి పేజీ తరువాయి)
వెనక్కి వెళ్తున్నట్లు తెలిపారు. సరిహద్దులకు ఇరు వైపులా దాదాపు 10-12 తాత్కాలిక నిర్మాణాలు, 12 టెంట్లు ఉన్నట్లు తెలుస్తోంది. బలగాల ఉపసంహరణ ప్రక్రియంతా పూర్తయిన తర్వాత మరో 4-5 రోజుల్లో డెస్పాంగ్, డెమ్చోక్ ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ను పునరుద్ధరించనున్నట్లు సమాచారం. 2020 జూన్ 15న తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో భారత్-చైనా సైనికుల మధ్య జరిగిన తీవ్ర ఘర్షణ ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. ఘర్షణలో తెలంగాణకు చెందిన కర్నల్ సంతోష్ బాబు సహా 20 మంది భారత సైనికులు వీరమరణం పొందారు. చైనా కూడా భారీగా సైనికులను కోల్పోయింది. కానీ ఆ సంఖ్యను వెల్లడించలేదు. చాలా నెలల తర్వాత ఐదుగురు చనిపోయినట్లు అధికారికంగా అంగీకరించింది. ఘర్షణల నేపథ్యంలో ఇరు దేశాలు ఎల్ఏసీ వెంబడి భారీ స్థాయిలో బలగాలను మోహరించాయి. అప్పటి నుంచి రెండు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆ తర్వాత ప్రతిష్టంభనను తొలగించేందుకు ఇరు దేశాల మధ్య పలుమార్లు దౌత్య, కమాండర్ స్థాయి చర్చలు జరిగాయి. వాటి ఫలితంగా ఇప్పటికే కొన్ని ప్రాంతాల నుంచి బలగాలను ఉపసంహరించగా ఘర్షణల కేంద్రమైన డెమ్చోక్, డెస్పాంగ్ వద్ద మాత్రం బలగాలు కొనసాగుతూ వచ్చాయి. ఇటీవల వాస్తవాధీన రేఖ వెంబడి గస్తీ పునఃప్రారంభంపై ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం 2020 గల్వాన్ ఘర్షణలకు ముందు నాటి యథాస్థితి ఎల్ఏసీ వెంబడి కొనసాగనుంది. ఇరు దేశాల సైనికులు గస్తీ నిర్వహించిన పెట్రోలింగ్ పాయింట్లకు స్వేచ్ఛగా వెళ్లొచ్చు. ఇటీవల జరిగిన బ్రిక్స్ సదస్సులో ఈ ఒప్పందాన్ని ఇరు దేశాల నేతలు మోదీ, జిన్‌పింగ్ ధ్రువీకరించారు.

# గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడి

(మొదటి పేజీ తరువాయి)
లెబనాన్‌పై దాడుల తీవ్రత పెంచిన ఇజ్రాయెల్ గాజా పట్టిలోని ఖాన్ యూనిస్‌పై శుక్రవారం ఉదయం దాడి చేసింది. అయితే అంతర్జాతీయంగా ఒత్తిడి వస్తున్నా ఇజ్రాయెల్ దాడులు మాత్రం ఆపడం లేదు.

**ముగ్గురు జర్నలిస్టుల మృతి**

ఇదిలా ఉండగా, లెబనాన్‌పై ఇజ్రాయెల్ చేసిన దాడిలో ముగ్గురు టీవీ జర్నలిస్టులు చనిపోయినట్లు లెబనాన్ మీడియా పేర్కొంది. మృతుల్లో తమ స్టాఫర్లు- కెమెరా ఆపరేటర్ ఘస్సన్ నజర్, బ్రాడ్ కాస్ట్ ఆపరేటర్ మహ్మద్ రిదా ఉన్నారని బీరుట్‌కు చెందిన అల్-మయదీన్ టీవీ తెలిపింది. ఇక హెజ్‌బొల్లా సంస్థకు సంబంధించిన అల్-మనర్ టీవీ, తమ కెమెరా ఆపరేటర్ వాసిమ్ ఖాసిమ్ సైతం ఇజ్రాయెల్ దాడిలో మృతి చెందినట్లు వెల్లడించింది.

**'అల్-జజీరాలో ఆరుగురు ఉగ్రవాదులు'**


ఇటీవల ప్రముఖ అరబ్ మీడియా సంస్థ అల్-జజీరా పై ఇజ్రాయెల్ తీవ్ర ఆరోపణలు చేసింది. ఆ సంస్థకు చెందిన ఆరుగురు జర్నలిస్టులు ఉగ్రవాదులంటూ ఇజ్రాయెల్ ఆరోపించింది. పాలస్తీనాకు చెందిన హమాస్, ఇస్లామిక్ జిహాద్ గ్రూప్‌లతో వారు కలిసిపోయారని మండిపడింది. కాగా, ఇజ్రాయెల్ చేసిన ఆరోపణలపై అల్‌జజీరా తీవ్రంగా ఖండించింది.

**నోబెల్ శాంతి బహుమతి గ్రహీతకు జైలు శిక్ష పొడిగింపు**

ఇరాన్‌కు చెందిన నోబెల్ శాంతి బహుమతి గ్రహీత నర్గెస్ మొహమ్మదికి అక్కడి అధికారులు 6 నెలలు జైలు శిక్ష పొడిగించారు. ఆదేశాలను ధిక్కరించినందుకు, నిరాకరించినందుకు శిక్ష పొడిగించినట్లు తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 6న ఎవిన్ జైలులోని మహిళా వార్డులో మరో రాజకీయ ఖైదీని ఉరితీసినందుకు మొహమ్మది నిరసన తెలిపారని, అందుకే ఆమెపై ఈ అభియోగాలు మోపినట్లు 'ది ఫ్రీ నర్గెస్ కొయలేషన్' ఓ ప్రకటనలో తెలిపింది. నార్గెస్ మొహమ్మది 2023 ఏడాదికి గానూ నోబెల్ శాంతి బహుమతి అందుకున్నారు. నోబెల్ శాంతి బహుమతి గెలుచుకున్న 19వ మహిళగా, మానవహక్కుల కార్యకర్త షిరిన్ ఏబాది(2003) తర్వాత రెండో ఇరానియన్‌గా చరిత్రకెక్కారు. మహిళలపై వివిధ రకాల ఆంక్షలు, కట్టుబాట్లతో నిండి ఉన్న పితృస్వామ్య వ్యవస్థలో, అలాంటి అసమానతల్ని తొలగించి అక్కడి మహిళలకు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను ప్రసాదించడానికి దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నారు నర్గెస్ మొహమ్మది. ఈ క్రమంలో ఆమె అనేక సార్లు జైలుకు కూడా వెళ్లారు. కానీ తన పోరాటాన్ని మాత్రం ఆపలేదు.

# అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)
ఎన్ఓసి లతో పాటు పాలనా పరమైన అనుమతులు సులభతరం చేయనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే అనుమతులు పొందిన వారు అధైర్యపడొద్దని ఆయన పేర్కొన్నారు .క్రేడాయ్, ట్రెడా లు సంయుక్తంగా ఒక కమిటీని నియమించుకోవాలని ఆయన సూచించారు. తద్వారా మీరు ఎదుర్కొంటున్న సనస్యలపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరపడానికి మార్గం సుగమం అవుతుందన్నారు. రియల్ ఎస్టేట్ రంగంతో పాటు నిర్మాణదారులు ఏ సమయంలో ఏ విషయంలో నైనా ప్రభుత్వాన్ని సంప్రదించేందుకు ఈ కమిటీ దోహదపడుతుందన్నారు.
అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచం నలుమూలల నుండి పారిశ్రామిక వేత్తలు తరలి రావడమే అందుకు అద్దం పడుతుందన్నారు. అటువంటి అభివృద్ధి లో



రియల్టర్లు, బిల్డర్లు భాగస్వామ్యం కావాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. అభివృద్ధిపై కాంగ్రెస్ పార్టీకీ స్పష్టత ఉందన్నారు. హైదరాబాద్ అభివృద్ధి కి రాష్ట్ర బడ్జెట్ లో 10,000 కోట్లు కేటాయించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఔటర్ రింగ్ రోడ్ నిర్మించిన ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానిదే నని ఆయన చెప్పారు.
ఇప్పుడు అధికారంలోకి వచ్చిందే తడవుగా రీజనల్ రింగ్ రోడ్ తో పాటు కనెక్టివిటీ రహదారుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టామన్నారు. మెట్రో విస్తరణ వేగవంతం చేయడంతో పాటు ట్రాఫిక్ ను క్రమ బద్దీకరించేందుకు సన్నాహాలు పూర్తి అయ్యాయన్నారు. తాగునీటి సామర్థ్యాన్ని పెంచే అంశం పరిశీలనలో ఉందన్నారు.
ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య విశ్వవిద్యాలయం ఏర్పాటు అవుతుందన్నారు. అదే విధంగా అంతర్జాతీయ స్థాయిలో క్రిడా విశ్వవిద్యాలయం నెలకోల్పుతున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. తద్వారా రియల్ ఎస్టేట్ రంగంతో పాటు నిర్మాణదారులకు ఈ అభివృద్ధి ఉపకరిస్తుందని-,అదే సమయంలో రియల్టర్లు, బిల్డర్లు అభివృద్ధిలో భాగస్వామ్యం అయి ప్రభుత్వానికి తోడ్పాటు అందించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.


## పద్మశ్రీ అవార్డు గ్రహీత కనకరాజు కన్నుమూత



**విశ్వంభర, ఎదులాపురం:** గుస్సాడి నృత్యకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత కనకరాజు కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం రాత్రి కుమురంభీం జిల్లా జిల్లా జైనూరు మండలం మార్లవాయిలో తుదిశ్వాస విడిచారు. గుస్సాడి నృత్యానికి జాతీయ గుర్తింపు తెచ్చినందుకు గాను 2021లో కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. శనివారం మార్లవాయిలో కనకరాజు అంత్యక్రియలు ఆదివాసీ సంప్రదాయం ప్రకారం నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

# సంధి దిశగా ఇజ్రాయెల్, హమాస్ అడుగులు!

- కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చలు
- ఒప్పందం కుదిరితే పోరాటానికి హమాస్ ఫుల్‌స్టాప్



**గాజా :** సుదీర్ఘంగా కొనసాగుతున్న ఇజ్రాయెల్, హమాస్‌ల మధ్య యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియా అట్టుడుకుతోంది. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య కాల్పుల విరమణ దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. గాజాలో కాల్పుల విరమణ ఒప్పంద చర్చల్లో తమ స్పై చీఫ్ పాల్గొంటున్నారని ఇజ్రాయెల్ పేర్కొంది. మరోవైపు ఒప్పందం కుదిరితే పోరాటం ఆపేస్తామని హమాస్ వర్గాలు సైతం వెల్లడించాయి.
దోహాకు చెందిన ఓ అధికార ప్రతినిధి బృందం కైరోలో ఈజిప్టు అధికారులతో గాజా సంధికి సంబంధించిన ప్రతిపాదనలపై చర్చించినట్లు హమాస్‌కు చెందిన ఓ సీనియర్ అధికారి మీడియా సంస్థకు తెలిపారు. 'హమాస్ పోరాటాన్ని ఆపడానికి సంసిద్ధత వ్యక్తంచేసింది. అయితే, ఇజ్రాయెల్ కాల్పుల విరమణకు కట్టుబడి ఉండాలి. యుద్ధం నేపథ్యంలో గాజా నుంచి వెళ్లిపోయిన ప్రజలను తిరిగి అనుమతించాలి. ఖైదీల మార్పిడి ఒప్పందాన్ని అంగీకరించడంతో పాటు గాజాకు అందే మానవతా సాయానికి అడ్డు తొలగాలి' అని ఆయన వెల్లడించారు.
మరోవైపు.. 'బందీలను విడుదల చేయడానికి ఓ ఒప్పందాన్ని కుదుర్చుకోవడాన్ని స్వాగతిస్తున్నాం' అని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పేర్కొన్నారు. కైరో సమావేశం అనంతరం ఇజ్రాయెల్‌కు చెందిన మొస్సాద్ గూఢాచార సంస్థ అధిపతిని అజెండాలోని ముఖ్యమైన కార్యక్రమాలను ముందుకుతీసుకెళ్లేందుకు ఖతార్‌కు వెళ్లాలని ఆదేశించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది. గతేడాది అక్టోబరు 7న హమాస్ దాడులకు సూత్రధారి అయిన యాహ్యా సిన్వర్ ఇటీవల ఇజ్రాయెల్ దాడిలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈక్రమంలోనే సిన్వర్ మరణం ఓ ఒప్పందానికి దారి తీస్తోందని ఆమెరికా ఆశాభావం వ్యక్తం చేసింది. ఈనేపథ్యంలోనే ఆ దిశగా చర్చలు జరుగుతుండడం గమనార్హం.

# ఏపీలో ఎస్సీ వర్గీకరణ అమలు వేగవంతం చేయాలి..

- వర్గీకరణ ప్రారంభం అయ్యేవరకు ఎటువంటి జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వకూడదు
- మందకృష్ణ మాదిగ




**విశ్వంభర, గుంటూరు :** ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ అమలు వేగవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు.శుక్రవారం గుంటూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నవంబర్ మొదటి వారంలో డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుంది అని మంత్రి లోకేష్ చెప్పారు.. ఎస్సీ వర్గీకరణ ప్రారంభం అయ్యేవరకు ఎటువంటి జాబ్ నోటిఫికేషన్‌లు ఇవ్వకూడదని అన్నారు. తమ విజ్ఞప్తికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. షెడ్యూల్ కులాల వర్గీకరణ ఆగష్టు 1న సుప్రీం కోర్ట్ తీర్పు ఇచ్చింది.. ఎస్సీ వర్గీకరణ చట్టం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు చంద్రబాబు నాయుడు తీసుకు వచ్చారని మందకృష్ణ పేర్కొన్నారు. 2006లో ఎస్సీ వర్గీకరణ చట్టం తెచ్చింది పంజాబ్‌లోనని మందకృష్ణ మాదిగ అన్నారు. 2009లో తమిళనాడు ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా చట్టం తెచ్చారు.. ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి ఉన్న సమయంలో ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టులో లాయర్‌ను నియమించలేదన్నారు. రాష్ట్రంలో ఇంత వరకు ఎస్సీ వర్గీకరణ ప్రారంభం కాలేదు.. మిగతా రెండు రాష్ట్రాల్లో అమలులో ఉందని చెప్పారు. మరో మూడు రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణకు ముందుకు వచ్చాయని అన్నారు. వర్గీకరణ లేని రాష్ట్రల్లో హర్యానా, మహారాష్ట్ర, తెలంగాణలో కూడా ఎస్సీ వర్గీకరణ ముందుకు సాగుతుందని తెలిపారు.
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు అయ్యే వరకు ఎటువంటి నోటిఫికేషన్లు ఇవ్వమని తెలిపిందని మందకృష్ణ మాదిగ అన్నారు. జగన్ ప్రభుత్వం అప్పట్లో ఎస్సీ వర్గీకరణ జరగకముందే నోటిఫికేషన్లు ఇచ్చారు..గత జగన్ పాలనలో ఇచ్చిన జాబ్ నోటిఫికేషన్‌లో కూడా ఎస్సీ వర్గీకరణ వర్తింప చేయాలని కోరారు. ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడానికి మాదిగలు శక్తి వంచన లేకుండా పని చేసారని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు.

# అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించిన పుతిన్

**ఉక్రెయిన్‌పై దాడి యూఎన్ ఛార్టర్‌కు విరుద్ధం**

**రష్యా అధ్యక్షుడికి చెప్పిన ఐరాస చీఫ్ గుటెరస్**



**మాస్కో :** రష్యాలోని కజన్ వేదికగా బ్రిక్స్ సదస్సు జరిగిన విషయం తెలిసిందే. ఈ సదస్సుల్లో పాల్గొన్న ఐక్యరాజ్య సమితి అధ్యక్షుడు ఆంటోనియా గుటెరస్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అయ్యారు. ఈ క్రమంలో ఉక్రెయిన్‌పై దాడి చేయడం యూఎన్ చార్టర్, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని గుటెరస్ పుతిన్‌తో పేర్కొన్నట్లు యూఎన్ అధికార ప్రతినిధి పేర్కొన్నారు. 'ఉక్రెయిన్‌పై దాడులకు తెగబడుతున్న రష్యా యూఎన్ చార్టర్, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తున్న వైఖరిని యూఎన్ చీఫ్ పునరుద్ఘాటించారు. నల్ల సముద్రంలో నావిగేషన్ స్వేచ్ఛను నెలకొల్పడానికి తన నిబద్ధతను నొక్కి చెప్పారు. ఈ చర్య ఉక్రెయిన్, రష్యాతో పాటు ప్రపంచ ఆహార, ఇంధన భద్రతకు ముఖ్యమైనదిగా తెలిపారు. శాంతి స్థాపన చర్చలకు ఆయన మద్దతు ప్రకటించారు. ఈనేపథ్యంలోనే మధ్యప్రాచ్యంలో నెలకొన్న పరిస్థితులపైనా చర్చించారు' అని యూఎన్ అధికార ప్రతినిధి తెలిపారు. ఈ మాటలను క్రెవ్ కొట్టిపడేసింది.

**ట్రంప్ చిత్తశుద్ధి కలిగిన వ్యక్తి: పుతిన్**

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ బ్రిక్స్ సదస్సులో అమెరికాతో సంబంధాలపై స్పందించారు. 'అమెరికాలో ఎన్నికల తర్వాత రష్యా అమెరికా సంబంధాలు ఎలా అభివృద్ధి చెందుతాయి అనేది ఆ దేశంపై ఆధారపడి ఉటుంది. అవి బహిరంగంగా ఉంటే మేము అలానే ఉంటాం. వారు అలా కోరుకోకపోయినా మంచిదే. ట్రంప్ ఉక్రెయిన్‌తో వివాదానికి ముగింపు పలకాలనే వ్యాఖ్యలను స్వాగతిస్తున్నాం. ఆయన చిత్తశుద్ధితో ఉన్నట్లు నేను భావిస్తున్నా. ఇలాంటి ప్రకటనలు ఎవరి నుంచి వచ్చినా స్వాగతిస్తా' అని పుతిన్ పేర్కొన్నారు. ఉక్రెయిన్ రష్యాల మధ్య యుద్ధం నేపథ్యంలో అమెరికా, రష్యాల మధ్య సంబంధాలు తీవ్రస్థాయిలో దెబ్బతిన్నాయి. ఈనేపథ్యంలోనే అమెరికా ఉక్రెయిన్‌కు సైనిక, ఆర్థికసాయం అందించడాన్ని ట్రంప్ తప్పుపట్టారు. తాను ఎన్నికైతే కొన్ని గంటల్లోనే పోరాటాన్ని ముగిస్తానని వ్యాఖ్యానించారు.

# ట్రంప్ ప్రచారానికి మస్క్ అండ

**కోట్లు కుమ్మరిస్తున్న ప్రపంచ కుబేరుడు**

**ప్రచారం కోసం మరో రూ. 470 కోట్లు అందజేత**

**ఇప్పటివరకు రూ.1,109 కోట్ల ఖర్చు**



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి ఆ దేశ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రచారానికి టెస్లా అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మద్దతివ్వడమే కాకుండా పెద్ద మొత్తంలో విరాళాలు అందజేస్తున్నారు. ట్రంప్ తరఫున ప్రచార కార్యక్రమాల నిర్వహణ కోసం తాజాగా మస్క్ మరో రూ.470 కోట్లు అందజేసినట్లుగా ఫెడరల్ ఎలక్షన్ కమిషన్ వెల్లడించినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. ట్రంప్ కోసం ఇప్పటివరకు ఆయన రూ.1,109 కోట్లు ఖర్చు చేసినట్లుగా తెలిపింది.
అధ్యక్ష ఎన్నికల ప్రచారాల్లో ట్రంప్‌నకు గానీ, బైడెన్‌కు గానీ తనవైపు నుంచి ఆర్థిక సహకారం ఉండబోదంటూ గతంలో ప్రకటించిన మస్క్.. తాజాగా ట్రంప్ తరఫున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్న పొలిటికల్ యాక్షన్ కమిటీకి పెద్ద మొత్తంలో విరాళాలు కుమ్మరిస్తుండటం గమనార్హం.
విరాళాలు ఇవ్వడమే కాకుండా మస్క్ ట్రంప్ కోసం ముమ్మర ప్రచారాలు నిర్వహిస్తున్నారు. ఫిలడెల్ఫియాలో ట్రంప్‌నకు మద్దతుగా సోలో క్యాంపెయిన్ నిర్వహించారు. ట్రంప్ ప్రచార కార్యక్రమాల కోసం పొలిటికల్ యాక్షన్ కమిటీని ఏర్పాటుచేసి 75 మిలియన్ డాలర్ల విరాళాన్ని ఇచ్చారు. ముఖ్యంగా అధ్యక్ష ఎన్నికలను ప్రభావితం చేసే స్వింగ్ స్టేట్స్‌లో ట్రంప్‌నకు మద్దతుగా భారీగా ఖర్చు పెడుతున్నారు. ఓటర్లను ట్రంప్‌నకు అనుకూలంగా మార్చేందుకు మస్క్ తాయిలాలు ఇస్తున్నట్లుగా, వాక్ స్వాతంత్ర్యం, తుపాకీ హక్కులపై తాము రూపొందించిన పిటిషన్‌పై సంతకాలు చేసిన ఓటర్లకు ఆయన డబ్బులు పంచుతున్నట్లు సమాచారం.
ఇదిలాఉంటే.. తాను అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైతే టెస్లా సీఈవో ఎలాన్ మస్క్‌కు కేబినెట్‌లో చోటిస్తానని.. అలా కానిపక్షంలో సలహాదారుడిగానైనా నియమించుకుంటానని ట్రంప్ ఇటీవల జరిగిన ఓ ర్యాలీలో ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై మస్క్ సానుకూలంగా స్పందిస్తూ 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ'కి నేతృత్వం వహించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు. మరోవైపు మస్క్ తానే సృష్టించినట్లుగా చెబుతున్న పొలిటికల్ యాక్షన్ కమిటీ పై మిషిగన్, నార్త్ కరోలినా ఎన్నికల బోర్డు అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ కమిటీ ఓటర్ల సమాచారాన్ని దుర్వినియోగం చేస్తోందని.. అనేకమందిపై నిఘా వేస్తోందనే ఆరోపణలున్నాయి.

# హిందుస్థాన్ షిప్ యార్డు ముందడుగు

**విశ్వంభర, వైజాగ్ :** భారత్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌లో మరో కీలక ఘట్టం అవిష్కృతమైంది. రక్షణ రంగ ప్రభుత్వ సంస్థ విశాఖ హిందుస్థాన్ షిప్ యార్డు (హెచ్ఎస్ఎల్) గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో ముందడుగు వేసింది. సముద్రంలో ఉపయోగించే పరికరాలకు అవసరమైన గ్రీన్ ఎనర్జీ బ్యాటరీల ఉత్పత్తి టెక్నాలజీని హిందుస్థాన్ షిప్ యార్డు సిద్ధం చేసింది. కొరియన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీ అసోసియేట్, భారతీయ పరిశ్రమ భాగస్వామి లోటస్ వైర్‌లెస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి ఈటెక్నాలజీని హెచ్ఎస్ఎల్ రూపొందించింది.
భారతీయ సముద్ర రంగానికి అత్యాధునిక హైడ్రోజన్ ఇంధన సెల్ టెక్నాలజీని పరిచయం చేసేందుకు ఇది తోడ్పడుతుందని హెచ్ఎస్ఎల్ వెల్లడించింది. 250 కేవీ నుంచి 2 ఎంవీ వరకు హైడ్రోజన్ ఇంధన బ్యాటరీల తయారీకి ఈ టెక్నాలజీ ఉపకరిస్తుందని ప్రకటించింది. పూర్తి సురక్షితంగా వివిధ సముద్ర ఉపకరణాలకు సరిపోయే రీతిలో ఇవి సిద్ధం చేసుకునే అవకాశం ఉందని వివరించింది.
సంప్రదాయ డీజిల్‌తో నడిచే వ్యవస్థలకు స్థిరమైన ప్రత్యామ్నాయంగా ఈ గ్రీన్ హైడ్రోజన్ సాంకేతికత పని చేస్తుందని తెలిపింది. సముద్రపు పరికరాలకు వాటి అవసరాలకు సరిపడా ఈ గ్రీన్ హైడ్రోజన్ పవర్ ఉత్పత్తికి అవసరమైన సాంకేతికను అందిస్తామని హిందుస్థాన్ షిప్ యార్డు వెల్లడించింది.

## చెన్నైలో గ్యాస్ లీక్..
# ప్రైవేట్ స్కూల్‌లో 30 మంది విద్యార్థులకు అస్వస్థత..



**చెన్నై :** చెన్నైలో గ్యాస్ లీకేజ్ కారణంగా ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఉత్తర చెన్నైలోని తిరువొత్తియూర్ సమీపంలోని ఒక ప్రైవేట్ పాఠశాలకు చెందిన అనేక మంది విద్యార్థులు శుక్రవారం అనుమానాస్పద గ్యాస్ లీక్ కారణంగా శ్వాస తీసుకోవడం, తల తిరగడం, వికారం వంటి లక్షణాలతో ఆసుపత్రి పాలయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనలో.. ప్రధానంగా పాఠశాల మూడో అంతస్తులోని 810 తరగతి విద్యార్థులే ఎక్కువగా ప్రభావితమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దాదాపుగా 30 మంది విద్యార్థులు అస్వస్థత పాలయ్యారు. వారంతా ఇప్పుడు బాగానే ఉన్నారని, వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు మొదట ఏదో ఘాటైన వాసన వచ్చినట్లు చెప్పారు. ఆ తర్వాత మైకం, శ్వాస తీసుకోవడంతో ఇబ్బందులు ఏర్పడినట్లు తెలిపారు. తక్షణమే వైద్య సాయం కోసం పాఠశాల అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రారంభంలో, ఈ లీకేజీ కెమెస్ట్రీ ల్యాబ్ నుంచి ఉండొచ్చని అనుమానించారు. అయితే, ఈ ఘాటైన వాసనకు గల కారణాలను అధికారులు ఇంకా నిర్ధారించలేదు. దీని గురించి తెలుసుకునేందుకు పోలీసులు పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. బాధిత విద్యార్థుల పరిస్థితిని అంచనా వేయడానికి సీనియర్ పోలీస్ అధికారులు ప్రస్తుతం పాఠశాల మైదానాలను , ఆసుపత్రులను సందర్శిస్తున్నారు. విద్యార్థుల భద్రత కోసం అత్యవసర చర్యలు తీసుకుంటున్నారు.

# గంగవ్వకు భారీ ఊరట..

**విశ్వంభర, హైదరాబాద్ :** ప్రముఖ యూట్యూబర్, బిగ్‌బాస్ తెలుగు ఎనిమిదో సీజన్ కంటెస్టెంట్ గంగవ్వ ఇటీవల ఓ వివాదంలో ఇరుక్కున్నారు. ఆమె చేసిన ఓ వీడియోకు సంబంధించి గంగవ్వతో పాటు మరో యూట్యూబర్ రాజుపై కేసులు నమోదయ్యాయి. అయితే ఇప్పుడు ఆ కేసు క్లోజ్ అయినట్లు సమాచారం. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. 2022 లో గంగవ్వ, రాజు కలిసి 'మై విలేజ్ షో' కోసం ఒక వీడియో చేశారు. ఈ వీడియో కోసం ఒక చిలుకను కూడా ఉపయోగించారు. దీంతో స్ట్రే యానిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా అనుబంధ జంతు సంరక్షణ కార్యకర్త అదులాపురం గౌతమ్ జగిత్యాల అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. అటవీశాఖ పోలీసులు గంగవ్వ, రాజులపై కేసు నమోదు చేశారు. అయితే తాజాగా ఈ కేసులో గంగవ్వకు భారీ ఊరట లభించినట్లు సమాచారం. దీనికి గానూ మై విలేజ్ షో బృందం రూ.25 వేల జరిమానా కట్టినట్లు డీఎఫ్ఓ తెలిపారు. చిలుక జోస్యం వీడియోను కూడా యూట్యూబ్ ఛానెల్ నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు.









# మళ్లీ మనకు నోబెల్ వెలుగులు ఎప్పుడు..?

**ఎన్నో శతాబ్దాల క్రిందటే ప్రపంచ విజ్ఞానానికి గణితం, ఖగోళ శాస్త్రం, ఆయుర్వేదం, రసాయన శాస్త్రాల్లో శాస్త్రవేత్తలు చేసిన కృషి కారణంగా నేటి ఆధునిక సైన్స్ కు భారతదేశం పునాదిగా నిలిచిందని ఐన్ స్టీన్ అన్నారు. ఆర్యభట్ట, బ్రహ్మగుప్త, మహావీర, వరాహమిహిర, భాస్కర, పతంజలి,చరక, సుశ్రుత, భరద్వాజ తదితరుల వంటి విఖ్యాత శాస్త్రవేత్తల మేధస్సు ప్రపంచపు పరిజ్ఞానాన్ని ప్రభావితం చేసిందన్నారు. మనకు స్వాతంత్ర్యం రాకముందే బ్రిటీష్ వారి క్రింద బానిసత్వపు పాలన కాలంలోనే ఆసియా ఖండంలోనే సాహిత్యంలో రవీంద్రనాథ్ ఠాగూర్, భౌతికశాస్త్రంలో సి.వి రామన్ వంటి మహానుభావులు తొలి నోబెల్ సాధించి భారతీయుల సత్తా ప్రపంచానికి తెలియజెప్పారు.నేడు జనాభా లోనే అగ్రస్థానంలో ఉంటూ,ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ను సైతం ప్రభావితం చేస్తూ, శతాబ్దాల నాగరికతను కలిగివున్న భారతదేశం నుంచి కేవలం మన పౌరసత్వంతో ఫిజిక్స్ లో, సాహిత్యంలో 78 వసంతాల స్వాతంత్ర్య భారత్ నుంచి మనం నోబెల్ బహుమతి గెలవలేకపోయామంటే మనల్ని మనం ప్రశ్నించుకోవలసిందే. ప్రతిభకు అత్యుత్తమ కొలమానం నోబెల్ బహుమతి కానప్పటికీ, నోబెల్ కమిటీలపై ఎన్నో వివాదాస్పద వ్యాఖ్యలు ఉన్నప్పటికీ ఆ బహుమతుల విలువను ప్రపంచం "విశ్వ విజేత స్థాయి"గానే చూస్తుందనడం మనం కాదనలేని సత్యం.**

## గీతాంజలితో విశ్వకవి ఠాగూర్ కు నోబెల్



గీతాంజలి వంటి అసాధారణ, అసామాన్యమైన రచనతో 1913 లోనే నోబెల్ సాహిత్య బహుమతి గెలిచారు మన విశ్వ కవి రవీంద్రనాథ్ ఠాగూర్.మన జనగణమన గీతంతో పాటు బంగ్లాదేశ్ దేశపు జాతీయ గీతాన్ని ఠాగూర్ రచించారు.శాంతినికేతన్ స్థాపనతో నేటి ఆధునిక భారతీయ విద్యా విధానంలో కూడా వారి ఆలోచనలు మనకు మార్గదర్శనం చేస్తున్నాయి.ఆల్బర్ట్ ఐన్ స్టీన్, మహాత్మా గాంధీజీ వంటి విఖ్యాత ప్రముఖులతో సైతం ఎన్నో ఆధ్యాత్మిక, తాత్విక, పర్యావరణ,శాస్త్రీయ విశ్లేషణలను పంచుకున్నారు. వివేకానంద వారి రచనల నుంచి ఠాగూర్ ప్రేరణ పొందారు.

## రామన్ ఎఫెక్ట్‌తో ఫిజిక్స్‌లో నోబెల్

"నా మతం సైన్స్..నేను దాన్నే ఆరాధిస్తాను..నిత్య సాధకులైన వారే నా వారసులు"అంటూ కేవలం ?200 పరికరాల సాయంతో రామన్ ఎఫెక్ట్ ను కనుగొని 1930 లో మనకు ఫిజిక్స్ విభాగంలో నోబెల్ అందించారు.నోబెల్ బహుమతి తీసుకునే సందర్భంగా మన దేశపు జెండా లేనందుకు కన్నీటి పర్యంతమవుతూ, నిజాయితీతో కూడిన భావోద్వేగాల తన దేశభక్తిని ప్రదర్శించి నిజమైన భారత రత్నంగా భవిష్యత్తు తరాలకు ఆదర్శమయ్యారు.1943 లో తానే సొంతంగా బెంగళూరు లో రామన్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ స్థాపించి మన దేశంలోనే విక్రమ్ సారాభాయ్, హెూమీ జహంగీర్ బాబా, అబ్దుల్ కలాం వంటి మహామహులకు దిక్సూచిగా నిలిచారు.నేటి ఆధునిక ప్రపంచం సైతం ఇంకా "రామన్ ఎఫెక్ట్ కు ఎఫెక్ట్ అవుతూనే ఉంటూ ఎన్నో ప్రకృతి రహస్యాలను చేధిస్తోంది..

## భారతీయ మూలాలు కలిగిన నోబెల్ విజేతలు వీరే..

సీవీ రామన్ బంధువు అయిన సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్ విఖ్యాత ఖగోళ భౌతిక శాస్త్రవేత్త.భారతీయ- అమెరికన్ గా నక్షత్రాల పరిణామంపై పరిశోధనలు చేసి చంద్రశేఖర్ లిమిట్ తో ఖ్యాతి గడించారు.బ్లాక్ హెూల్స్ పై వీరి పరిశోధనల విషయాలు చాలా ప్రాచుర్యతను సంతరించుకున్నాయి.వీరి కృషికి గుర్తింపుగా 1983 లో విలియం ఎ.ఫౌలర్ తో కలిసి భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి అందుకున్నారు. వీరిలాగే మదర్ థెరిస్సా,హరగోవింద్ ఖొరానా, అమర్త్యసేన్,వెంకట్రామన్ రామకృష్ణన్ వంటి వారు మన దేశ మూలాలు కలిగిన నోబెల్ విజేతలు.

## కైలాస్ సత్యార్థి...అలుపెరగని ప్రయాణం

2014 లో మలాలా యూసఫ్ జాయ్ తో కలిసి ప్రఖ్యాత భారతీయ బాలల హక్కుల ఉద్యమకారుడు కైలాస్ సత్యార్థి మన దేశ పౌరసత్వంతో నోబెల్ శాంతి బహుమతి గెలిచారు.గాంధీజీ నుంచి ప్రేరణ పొందిన వీరు "బచ్ పన్ బచావో ఆందోళన్" వంటి ఎన్నో కార్యక్రమాలతో బాలకార్మిక వ్యవస్థ పై,విద్యా వ్యవస్థపై ఎన్నో ఉద్యమాలు చేశారు.లక్షల మంది పిల్లల జీవితాలను మార్చారు.కొన్ని సందర్భాల్లో ఎన్నో విమర్శలు, భౌతిక దాడులు ఎదుర్కొన్నప్పటికీ "నువ్వు కాకపోతే ఇంకెవరు? ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ? అంటూ సమాజంలో మార్పు రావాలని అలుపెరగని ప్రయాణం చేస్తున్నారు.

## నోబెల్ విజేతలకే గాంధీజీ స్ఫూర్తి అయినా..

గాంధీజీ, అరబిందో,మేఘనాథ్ సాహా,హెూమీ జహంగీర్ బాబా,సత్యేంద్రనాథ్ బోస్, సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి మన దేశ ప్రముఖులు ఎన్నో సార్లు నోబెల్ బహుమతికి నామినేట్ అయినప్పటికీ ఎన్నో ఆనాటి రాజకీయ, సామాజిక కారణాల చేత అవార్డుకు ఎంపిక కాలేదు. విశేషం ఏమంటే సత్యేంద్రనాథ్ బోస్ వంటి వారి కనుగొన్న దైవ కణం విషయాలపై పరిశోధనలు చేసిన వారు నోబెల్ గెలిచారు. గాంధీజీని ఆదర్శంగా తీసుకొని ప్రపంచ వ్యాప్తంగా అహింసా మార్గంలో పోరాటం చేసిన ఎంతోమంది నోబెల్ శాంతి బహుమతికి ఎంపికయ్యారు.ఒబామా, మార్టిన్ లూథర్ కింగ్, దలైలామా, ఆంగ్ సాన్ సూకీ వంటి నోబెల్ విజేతలకు గాంధీజీ నే రియల్ హీరో. చరిత్రను పరిశీలిస్తే 1948 లో గాంధీజీ హత్యకు గురికాకుంటే ఆ సంవత్సరం గాంధీజీ కి నోబెల్ దక్కేదేమో! గాంధీజీ నోబెల్ వివాదంపై 2006 లో నోబెల్ కమిటీ "మన 106 సంవత్సరాల చరిత్రలో అతి పెద్ద లోపం"అంటూ స్పందించింది.

## మనకు నోబెల్ బహుమతులు దక్కాలంటే...

ఏడు దశాబ్దాల స్వాతంత్ర్య భారతంలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో మన పరిశోధనలు, ఫలితాలు ప్రపంచ స్థాయిలో లో లేకపోవడమే నోబెల్ లో నేటి మన ప్రదర్శనకు ప్రధాన కారణం.అంతరిక్ష పరిశోధనల్లో మంగళయాన్, చంద్రయాన్ వంటి అద్భుత ప్రయోగాలతో ప్రపంచం దృష్టిని ఆకర్షించిన మాట వాస్తవం.కానీ ఇంకా మన దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధికి కృషి చేయాలి. విశ్వవిద్యాలయాల్లోని ఉన్నత విద్యలో, పరిశోధనల్లో రాజకీయ జోక్యం ఉండకూడదు. బడ్జెట్ పెంచాలి.యువతరాన్ని పరిశోధనల వైపు ప్రోత్సహించాలి.ఫెలో షిప్స్ అమౌంట్ పెంచాలి.నేటితరపు చదువులు మార్కులు,ఉద్యోగం,సంపాదన చుట్టే తిరుగుతున్నాయి.ఆ దృక్పథాన్ని తల్లిదండ్రులు, విద్యార్థులు మార్చుకొని, శాస్త్రవేత్తలకు సరైన గుర్తింపు మనదేశంలో ఇవ్వాలి.విదేశాలకు వెళ్ళే శాస్త్రవేత్తల వలసలను ఆపాలి.ఉన్నత విద్యా వంతులు రాజకీయాల్లోకి వచ్చి శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధికి నూతన చట్టాలతో కృషి చేయాలి.పాఠశాల స్థాయి విద్య నుంచే గొప్ప గొప్ప శాస్త్రవేత్తల జీవితాల గురించి,సమాజం నుంచి వాళ్ళు ఎదుర్కొంటున్న సమస్యల గురించి,గెలుపోటములకు సంబంధం లేని వారి ప్రయత్నాల పరంపర గురించి విద్యార్థులకు స్ఫూర్తివంతమైన విధానాలతో తెలియజెప్పాలి. శాస్త్ర సాంకేతిక రంగాల్లో మనం అగ్రగామిగా వుండాల్సిన అవసరం కనిపిస్తోందని,యువత పెద్ద పెద్ద కలలుగనమని యావత్ భారతాన్ని ప్రభావితం చేసిన అబ్దుల్ కలాం జీవితాన్ని నేటితరం ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్ళాలి.మన తరగతి గదుల్లో శ్రీనివాస రామానుజన్ వంటి అసాధారణ భారతరత్నాలు ఉదయించాలి.త్వరలోనే రవీంద్రనాథ్ ఠాగూర్, సివిరామన్ వంటి మహానుభావుల స్ఫూర్తితో మళ్ళీ మనదేశం ప్రపంచానికి నోబెల్ వెలుగులతో అనంత విశ్వం దాకా అన్వేషణ కొనసాగాలని ఆశిద్దాం.జగదీశ్ చంద్రబోస్,సలీం అలీ ,సి.యన్.ఆర్ రావు, కల్పనా చావ్లా, బిమ్లా బూటి వంటి మన శాస్త్ర వేత్తలను నేటి తరాలకు గొప్ప హీరోలుగా పరిచయం చేస్తూ గౌరవిద్దాం.నవతరం విన్నూత్న ఆవిష్కరణలతో విదేశీ గడ్డలపై మన జాతీయ పతాకాన్ని ఎగిరేలా మన ప్రయాణం, మన ప్రయత్నం కొనసాగిద్దాం..



-ఫిజిక్స్ అరుణ్ కుమార్
నాగర్ కర్నూల్
9394749536

## కలం

ఛాతీ జేబు మీద ఉండే కలం
చరిత్ర సృష్టించే ఆయుధం
కలములోని ఇంకు
భవిష్యత్ తరాలకు బ్లాంక్ చెక్

పగలు సూర్యుడు,రాత్రి చంద్రుడు
సూర్యచంద్రుల ప్రతిరూపం కలం
జర్నలిస్టుల గుండెబలం కలం
కదల్లేని కొండ అచేతనకు
చైతన్య శిల్పమే కలం

అసత్య ప్రకటనలే
కలం ఆనవాయితయితే
గందరగోళ మనసులో
నిజాయితీ కవాతు చేస్తుంది
శిలువ మీద క్రీస్తవుతుంది

కెరటాల్లాంటి కలమునకు
అంక్షలు విధించగలమా..
సముద్ర తీరానికి
అడ్డుకట్ట వేయగలిగే మూరు?దెవరూ..?

కలానికి
ఎరుపు, పసుపు రంగులు పులమకండీ
కలమే కల్తీని ప్రసరిస్తే
సమాజ స్వచ్ఛత కుంటుబడుతుంది

కలానికి రెండు నాల్కలు
సమాజ సంధ్య సూచనలు
నిత్య సత్యాలే
కలానికి ఆశయమయితే
కాలానికి సరికొత్త
వ్యాపకమవుతుంది

కలాన్నీ
సమాధి చేయడమంటే
కాలానికి
సంకెళ్లు వేయడమే....



డా. ఐ. చిదానందం
తెలుగు స్కూల్ అసిస్టెంట్
రంగారెడ్డి జిల్లా
8801444335

# వాయుకాలుష్యంతో పెరుగుతున్న గుండె జబ్బులు

వాతావరణ కాలుష్యం కారణంగా గుండె జబ్బుల ప్రమాదం ప్రతీయేట పెరుగుతున్నాయని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఢిల్లీ వంటి నగరాల్లో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలో ఉందన్న సంగతి తెలిసిందే. ఇలాంటి ప్రదేశాల్లో నివసించే ప్రజల్లో ఈ ప్రమాదం మరింత ఎక్కువ..ఢిల్లీ, ఎన్‌సీఆర్‌తో సహా పలు రాష్ట్రాల్లో కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. చాలా నగరాల్లో ప్రమాదకరంగా 300 దాటింది. ఈ విషపూరితమైన గాలిలో నివసిస్తే జనాల ఆరోగ్యానికి భారీ హాని కలిగిస్తుంది. ఈ విషపూరిత గాలి ఊపిరితిత్తులను అనారోగ్యానికి గురిచేస్తుంది. ఇది మన గుండె ఆరోగ్యానికి కూడా చాలా హాని కలిగిస్తుంది. ప్రస్తుతం శ్వాసకోశ వ్యాధులు పెరుగుతుండగా, హృద్రోగులు కూడా దీని బారిన పడుతున్నారు. గత దశాబ్ద కాలంలో వాయుకాలుష్యం వల్ల గుండె జబ్బులతో మరణించే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని, భవిష్యత్తులో ఇది మరింత పెరిగే అవకాశం ఉందని ప్రపంచ ఆరోగ్య సమాఖ్య నిర్వహించిన పరిశోధనలో తేలింది. దీని కారణంగా ప్రతి సంవత్సరం 1.9 మిలియన్ల మంది గుండె జబ్బులతో మరణిస్తున్నారు. దాదాపు 10 లక్షల మంది ప్రజలు కేవలం వాయు కాలుష్యం కారణంగా మరణిస్తున్నారు. గత దశాబ్ద కాలంలో వాయుకాలుష్యం కారణంగా గుండె జబ్బుల వల్ల మరణాలు 27 శాతం పెరిగాయి. వాయుకాలుష్యంలో ఉండే మైక్రోస్కోపిక్ అదృశ్య కణాలు గుండె కొట్టుకోవడం, రక్తం గడ్డకట్టడం, ధమనులలో ఫలకం ఏర్పడటం, రక్తపోటుపై ప్రభావం చూపుతాయని, అలాగే శ్వాసకోశ వ్యాధులు, శరీరంలోని ఇతర పరిస్థితులపై ప్రతికూల ప్రభావాలను చూపుతాయని సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వరుణ్ బన్సల్ వివరించారు. దీని కారణంగా, పెరుగుతున్న కాలుష్యం దగ్గు అతిపెద్ద సమస్యను కలిగిస్తుంది. కాలుష్యంలో జీవించడం అంటే రోజంతా ధూమపానం చేయడం, ఇందులో నికోటిన్ ఉండకపోయినా అనేక ఇతర హానికరమైన రసాయనాలు ఉంటాయి. దీని కారణంగా ఇది ఊపిరితిత్తులతో పాటు మొత్తం శరీరాన్ని ప్రభావితం చేస్తుంది. అలాంటి సమయంలో రక్తపోటుతో బాధపడేవారికి రక్తపోటు పెరిగే అవకాశాలు



ఎక్కువగా ఉంటాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉన్నవారిలో రక్తపోటు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అంతర్లీన గుండె సమస్యలు ఉన్నవారు కూడా సమస్యలను ఎదుర్కొంటారు.

### ఎలా రక్షణ పొందాలి?

కాలుష్యం ఎక్కువగా ఉన్నప్పుడు ఉదయం, సాయంత్రం వాకింగ్ మానుకోవాలి. వ్యాయామం చేయాలంటే మూసి ఉన్న వాతావరణంలో ఉండాలి. జిమ్‌లో మాత్రమే వ్యాయామం చేయాలి. మీరు నడక కోసం బయటకు వెళ్లాలనుకుంటే, ట్రాఫిక్ పెరగడానికి ముందు ఉదయం లేదా సాయంత్రం బయటకు వెళ్లండి. బయటకు వెళ్లే బదులు ఇంట్లోనే ఉంటూ యోగా, ధ్యానం, వ్యాయామం చేయొచ్చు. శారీరకంగా చురుకుగా ఉండాలి. పండుగల సమయంలో మీ ఆహారపు అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. చాలా కొవ్వు, జిడ్డైన ఆహారాలు, అధిక కేలరీల ఆహారం తీసుకోవద్దు. మీ ఆహారంలో ఆకు కూరలు, సలాడ్, మొలకలు, బీన్స్, పప్పులు, చీజ్, పాలు, గుడ్లు వంటివి తీసుకోవాలి. వీలైనంత ఎక్కువ నీరు తాగాలి. బయటకు వెళ్లేటప్పుడు తప్పకుండా మాస్క్ ధరించాలి.

# కొత్త శిఖరాలకు భారత విమానయాన రంగం!

గత దశాబ్ద కాలంలో భారతదేశంలో విమానాశ్రయాల సంఖ్య రెండింతలు పెరిగి 157కు చేరుకుంది. రానున్న 20 ఏళ్లలో మరో 200 విమానాశ్రయాలను అభివృద్ధి చేస్తారు. దేశంలోని విమానాశ్రయ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతోపాటు ఉద్యోగాల కల్పనను పెంచడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఐదేళ్లలో 50 అదనపు విమానాశ్రయాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. వచ్చే ఐదేళ్లలో 50 కొత్త విమానాశ్రయాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పిస్తోంది. రానున్న 20 ఏళ్లలో ఈ సంఖ్య 200 అదనపు విమానాశ్రయాలకు పెరుగుతుందని అంచనా వేశారు. రాబోయే కాలంలో 50 అదనపు విమానాశ్రయాలను నిర్మించాలని ప్రభుత్వం పరిశీలిస్తోంది.



విమానాశ్రయ కనెక్టివిటీని మెరుగుపరచడంతో పాటు, ఈ నిర్ణయం ఉపాధి కల్పనను కూడా పెంచుతుంది. గత దశాబ్ద కాలంలో భారతదేశంలో విమానాశ్రయాల సంఖ్య రెండింతలు పెరిగి 157కు చేరుకుంది. రానున్న 20 ఏళ్లలో మరో 200 విమానాశ్రయాలను అభివృద్ధి చేస్తారు. సివిల్ ఏవియేషన్ సెక్రటరీ వుమ్లున్‌మాంగ్ వుల్నామ్ కూడా విమాన ప్రయాణంలో గణనీయమైన పెరుగుదల నమోదు అయ్యిందన్నారు. గత ఏడాది నమోదైన ప్రస్తుత 220 మిలియన్ల నుండి వచ్చే ఐదేళ్లలో ప్రయాణీకుల రద్దీ రెట్టింపు అవుతుందని పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా 601 ??రూట్‌లు ఇప్పుడు పనిచేస్తున్నాయని, ఇప్పటివరకు దాదాపు 1.44 కోట్ల మంది ప్రజలు ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం పొందారని ఆయన తెలిపారు. ఇక ఉడాన్ ప్రయాణాన్ని పరిశీలిస్తే, ఇప్పటికి దాదాపు 1.44 కోట్ల మంది ప్రజలు ఆర్‌సీఎస్ కింద ప్రయాణించారు. ఇది ఏ కొలతతో చూసినా భారీ సంఖ్య. ఈ పథకం కింద ఇప్పటివరకు 601 రూట్‌లలో నడిపారని జాయింట్ సెక్రటరీ తెలిపారు.

# గుస్సాడీ కళను ఎల్లలు దాటించిన కనకరాజు

అసిఫాబాద్‌లోని ఆదివాసీ బిడ్డల నృత్య రూపకమైన గుస్సాడీకి కనకరాజు ఎనలేని కీర్తిని తెచ్చారు. తమ అస్తిత్వ కళారూపాన్ని ఆయన తరచూ ప్రదర్శిస్తూ భావి తరాలకు తమ ఆచార, సంప్రదాయాలను తెలియజేశారు. దాంతో, ఆయన పేరు గుస్సాడీ కనకరాజుగా స్థిరపడిపోయింది. గోండు కుటుంబంలో పుట్టి, తమ ప్రత్యేక గిరిజన నృత్యరూపం అయిన గుస్సాడీ అంతరించి పోకూడదనే లక్ష్యంగా, గుస్సాడీనే తన ఇంటి పేరుగా మార్చుకొని వేలాది మందికి ఆయన గుస్సాడీ నృత్యాన్ని నేర్పించారు. గుస్సాడీ నృత్యాన్ని జాతీయ, అంతర్జాతీయ వేదికల మీదికి ఎక్కించి.. తమ కళను ఎల్లలు దాటించారు.

**కళారంగంలో సేవలకు పద్మశ్రీ..**

ఆదివాసీల కళను బతికిస్తూ.. అందులోనే ఆనందాన్ని వెతుక్కున్న ఆయన పేరును అప్పటి కేసీఆర్ ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుకు సిఫారసు చేసింది.కళారంగంలో ఆయన చేసిన విశిష్ట సేవలకు గాను భారత ప్రభుత్వం కనకరాజును 2021లో పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. 2021 నవంబర్ 9వ తేదీన అప్పటి రాష్ట్రపతి రామ్‌నాద్ కోవింద్ చేతుల మీదుగా ఆయన పద్మశ్రీని అందుకున్నారు.

కుమరం భీం అసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలానికి 4 కిలోమీటర్ల దూరంలో గుట్టపైన ఉన్న గిరిపల్లె మర్లవాయి కనకరాజు స్వగ్రామం. రాము, రాజు భాయిలకు ఆయన ఏకైక సంతానం. అప్పట్లో వాళ్లకు దగ్గర్లో బడి లేదు. అయితే.. ఓ మాస్టారు దగ్గర కనకరాజు మరాఠీ వర్ణమాల నేర్చుకున్నారంతే. బాల్యంలో ఆయన తండ్రికి వ్యవసాయం పనుల్లో సాయం చేసేవారు. కాస్త పెద్దయ్యాక కనకరాజు గుస్సాడీ మీద ప్రేమ పెంచుకున్నాడు. పూర్వీకుల నుంచి సంప్రదాయంగా వస్తున్న ఆ నృత్యాన్ని ఆయన దైవ స్వరూపంగా భావించారు.

**గుస్సాడీయే శ్వాసగా..**

గుస్సాడీ డాన్స్‌కు చెహోయ్ అనే పేరు కూడా ఉంది. ఈ నృత్యాన్ని దండారి పండుగ సందర్భంగా ప్రదర్శిస్తారు. ఇక.. దాదాపు 50 ఏండ్లుగా గుస్సాడీయే శ్వాసగా బతికిన కనకరాజు పలు ప్రదర్శనలు ఇచ్చారు. అంతేకాదు ఓ స్కూల్ ఏర్పాటు చేసి ఆసక్తిగత యువతకు ఆయన మెలకువలు నేర్పారు. ధోతీ, రుమాలు కట్టుకొని.. తలపై నెమలి ఈకల టోపీ పెట్టుకొని, మెడలో పూల దండలు వేసుకొని చేతిలో గంగారం సోట అనే కర్ర పట్టుకుంటారు. డోలు వాయిద్యాలకు అనుగుణంగా నృత్యం చేస్తూ అందర్నీ సంస్కృతిలో భాగం చేశారు.





**ఇద్దరు భార్యలు.. 12మంది సంతానం..**


55 సంవత్సరాలుగా గుస్సాడీ నృత్యాన్ని ప్రదర్శించారు.గుస్సాడీ నృత్యాన్ని ప్రదర్శిస్తూ.. నేర్పుతూ దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న కనకరాజు నిరుపేద. ఆయనకు ఇద్దరు భార్యలు, 12 మంది సంతానం. కనకరాజు మార్లవాయిలోని ఐటీడీఏ ఆశ్రమ స్కూల్?లో డైలీ వేజ్?వర్కర్?గా పని చేస్తూనే గుస్సాడీ డ్యాన్సులు చేసేవారు. 3, 4 నెలలకు ఒకసారి వచ్చే వేతనంతోనే ఆయన కుటుంబం గడిచేది. పద్మశ్రీ అవార్డ్ గ్రహీతతో స్కూల్ డ్యూటీ చేయించకూడదని ఐటీడీఏ ఆఫీసర్లు నిర్ణయించారు. దాంతో కనకరాజుకు ఉపాధి కూడా దూరమైంది. ఆ తర్వాత కొద్ది రోజులకే ఆయన టీబీ బారిన పడ్డారు. గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం కన్నుమూశారు.

రేలా.. రే.. రేలా అంటూ గొంతు కలిపి పాడతారు..

గుస్సాడీ సాధన చేయడమే కాదు, టోపీ, దుస్తులు, గజ్జెలు అన్నీ ప్రత్యేకమే. వాటిని తయారు చేయడానికి చాలా నైపుణ్యం ఉండాలి. పెద్ద టోపీకి రెండు వేల పింఛాలుంటాయి. నెమలీకల టోపీ ధరించి కోలాహలంగా ఆడతారు. రేలా... రే... రేలా అంటూ గొంతు కలిపి పా డతారు. ప్రకృతి గురువు నేర్పిన పా ఠాలకు ఆనవాళ్లు వారు. కనకరాజు పేరులో ఇంటి పేరు కనక, ఆయన పేరు రాజు. ఇన్ని వివరాలు మాకక్కర్లేదు, గుస్సాడి నృత్యం చేస్తాడు, మా అందరి చేత అడుగు వేయిస్తాడు కాబట్టి ఆయన మాకు 'గుస్సాడి రాజు' అంటారు స్థానికులు. ఆయన పద్మశ్రీ అందుకున్నప్పటి నుంచి నాగరక ప్రపంచం ఆయన మీద దృష్టి కేంద్రీకరించింది. కనకరాజు అని ఇంటిపేరుతో కలిసి వ్యవహారంలోకి వచ్చారు. అయినప్పటికీ వారి గూడేలకు వెళ్లి కనకరాజు అని అడిగితే వెంటనే గుర్తుపట్టరు.

**ఆట, పాటే జీవితం..**

"మా ఆదివాసీల జీవనంలో ప్రకృతి, నృత్యం, గానం కలగలిసి పోయి ఉంటాయి. బిడ్డ పుడితే పా ట, పెళ్లి వేడుకకీ పా ట, అంతేకాదు... మనిషి పోయినా పా ట రూపంలో ఆ వ్యక్తితో మా అనుబంధాన్ని గుర్తు చేసుకుంటారు. 'ఈ నృత్యమే మనకు దైవం అని తండ్రి చెప్పిన మాటతో కనకరాజు 'ఈ నృత్యాన్ని కొనసాగించారు.గణతంత్ర వేడుకల్లో ప్రాచీన వారసత్వ కళ అయిన గుస్సాడి నృత్యాన్ని ప్రదర్శించే అవకాశం కనకరాజుకు 1982లో వచ్చింది. అప్పుడు ప్రధానమంత్రి ఇందిరాగాంధీకి మా గుస్సాడి టోపీ పెట్టించి, గజ్జెలు కట్టించారు. ఆ తర్వాత ఓసారి అబ్దుల్ కలామ్ కూడా అడుగులు వేయించారు. హైదరాబాద్‌లో ఎన్ని ప్రదర్శనలిచ్చారో లెక్కేలేదు. ఢిల్లీలో ఆజాదీ కా అమృత్ మహెూత్సవ్‌లో కూడా గుస్సాడిని ప్రదర్శించారు. నాయన మాట మీద గుస్సాడి కోసం బతికినందుకే మా దేవుడు మెచ్చి గొప్ప వాళ్లకిచ్చే పద్మశ్రీని ఇప్పించాడనుకుంటున్నా అని కనకరాజు చెప్పేవారు.



- మిట్టపెల్లి రాజేశ్
సెల్: 9441672957

# సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

## ఎమ్మెల్యే సంజీవరెడ్డి



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** పెద్ద శంకరం పేట కస్తూరిబా పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేసి తొందరలోనే సమస్యలను పరిష్కరిస్తానని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం పెద్ద శంకరంపేట్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహన్ని ఎమ్మెల్యే పటోళ్ల సంజీవరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. వసతి గృహంలో ఉన్న పరిసరాలను ఆయన పరిశీలించారు. వసతి గృహంలో త్రాగునీరు, విద్యుత్, ఫ్లోర్ తదితర సమస్యలను వార్డెన్ విజయ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకులు కస్తూర్బా పాఠశాలను పట్టించుకోకపోవడం వల్లనే నేడు దుర్బర స్థితిలో ఈ పాఠశాలలో ఉందని పేర్కొన్నారు. సంబంధిత ఇంజనీర్ల ద్వారా 50 లక్షలతో పనులు చేపట్టేందుకు ప్రపోజల్ సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని అన్నారు. అలాగే కస్తూర్బా పాఠశాలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ల్యాబ్‌ల కొరత ఉన్నందున 15 లక్షల నిధులతో ల్యాబ్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించినట్లు ఆయన పేర్కొన్నారు. కేవలం 15 సంవత్సరాల క్రితమే నిర్మించిన ఈ పాఠశాల ఇలా కృంగిపోవడం చూస్తుంటే గత ప్రభుత్వం పాఠశాలలపై ఎంత నిర్లక్ష్య వైఖరి వహించిందో అవగతమవుతుందని అన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల్లో కూడా ఇలాంటి పరిస్థితి ప్రభుత్వ పాఠశాలలో నెలకొందని అన్నారు. ముఖ్యంగా శంకరంపేట మండలానికి చెందిన మహాత్మా గాంధీ పూలే గురుకుల పాఠశాలలో ఎలాంటి వసతులు లేక విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని ఇటీవల తన పరిశీలనలో సమస్యలు తన దృష్టికి రాగా దాతల సహకారంతో కొంత సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్లు అని పేర్కొన్నారు. మెదక్ జిల్లా కలెక్టర్ కు కస్తూరిబా పాఠశాల సమస్యలను తీసుకువెళ్లి సాధ్యమైనంత తొందరలో సమస్యలను పరిష్కారం అయ్యేటట్లు చర్యలు తీసుకుంటానని అన్నారు. ఎమ్మెల్యే ఎంపీడీవో రఫిక్ హనీషాతో మాట్లాడుతూ మండల నిధుల నుండి పాఠశాలలో నెలకొన్న సమస్యలను తీర్చాలని ఆయన అదేచించారు. ఎమ్మెల్యేతో పాటు తాహసిల్దార్ గ్రేసీ బాయ్ ఆర్ఐ శరణప్ప అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాయిని మధుసూదన్, ఆర్ ఎన్ సంతోష్ కుమార్, నాయకులు నారా గౌడ్, మాజీ సర్పంచ్ అలుగుల సత్యనారాయణ, దాచ సంగమేశ్వర్ దేవేందర్, పెర్మల్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## బిజి-2 పత్తి రకంపై రైతులతో పంట ప్రదర్శన




**విశ్వంభర, భూపాలపల్లి:** కాటారం మండల కేంద్రంలోని రైతు బొమ్మన వెంకటస్వామి యొక్క పత్తి చెనులో నాథ్ బయో-జీన్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ వారి ఆధ్వర్యంలో నాథ్ సంకేత్ వేసిన బీజీ-2 పత్తి రకంపై రైతులతో పంట ప్రదర్శన కార్యక్రమం నిర్వహించడం కరిగింది. డిప్యూటి మేనేజర్ నాంపల్లి తిరుపతి మాట్లాడుతూ ఈ నాథ్ సంకేత్ బీజీ-2 హైబ్రిడ్ పత్తి గులాబీ రంగు పురుగు, రసం పీల్చే పురుగులను సమర్థవంతంగా తట్టుకొని ఎప్పుడు చూసినా నీటిని స్టోర్ ఉంచుకుంటు పంట కాపుకు వస్తుందన్నారు. ఈ నాథ్ సంకేత్ పత్తి పంట వేస్తే రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి పొంది లాభాలు పొందవచ్చని పేర్కొన్నారు. వివిధ గ్రామాల నుండి రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కంపెనీ డిస్ట్రిబ్యూటర్ బొమ్మ సమ్మిరెడ్డి, ఫెర్టిలైజర్స్ షాప్ డీలర్ నిడిగొండ చెన్నకేశవ్, కంపెనీ ప్రతినిధి ఇప్పలపల్లి దేవేందర్, వెంకటేష్ పాల్గొన్నారు.

## నిషేధిత పాన్ మసాలా, జర్ద, గుట్కాలు తయారీ స్థావరంపై దాడి

**విశ్వంభర, హైదరాబాద్:** పాతబస్తీలో నిషేధిత పాన్ మసాలా, జర్ద, గుట్కా లు తయారు చేసి విక్రయిస్తున్న ఇద్దరిని ఫలక్ నుమా పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం ఫలక్ నుమా ఫాతిమా నగర్ కు చెందిన సయ్యద్ ఇమ్రాన్ (32), శాలిబండ ఖాజీపుర ప్రాంతానికి చెందిన మహమ్మద్ జుబేర్ (29)లు కొంతకాలంగా తీగలకుంట రహమత్ నగర్ అన్సారి రోడ్డు ప్రాంతంలో నిషేధిత పాన్ మసాలా, గుట్కా, జర్ద తయారు చేస్తున్నారు. వీటిని స్థానికంగా ఉండే దుకాణాల్లో సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై విశ్వసనీయమైన సమాచారం అందుకున్న ఫలక్ నుమా పోలీసులు తయారీ స్థావరంపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సయ్యద్ ఇమ్రాన్, మహమ్మద్ జుబేర్ ను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 2.10 లక్షల విలువ చేసే పలు రకాల పేర్లతో ఉన్న పాన్ మసాలాలు, జర్ద, గుట్కాలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

## మొక్కలు నాటిన మున్సిపల్ వైస్ ఛైర్మన్




**విశ్వంభర, మెట్‌పల్లి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మెట్ పల్లి మున్సిపల్ ఛైర్మన్ రానవేణి సుజాత సత్యనారాయణ ఆదేశాలతో మున్సిపల్ వైస్ ఛైర్మన్ చంద్రశేఖర రావు, మున్సిపల్ కమిషనర్ మోహన్ కలిసి నేషనల్ హైవే డివైడర్ పైన ఫినాస్టిన్ 100 మొక్కలు నాటారు. కమిషనర్ మాట్లాడుతూ నేషనల్ హైవే నూతన డివైడర్ పైన 100 ఫినాస్టిన్ మొక్కలు నర్సరీ నుండి తెప్పించి నాటడం జరిగిందని డివైడర్ మధ్యలో పూల మొక్కలు ఏర్పాటు చేస్తామని తెలిపినారు. ప్రతి ఒక్కరు ప్రతి ఇంటి వద్ద ఖాళీగా ఉన్న స్థలంలో మొక్కలు నాటి వాటిని కాపాడినచో అవి మనకు ఆక్సిజన్ ఇస్తాయని తెలిపినారు. 4, 6 వార్డుల కౌన్సిలర్స్ అంగడి పురుషోత్తం బంగారు కాళ్ళ కిషోర్ డి ఈ నాగేశ్వరరావు, విజయ్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్, నిజాం, అశోక్, నరేష్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్, కళ్యాణలక్ష్మి, షాధి ముబారక్ చెక్కులు పంపిణీ

### పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



**విశ్వంభర, మెట్‌పల్లి:** మెట్ పల్లి పట్టణంలోని వీఆర్ఎమ్ గార్డెన్స్ లో మెట్ పల్లి పట్టణ మరియు మండలానికి సంబంధించిన ఇరవై మూడు లక్షల అరవై రెండు వేల ఐదువందల రూపాయల విలువ గల 70 సీఎంఆర్ఎఫ్ చెక్కులతో పాటు, ఒక కోటి ముప్పై తొమ్మిది లక్షల పదహారువేల నూటఇరవై నాలుగు రూపాయల విలువ గల 139 కళ్యాణలక్ష్మి, షాధి ముబారాక్ చెక్కులను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మార్వో, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, ఇతర ప్రభుత్వ అధికారులు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ చంద్రశేఖర రావు బీఆర్ఎస్ నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీకి ఓకే



**విశ్వంభర, హైదరాబాద్:** ప్రజలకు తెలంగాణ సర్కార్ శుభవార్త చెప్పింది. జనవరి నుంచి రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఒక్కో వ్యక్తికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం అందజేయనున్నారు. ఈ సీజన్‌లో 150 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. దాంతో 20 వేల కోట్లతో ధాన్యం సేకరిస్తోంది. ప్రతి సంవత్సరం 6 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు తీసుకురానున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

# ఎవరి ప్రమేయంతో భూముల బదిలీ?

## ఐఏఎస్ అధికారి అమోయ్‌కు ఈడీ ప్రశ్నల వర్షం

**విశ్వంభర, హైదరాబాద్:** సీనియర్ ఐఏఎస్ అధికారి ఆమోయ్ కుమార్ ఈడీ విచారణ మూడో రోజు ముగిసింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం భూదాన్ భూముల బదిలీ వ్యవహారంలో అక్రమాలకు సంబంధించి ఆరోపణల నేపథ్యంలో ఆయనను అధికారులు విచారించారు. శుక్రవారం ఉదయం 6 గంటలకే అమోయ్ కుమార్ ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. 9 గంటల నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు సుదీర్ఘంగా ప్రశ్నించారు. 42 ఎకరాల భూమి బదిలీ చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. విచారణలో భాగంగా అమోయ్‌ను ఈడీ అధికారులు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు తీసుకెళ్లి... తిరిగి ఈడీ కార్యాలయానికి తీసుకెళ్లారు. ఈడీకి ఫిర్యాదు చేసిన మధురానగర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఎవరి ప్రమేయంతో భూములు బదిలీ చేశారు? బదిలీ చేయమని ఎవరైనా ఆదేశించారా? తదితర కోణాల్లో అధికారులు ఆయనను ప్రశ్నించారు. ఆయన వాంగ్మూలం కూడా నమోదు చేశారు. మరో వైపు తట్టి అన్నారం... మధురానగర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు అమోయ్‌కుమార్‌పై ఈడీకి ఫిర్యాదు చేశారు. మధురానగర్‌లోని 104 ఎకరాలు భూమి ప్లాట్లు వేయగా, తాము ప్లాట్లను కొనుగోలు చేశామని, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా ఉన్న సమయంలో అమోయ్‌కుమార్ తమ భూములను ధరణి వచ్చాక రికార్డుల్లో తారుమారు చేసి ఇతరులకు అప్పనంగా కట్టబెట్టారని ఆరోపించారు. గతంలో ఈ విషయమై తాము పోరాటం చేశామని, ఆందోళనలకు సైతం దిగామని తెలిపారు. అమోయ్‌కుమార్‌పై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని ఈడీకి ఫిర్యాదు చేశారు.

## ఐఎన్టీయూసీ నాయకులకు సన్మానం

**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** నారాయణపురం మండల కేంద్రంలో ఐఎన్టీయూసీ నూతన మండల అధ్యక్షుడు గా ఎన్నికైన దొల్ల గణేష్, జిల్లా జాయింట్ సెక్రెటరీగా నియమితులైన రాచకొండ లింగస్వామి ని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐఎన్టీయూసీ నాయకులకు, కార్మికులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా గణేష్, లింగస్వామి మాట్లాడుతు తమ నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు సుడుగు జీవన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కరంతోతు ప్రజ్ఞా నాయక్, మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజ్ గోపాల్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా పోలీస్ అమరవీరుల వారోత్సవాలు

### అమరవీరుల సంస్మరణార్థం పోలీసులు సైకిల్ ర్యాలీ



**విశ్వంభర, కరీంనగర్:** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం కరీంనగర్ పోలీసు కమీషనరేట్ హెడ్ క్వార్టర్స్ నుండి సైకిల్ ర్యాలీ నిర్వహించామని కమీషనర్ అభిషేక్ మొహంతి తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలను కోల్పోయిన పోలీసు అమరవీరులను స్మరిస్తూ, సమాజంలో శాంతిభద్రతల స్థాపనకు పోలీసులు చేస్తున్న కృషిపట్ల ప్రజలకు అవగాహన కలిగే విధంగా ఈసైకిల్ ర్యాలీ ఉపయోగపడుతుందని భావిస్తున్నామన్నారు. కమీషనరేట్‌లోని అన్ని విభాగాలకు చెందిన పోలీసు అధికారులతో పాటు నగరంలోని పలువురు ప్రముఖులు పెద్దసంఖ్యలో ఈ ర్యాలీలో పాల్గొన్నారన్నారు. పోలీస్ హెడక్వార్టర్స్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ బస్ స్టాండ్ ఇన్ గేట్, ఇందిరా చౌక్, రాంనగర్ పాత లేబర్ అడ్డా మీదుగా, శివ థియేటర్ జంక్షన్, కెమిస్ట్రీ భవన్ మీదుగా, కోర్టు చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, గాంధీ చౌరస్తా, టవర్ సర్కిల్, శాస్త్రి రోడ్, త్రీ టౌన్ మీదుగా కమాన్ చౌరస్తా, వన్ టౌన్ పోలీసు స్టేషన్ తిరిగి బస్ స్టాండ్ మీదుగా పోలీసు హెడ్ క్వార్టర్స్ వద్ద ర్యాలీ ముగిసింది. అడిషనల్ డీసీపీ (ఏఆర్) అనోక్ జయ్ కుమార్‌లతో పాటు ఏసీపీలు విజయ్ కుమార్, మాధవి, నరేందర్, వెంకటరమణ, కమిషనరేట్‌లోని ఇన్స్పెక్టర్లు కోటేశ్వర్, విజయకుమార్, జాన్ రెడ్డి, స్వామి, ప్రకాష్ గౌడ్, రిజర్వు ఇన్స్పెక్టర్లు రజినీకాంత్, కుమార స్వామి, జానీమియా, శ్రీధర్ రెడ్డి, సురేష్‌అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టు ఇంటి స్థలాల దరఖాస్తు స్వీకరణ పత్రం విడుదల



**విశ్వంభర, భూపాలపల్లి:** మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి సూచనల మేరకు తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజేయూ) ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపల్లి మధు జర్నలిస్ట్ ఇంటి స్థలాల దరకాస్తు స్వీకరణ పత్రాన్ని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాకతీయ ప్రెస్ క్లబ్‌లో జిల్లా అధ్యక్షులు క్యాతం సతీష్ కుమార్, కార్యదర్శి సామంతుల శ్యామ్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. గాడిపల్లి మధు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న జర్నలిస్టుల కల నెరవేరబోతుందని, గత ప్రభుత్వాలు జర్నలిస్టుల యొక్క సంక్షేమం దిశగా అడుగులు వేయలేదని, మొట్టమొదటిసారిగా మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కమిటీ జర్నలిస్టుల ఇంటి స్థలాల కోసం దరఖాస్తు స్వీకరణ పత్రాన్ని విడుదల చేయడం చాలా సంతోషమని తెలిపారు. పనిచేస్తున్న ప్రతి జర్నలిస్ట్ యూనియన్లకు అతీతంగా ఇంటి స్థలాల కోసం అప్లికేషన్ నింపి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు క్యాతం సతీష్ కుమార్, సామంతుల శ్యామ్ ఆధ్వర్యంలో మీడియా అకాడమీకి పంపిచాల్సిందిగా తెలిపారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం

## రక్తదాతలను ప్రశంసించిన ప్రోవీసీ ప్రొఫెసర్ డి.ఎస్.రావు

### ప్రశంసా పత్రాలను అందజేసిన రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ



**విశ్వంభర, సంగారెడ్డి:** రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి విద్యార్థి చేసే రక్తదానం ఆపదలో ఉన్న మరో వ్యక్తి లేదా వ్యక్తులకు ఉపయోగపడుతుందని గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్), చరైవేతి విద్యార్థి విభాగాలు శుక్రవారం సంయుక్తంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ ట్రస్టు సౌజన్యంతో, 'రక్తదానం చేయండి జీవితాన్ని దానం చేయండి' ఇతివృత్తంతో నిర్వహించిన ఈ కార్యక్రమం, రక్తదానం ద్వారా ప్రాణాలను రక్షించే ప్రభావం గురించి అవగాహన పెంచడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ శిబిరానికి విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది నుంచి విశేషమైన స్పందన కనిపించింది. ఈ శిబిరాన్ని నిర్వహించడంలో విద్యార్థుల అంకితభావాన్ని ప్రోవీసీ ప్రొఫెసర్ డీ.ఎస్. రావు ప్రశంసించారు. ఇలాంటి మానవతా ప్రయత్నాలలో నిరంతరం పాల్గొనాలని ఆయన ప్రోత్సహించారు. రక్తదానం విలువను నొక్కి చెబుతూ ఇందులో స్వచ్ఛందంగా పాల్గొన్న వారందరికీ ఆయన అభినందనలు తెలియజేశారు. గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ మాట్లాడుతూ రక్తదానం విశిష్టత, తద్వారా దాత, గ్రహీతలు ఇద్దరికీ ఒనగూరే ప్రయోజనాల గురించి వివరించారు. దాతలకు ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు, విద్యార్థి నాయకులతో కలిసి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ శిబిరంలో 300 యూనిట్లకుపైగా రక్తాన్ని సేకరించినట్టు ఎన్టీఆర్ ట్రస్టు వైద్యులు డాక్టర్ రాజేష్, డాక్టర్ శైలజ, అడ్మినిస్ట్రేషన్ హెడ్ మాధవి తెలియజేశారు. రక్తదానాన్ని 'జీవిత బహుమతి'గా వారు అభివర్ణిస్తూ, ప్రతీ దానం వివిధ వైద్య పరిస్థితులకు చికిత్స చేయడానికి ఎర్ర రక్తకణాలు, ప్లేట్-లెట్లు, ప్లాస్మాను అందించడం ద్వారా చాలామంది జీవితాలను కాపాడవచ్చని చెప్పారు.

## పేదింటి ఆడబిడ్డ చదువుకు అండగా మాజీ ఎమ్మెల్యే

### ఎంబీబీఎస్ పూర్తి అయ్యే వరకు ఆదుకుంటానన్న మర్రి జనార్దన్ రెడ్డి



**విశ్వంభర, కొల్లాపూర్:** నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలో పెంట్లవెల్లి మండలం జెట్ ప్రోలు గ్రామానికి చెందిన సులిగురి ఉషమ్మ వెంకటయ్య దంపతుల కుమార్తె ప్రహర్ష కు నారాయణపేట్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు రావడంతో ఆర్థిక ఇబ్బందులు వల్ల తమ కుమార్తెను చదివించలేకపోతున్నాం అని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. సోషల్ మీడియాలో పోస్టులను చూసిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి వారి వివరాలు తెలుసుకొని ఎంజేఆర్ చారిటబుల్ ట్రస్టు ద్వారా అ అమ్మాయి ఎంబీబీఎస్ చదవడానికి మొదటి సంవత్సరం ఫీజు 75 వేల రూపాయల ఆర్థిక సహాయంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంబీబీఎస్ చదువు పూర్తి అయ్యే వరకు ఇంకా మూడు సంవత్సరాల ఫీజు తన ట్రస్ట్ ద్వారానే చెల్లిస్తానని అమ్మాయికి బరోసా ఇచ్చారు. సోషల్ మీడియా ద్వారా తమ విన్నపాన్ని తెలుసుకొని తమ కుమార్తె ఎంబీబీఎస్ చదువుకు ఆర్థిక అందించి మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## 27న ఎన్టీఆర్ స్టేడియంలో యాదవ సదరు సమ్మేళనం

### యాదవ సోదరులు భారీ ఎత్తున తరలిరావాలని శ్రీనివాస్ యాదవ్ పిలుపు



**విశ్వంభర, షాద్‌నగర్:** ఈనెల 27న హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద ఎన్టీఆర్ స్టేడియంలో తెలంగాణ రాష్ట్రంలోనే పెద్ద ఎత్తున జరుగుతున్న "యాదవ సదరు సమ్మేళనం" కార్యక్రమానికి షాద్‌నగర్ నియోజకవర్గం నుండి భారీ ఎత్తున యాదవులు తరలి వెళ్లడానికి సన్నద్ధమయ్యారని యాదవ సంఘం ముఖ్య నేతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ షాద్ నగర్ నియోజకవర్గ సీనియర్ నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున జనాన్ని సమీకరించి ఇట్టి కార్యక్రమాలలో పాల్గొంటున్నారని తెలిపారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు ఎం. అనిల్ కుమార్ యాదవ్‌తో పాటు అన్ని కులాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరు హాజరవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం షాద్ నగర్‌లో దున్నపోతు ప్రదర్శన జరిగింది. యాదవులంతా హైదరాబాద్ వెళ్లడానికి సన్నద్ధ సమావే శాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. షాబాద్ మల్లేష్ యాదవ్, నడి కూడ రఘునాథ్ యాదవ్, కౌన్సిలర్ నడి కూడ సరిత యాదగిరి యాదవ్, నక్క బాల్ రాజ్ యాదవ్, సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, పద్మారం వెంకటేష్ యాదవ్, బాలమోణి మల్లేష్ యాదవ్, బీజేపీ రవి యాదవ్, నడి కూడ అశోక్ యాదవ్, నడి కూడా సంతోష్ యాదవ్, చిన్నయ్య గారి వెంకటేష్ యాదవ్, చీపిరి శివ రాములు యాదవ్, అన్నారం శ్రీశైలం యాదవ్, అనిల్ యాదవ్, వట్టెల లింగం యాదవ్‌లు పాల్గొన్నారు.

## పంట మార్పిడితో ఆయిల్ పామ్ సాగు పెంచాలి


### ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జీనుగు మరియన్న



**విశ్వంభర, మహబూబాబాద్:** నరసింహులపేట మండలం లోని పలు గ్రామాల్లో వరి పొలాల వద్దకు వెళ్లి రైతులను కలిసి పంట మార్పిడితో ఆయిల్ పామ్ సాగు చేసి ఎకరానికి లక్ష రూపాయలు ఆదాయం పొందాలని జిల్లా ఉద్యాన మరియు పట్టుపరిశ్రమ శాఖ అధికారి జీనుగు మరియన్న విజ్ఞప్తి చేశారు. పలు అవగాహన కార్యక్రమాలు చేపట్టి రైతులు పంట మార్పిడి చేసి ఆయిల్ పామ్, డిమాండ్ ఉన్న ఉద్యాన పంటలు సాగు చేయాలని తెలిపారు. ప్రతి రైతు పొలం గట్ల మీద, పొలం చుట్టూ, పెరట్లో, ఆయిల్ పామ్, పండ్ల తోటలలో అంతర పంటలుగా, డాబాల మీద, ఇంటి ముంగిట రోజువారి అవసరాల నిమిత్తం అన్ని రకాల కూరగాయలను సాగు చేసుకోవాలని, కూరగాయల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు, నూతన రకాల సాగు, ప్రోట్రేస్లలో నారు పెంపకం, ఎత్తు మడులు, మల్చింగ్, బిందు సేద్యం, ఫర్టిగేషన్, వేప పిండి, ఆముదం పిండి వాడకం, వేప నూనె పిచికారి చేయటం, పసుపు రంగు అట్టల వాడకం, సిఫారసు చేసిన ఎరువులు వాడటం, పందిరిపై కూరగాయల సాగు, ట్రెల్లిస్ మెథడ్‌లో టమాటా సాగు మొదలైన పద్ధతులు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు రవి, వేముల రామిరెడ్డి, రవి, రేక యాకన్న, వెంకటేష్, వెంకన్న, బానోతు పంతులు, నరేష్, ఉద్యాన అధికారి ఏజే శాంతి ప్రియదర్శిని, టి. జి. ఆయిల్ ఫెడ్ జిల్లా ఇన్చార్జి రాములు, ఫీల్డ్ అధికారులు మమత, వెంకట్, అనిల్, బిందు సేద్య ప్రతినిదులు అశోక్, ప్రసాద్ బాబు పాల్గొన్నారు.

## స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్‌లు వెంటనే విడుదల చేయాలి

### భారత విద్యార్థి ఫెడరేషన్ డిమాండ్



**విశ్వంభర, భూపాలపల్లి:** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ లు వెంటనే విడుదల చేయాలని మహాదేవపూర్ ఎమ్మార్వోకి వినతిపత్రం ఇచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్నటువంటి స్కాలర్షిప్ మరియు ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా స్కాలర్షిప్స్ పెంచి ఇవ్వాలని డిమాండ్ చేసారు. జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు, జూనియర్ కళాశాలలలో చదువుకుంటున్నటువంటి విద్యార్థులకు సంబంధించి స్కాలర్షిప్స్, ఫీజు రియంబర్స్మెంట్‌లు రాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. పెండింగ్లో ఉన్నటువంటి ఎనిమిది వేల కోట్లకు పైగా స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్మెంట్‌లు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ ప్రభుత్వ జూనియర్ కళాశాల కమిటీ అధ్యక్ష కార్యదర్శులు రఘు,సందేశ్, బాలికల కమిటీ సభ్యులు ఆయేషా, సౌమ్య పాల్గొన్నారు.



శంషాబాద్ మల్లిక గార్డెన్‌లో మహేశ్వరం మండలం పెద్దమ్మ తాండ వాస్తవ్యులు నేనవాత్ రతన్ నాయక్ తమ్ముడి కుమారుడు భరత్ వివాహానికి హాజరై నూతన వధువరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి. (విశ్వంభర, మహేశ్వరం)

# దేశంలోనే అత్యుత్తమంగా క్రీడా విధానం

(మొదటి పేజీ తరువాయి)

స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను ఆధునిక అవసరాలకు అనుగుణంగా అప్‌గ్రేడ్ చేయాలని సూచించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీకి సంబంధించిన బిల్లు సాధ్యమైనంత త్వరగా రూపొందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. తెలంగాణ స్పోర్ట్స్ పాలసీలో భాగమైన యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, యంగ్ఇండియా స్పోర్ట్స్ అకాడమీ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణకు సంబంధించి పలు వివరాలను ముఖ్య మంత్రికి అధికారులు వివరించారు. చేయాల్సిన మార్పులు చేర్పులను ముఖ్యమంత్రి సూచించారు. స్పోర్ట్స్ పాలసీ దేశంలో నే అత్యుత్త మంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. తన దక్షిణ కొరియా పర్యటన సందర్భంగా అక్కడి కొరియా నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీని సందర్శించిన సందర్భంగా గుర్తించిన అంశాలను ఆయన తెలియజేశారు.రెండు రోజుల క్రితం రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ముఖ్య మంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి దక్షిణ కొరియా క్రీడా వర్సిటీ ప్రతిని ధులతో చర్చించిన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. దక్షిణ కొరియా క్రీడా వర్సిటీతో పాటు క్రీడా రంగంలో ప్రపంచంలోనే అత్యుత్తమైనదిగా గుర్తింపు పొందిన ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్ యూనివర్సిటీ అను సరిస్తున్న విధానాలపై అధ్యయనం చేయాలని సీఎం అధికారులకు సూచించారు. మరో పది రోజుల్లోనే స్పోర్ట్స్ పాలసీకి సంబంధించిన గవర్నింగ్ బాడీని ఖరారు చేయాలని సీఎం ఆదేశించారు.రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు సంబంధించిన క్యాలెండర్‌ను వెంటనే తయారు చేయాలన్నారు. వచ్చే రెండేళ్లలో నేషనల్ గేమ్స్‌కు తెలంగాణ రాష్ట్రం ఆతిథ్యం ఇచ్చేలా ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్‌ను సంప్రదించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కు మార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (క్రీడలు) ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనా రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి కార్యదర్శి షానవాజ్ ఖాసీం, ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, రాష్ట్ర క్రీడల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ పాల్గొన్నారు.

## ఘనంగా రోజ్ గార్ సేవక్ దివస్



**విశ్వాంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మండ లం సింగంపల్లి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలతో కలిసి ఆమనగల్లు ఎంపీడీవో కుసుమ మాధురి రోజ్ గార్ సేవక్ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీల పనులను, జాబ్ కార్డుల ను పరిశీలించారు. అనంతరం సింగంపల్లి నడింబోడు గుట్ట వద్ద ఉన్న కందకాలను, గాడిదబోడు గుట్టలో బయో డీజిల్ తోటలను పరిశీలించి తోటల పెంపకంపై పలు సూచ నలు చేశారు. గ్రామ కార్యదర్శి, సిబ్బంది, ఉపాధిహామీ కూలీలు, పాల్గొన్నారు.

## డేట్ అఫ్ బర్త్ ప్రూఫ్ ఆధార్ కార్డు కాదు: సుప్రీంకోర్టు

**విశ్వంభర, మహబూబాబాద్:** ఒక వ్యక్తి వయస్సు నిర్ధారణకు స్కూల్ సర్టిఫికెట్‌ను ప్రామాణి కంగా తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆధార్ కార్డు ఆధారంగా నిర్ణయానికి రాకూ డదని పేర్కొంది. పదవతరగతి ధ్రువీకరణ పత్రాలను మాత్రమే ప్రామాణికంగా తీసుకో వాలని, ఆధార్ కార్డు ఆధారంగా నిర్ణయానికి రాకూడదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. రోడ్డు ప్రమాదం లో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తికి పరిహారం చెల్లించేందుకు ఆధార్ కార్డును ఆమోదించిన పంజాబ్, హర్యానా హైకోర్టు ఆదేశాలను సుప్రీంకోర్టు గురువారం రద్దు చేసింది. జువైనల్ జస్టిస్ పిల్లల సంరక్షణ – రక్షణ చట్టం, 2015 లోని సెక్షన్ 94 ప్రకారం స్కూల్ లీవింగ్ సర్టిఫికెట్‌లో పేర్కొన్న పుట్టిన తేదీ నుండి మరణించినవారి వయ స్సును నిర్ణయించాలని న్యాయమూర్తులు సంజయ్ కరోల్, ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. విశిష్ట గుర్తింపు అథారిటీ ఆఫ్ ఇండియా, దాని సర్క్యులర్ నం.8/2023 ప్రకారం, 20 డిసెంబర్ 2018 నాటి ఎలక్ట్రా నిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ జారీ చేసిన ఆఫీస్ మెమోరాండంకు సంబంధించి ఒక ఆధార్‌ను పేర్కొన్నట్లు మేము గుర్తించాం. ఆధార్‌కార్డ్‌ను వయస్సు నిర్ధారణ పత్రంగా భావించ రాదని పేర్కొన్న విషయాన్ని సుప్రీంకోర్టు ధర్మాసనం గుర్తు చేసింది. హక్కుదారు–అప్పీలెంట్ల వాదనను అంగీకరించింది ధర్మాసనం. అతని స్కూల్ లీవింగ్ సర్టిఫికేట్ ఆధారంగా మరణించిన వ్యక్తి వయస్సును లెక్కించిన మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ (ఎంఏసీటీ) నిర్ణయాన్ని సమర్థించింది. మృతుడి ఆధార్ కార్డుపై ఆధారపడి హైకోర్టు అతని వయస్సు 47 సంవత్స రాలుగా అంచనా వేసింది. పాఠశాల లీవింగ్ సర్టిఫికేట్ ప్రకారం అతని వయస్సును లెక్కించిన ట్లయితే, మరణించే సమయానికి అతని వయస్సు 45 సంవత్సరాలు కాబట్టి ఆధార్ కార్డు ఆధారంగా మరణించిన వ్యక్తి వయస్సును నిర్ణయించడంలో హైకోర్టు పొరపాటు చేసిందని గుర్తు చేసింది.

## పశుగణన గోడపత్రిక ఆవిష్కరణ



**విశ్వంభర, భూపాలపల్లి:** పశు మరియు ఇతర జంతువుల గణన నిర్వహణకు వచ్చే సిబ్బందికి సమగ్ర సమాచారాన్ని ఇవ్వాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో పశుగణన గోడ పత్రికను ఆవిష్కరించి, 21వ అఖిల భారత పశు, ఇతర జంతువుల గణన కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ అఖిల భారత పశుగణన ముఖ్య ఉద్దేశ్యం మేత, పాలు, పాల ఉత్పత్తుల నాణ్యతతో పాటు స్వయం ఉపాధి కోసం పాల ఉత్పత్తి సంఘాలను ప్రోత్సహించడం, పశువుల అభివృద్ధికి చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ గణన ప్రక్రియలో గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, బాతులు, కోళ్లు, వీధి కుక్కలు మొదలగు వాటి సంఖ్య సేకరిస్తారని అన్నారు. ఈగణన ప్రతి 5 సంవత్స రాలకు ఒకసారి దేశవ్యాప్తంగా చేపడతారని తెలిపారు. జిల్లాలో గణన సేకరణలో 56 మంది సిబ్బంది, 11 మంది సూపర్ వైజర్లు, ఒక నోడల్ అధికారి పాల్గొననున్నారని తెలిపారు. జిల్లాలో ని 253 గ్రామాల్లో గణన కార్యక్రమాలు జరుగుతాయని, సేకరించిన సమాచారం ఎప్పటికప్పుడు పశుగణన యాప్ లో నిక్షిప్తం చేయబడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. 25 అక్టోబర్ 2024 నుండి 28 ఫిబ్రవరి 2025 వ తేది వరకు జరగనున్నదని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కుమారస్వామి, సహాయ సంచాలకులు డా. గోపాలకృష్ణ మూర్తి, వెంకన్న, పశు వైద్యులు డా ప్రశాంత్, తిరుపతి పాల్గొన్నారు.

# 2028లో అధికారం మాదే

**కేసీఆర్ ఉక్కు నరాలతో తయారైన నాయకుడు..**

**పదేండ్ల పాలనలో తెలంగాణను నంబర్ 1గా నిలిపాం**

**ఏబీపీ సదరన్ రైజ్ సమ్మిట్ లో కేటీఆర్**

**విశ్వంభర, హైదరాబాద్:** తమ అధినేత కేసీఆర్ ఉక్కు నరాలతో తయారైన నాయకుడు అని, ఆయన ఎలాంటి పరిస్థితుల్లోనే చెక్కు చెదరని మనిషి అని భారతీయ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారక రామారావు అన్నారు. 2028లో మళ్లీ అధికారంలోకి వచ్చేది తామేనని కేటీఆర్ స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఏబీపీ సదరన్ రైజ్ సమ్మిట్ 2024 కార్యక్ర మానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ పదేండ్ల పాలనలో తెలంగాణను నంబర్ 1గా నిలిపామని ఆయన తెలిపారు. దేశ చరిత్రలోనే ఎరగని విధంగా రైతు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని, ప్రభుత్వ ఉద్యోగులకు 73 శాతం జీతా లు పెంచామని ఆయన వెల్లడించారు. బీఆర్ ఎస్ తెలంగాణ ప్రజల పార్టీ అని కేటీఆర్ పున రుద్ఘాటించిన ఆయన తెలంగాణ ప్రజలకు బీఆర్ ఎస్ పార్టీ ఎల్లప్పుడూ కృతజ్ఞతతో ఉంటుందని తెలిపారు. రాజకీయ పార్టీలకు ప్రతి ఎన్నిక ఓ పరీక్ష అని, ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని కేటీఆర్ వెల్లడించారు.కాంగ్రెస్ పార్టీ 1.8 శాతం ఓట్ల తేడాతోనే గెలిచిందని ఆయన చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకాల నుంచి ప్రజలను కాపాడుతామని కేటీఆర్ హామీ ఇచ్చారు. తెలంగా ణలో పార్టీ ఫిరాయింపులపై కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నోరు మెదపని రాహుల్ గాంధీ తీరును కేటీఆర్ తప్పుబట్టారు. ఇక.. దేశ రాజకీయాల్లో బీజేపీ అనుసరిస్తున్న వ్యూహాన్ని ఆయన విమర్శించారు. తకు సహకరించని పార్టీలపై ఈడీని ప్రయోగిస్తుందని ఆయన బీజేపీని దుయ్యబట్టారు.

# రైతు పక్షపాతి సీఎం రేవంత్ రెడ్డి

**ప్రభుత్వ కొనుగోలు కేంద్రలోనే ధాన్యం విక్రయించండి**

**కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్**


**విశ్వంభర, పటాన్‌చేరు:** రైతు సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చేరు మండలం ముత్తంగి, పటాన్ చేరు పట్టణంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆవరణలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు అదనంగా 500 రూపాయల బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు. ఏవన్ గ్రేడ్ క్వింటాలుకు రూ. 2,320 లు, సన్న వడ్లకు క్వింటాలకు 2,820 రూపాయల మద్దతు ధర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలని కోరారు. పటాన్ చేరు నియోజకవర్గ వ్యాప్తంగా 10 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్లు రాఘవేంద్రారెడ్డి, బిక్షపతి, ముత్తంగి మాజీ సర్పంచ్ ఉపేందర్, కాంగ్రెస్ పార్టీ పటాన్ చేరు పట్టఅధ్యక్షులు నరసింహారెడ్డి, డైరెక్టర్లు, అధికారులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



**విశ్వంభర, హైదరాబాద్:** పాతబస్తీ ఉప్పుగూడ శివాజీ నగర్ ప్రాంతానికి చెందిన పి. సురేష్ రెడ్డికి గత కొన్ని రోజులుగా వెన్ను పూస నరంతో బాధ పడుతుండడంతో చంద్రాయణ గుట్ట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బోయ నగేష్ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రెండు లక్షల రూపాయలు ఆపరేషన్‌కు అవసరమైన ఆర్థిక సహాయ పత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్ పార్టీ తం పున బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆర్థిక సహా యం అందించినందుకు కుటుంబ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## బండెల రామచంద్ర రెడ్డి జన్మదిన వేడుకలు



**విశ్వంభర, ఆమనగల్లు:** వెంకటాపూర్ గ్రామ మాజీ సర్పంచ్, లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు, లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ బండెల రామచంద్ర రెడ్డి 68వ జన్మదిన వేడుకలు ఆమనగల్ పట్టణంలో లయన్స్ భవన్ కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జన్మదినం జరుపు కుంటున్న బండెల రామచంద్ర రెడ్డిని పూల మాలలతో పలువురు సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేయించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా జీవితంలో ఒక మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ గాను కల్వకుర్తి ఎత్తిపోతల పథకంపై ఆయన నిరం తరం పోరాటం చేశారని గుర్తు చేశారు. క్లబ్ సంయుక్త కార్యదర్శి ఎంగలి బాలకృష్ణ, క్లబ్ పీఆర్‌ఓ పాషా, రాజే శ్వరి, ఎం చంద్రశేఖర్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## మేడిగడ్డ తండాలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మండ లంలోని మేడిగడ్డ గ్రామపంచాయతీకి చెందిన ఇస్లావత్ సోమ్లకు రూ. 39,000లు, సభవాట్ వెంకటియా కు రూ. 36,000 లు ముఖ్యమంత్రి సహాయనిది ద్వారా నిధులు మంజూరయ్యాయి. ఇట్టి చెక్కులను కె.ఎన్. ఆర్ యువసేన జిల్లా నాయకుడు విజయ్ రాథోడ్ శుక్రవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారా యణ రెడ్డి ద్వారా తీసుకొని లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా లబ్దిదారులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ వార్డు మెంబర్ జగన్, రాజ్ కుమార్, కిషన్, వశాంత్, రఘు, లక్ష్మణ్, భద్రు, కళ్యాణ్, కౌశిక్, పంతుల తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 25న మొదలుకానున్న పశుగణన



**విశ్వంభర, మహబూబాబాద్:** గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పశుసంపద అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుంది. మానవ జీవనశైలిలో శాస్త్ర సాంకేతికంగా ఎంతో పురోగతిని, ప్రగతిని సాధించినప్పటికీ అధిక శాతం రైతులు వ్యవసాయ అనుబంధ రంగమైన పాడి పశువులు, గొర్రెలు, మేకలు, దేశీయ కోళ్ల పెంపకం ఆధారంగానే జీవనోపాధి పొందుతు న్నారు. అంతటి ప్రాముఖ్యత కలిగిన పశువుల గణన చేపట్టేందుకు మన జిల్లాలో పశుసంవర్ధక శాఖ 21వ అఖిలభారత జాతీయ పశుగణన కార్యక్రమము ఈనెల 25 నుండి 28 ఫిబ్రవరి 2025 వరకు నిర్వహించబోతున్నారు.శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ బి. కిరణ్ కుమార్, 21వ అఖిలభారత జాతీయ పశుగణన కార్యక్ర మం పోస్టర్ ఆవిష్కరణ చేశారు. మన జిల్లాలో 23 మంది సూపర్వైజర్లు 76 మంది ఎనిమిరేటర్లతో పట్టణాలలో, 461 గ్రామాలలో ప్రతి ఇంటి వద్దకు వెళ్లి రైతుల దగ్గర నుంచి పశుసంపద సమాచారాన్ని సేకరించి వాటిని డిజిటలైజేషన్ ద్వారా వివరాలను పోర్టల్ లో నమోదు చేస్తారు. ఈ కార్యక్రమము నాలుగు మాసాలలో నిర్వహించాలని సరియైన సమాచా రాన్ని నమోదు చేయాలని రైతులు కూడా సిబ్బందికి సహకరించి ఈ కార్యక్రమాన్ని సకాలంలో విషయ సేకరణ చేసి పశురంగంలో పథకాల రూపకల్పనకు ఉపయోగపడాలని సరియైన సమగ్ర సమాచారాన్ని సకలంలో సేకరించి ఈ అఖిలభారత పశుగణనను విజయవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి. రామచంద్ర, డాక్టర్ ఎన్ అశోక్, నోడల్ అధికారి డాక్టర్ ఆర్ శ్రావణ్ కుమార్, ఆర్ఆర్ ప్రియదర్శిని, డాక్టర్ రాజేందర్ పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌ను అమలు చేయాలి




**విశ్వంభర, భువనగిరి:** మహిళా న్యాయవాదుల సమస్యలు పరిష్కరించేందుకు విశాఖ జడ్జిమెంట్లో సుప్రీంకోర్టు గైడ్ లైన్స్ ను అన్ని కోర్టులు అమలు చేయాలని,భువనగిరి బార్ అసోసియేషన్ అధ్య క్షులు బబ్బూరి హరినాథ్, ఐలు జిల్లా అధ్యక్షు లుమామిడి వెంకట్ రెడ్డిలు అన్నారు. బార్ అసో సియేషన్ హాల్లో జరిగిన మీటింగ్లో వారు మాట్లాడుతూ అన్ని బార్ అసోసియేషన్ మహిళ న్యాయవాదుల కు ప్రత్యేక వసతులు కల్పించాలని విశాఖ జడ్జిమెంట్ లో సుప్రీంకోర్టు గైడ్లైన్స్ ను స్పష్టంగా చెప్పడం జరిగిందని గైడ్లైన్ అమలు చేయడంలో జాప్యం జరుగుతుందని వారు అన్నారు, 2019 తర్వాత బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణలో నమోదు చేసుకున్న మహిళా న్యాయవాదుల అందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలి. మెటర్నిటీ, వేసేక్టమీలకు కూడా హెల్త్ కార్డులు వర్తింప చేయాలి, మహిళా న్యాయవాదులకు స్టైఫండ్ రూ.5000 ఇవ్వాలన్నారు. శనివారంఖమ్మంలో జరిగే మహిళా న్యాయవాదుల రాష్ట్ర మూడవ సదస్సుకు జిల్లాలోని అన్ని కోర్టు నుండి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ సదస్సుకు హైకోర్టు జస్టిస్ పి.సుధా హాజరవుతున్నారన్నారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు కలకుంట్ల జయ, సహాయ కార్యదర్శి శివకిరణ్, యాదయ్య,సీనియర్ న్యాయవాది సురకంటి జంగారెడ్డి, బొడ్డు కిషన్, పిడుగు ఐలయ్య, కావిడే నరేష్, యం చంద్రశేఖర్ రెడ్డి, పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ



**విశ్వంభర, మహబూబాబాద్:** ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు మహబూ బాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్యా మురళీ నాయక్ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడు తూ కల్యాణ లక్ష్మి, షాది ముభారక్ చెక్కులను మహబూబాబాద్ మండల కేంద్రానికి, పట్టణ కేంద్రానికి గాను మొత్తం 33లక్షల 3వేల 828 రూపాయల విలువగల 33 చెక్కులను అబ్దిదారులకు అందచేశామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలనలో ఏ కార్యకర్తను గాని నాయకుల్ని గాని పట్టించుకో కుండా వాళ్ళ ఇష్టానుసారంగా పరిపాలన చేశారని, తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నభిన్నం చేసి బీఆర్ఎస్ పార్టీ నాయకులు వేల కోట్లు వెనకేసుకుని తెలంగాణను భ్రష్టు పట్టించారని ధ్వజమెత్తారు. అలాగే సోషల్ మీడియా మాధ్యమాల్లో బీఆర్ఎస్ నాయకులు కావాలని కాంగ్రెస్ నాయకుల మీద ప్రభుత్వం మీద దుష్ప్రచారం చేస్తూ సామాజిక మాధ్య మాల్లో ఇష్టసారంగా విపరీతంగా ట్రోలింగ్స్ చేస్తూ పైన అసభ్యకరమైన పోస్టులను సోషల్ మీడియాలో అప్ లోడ్ చేస్తూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభు త్వం చేస్తున్న ప్రజా పాలనను చూసి ఓర్వలేక కావాలని ప్రజలను రెచ్చగొట్టే విధంగా వారి యొక్క రాజకీయ సౌలభ్యం కోసం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. అలాగే నియోజకవర్గం లోని ప్రతి కార్యకర్త నాయకులు ఇందిరమ్మ కమిటీలో పేరు లేదని పెట్టలేదని ఎవరు ఎలాంటి అపోహలకు పోవద్దని, కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తని నాయకున్ని గుండెల్లో పెట్టి చూసుకుంటానని వారికి రాబోయే రోజుల్లో కచ్చితంగా సముకుచితమైన స్థానాన్ని కల్పిస్తానని వారిని ఉన్నతమైన పదవులలో కూర్చోబెట్టే బాధ్యత నాదని అన్నారు. అంద రూ కలిసికట్టుగా పార్టీ కోసం పనిచేసి రాను న్న స్థానిక ఎలక్షన్లలో కాంగ్రెస్ సత్తా ఏంటో చూపించాలని కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహబూ బాబాద్ పట్టణ అధ్యక్షులు ఘనపురం అంజ య్య, మండల అధ్యక్షులు మిట్టకంటి రాంరెడ్డి, పట్టణ పలు వార్డుల కౌన్సిలర్లు పోతరాజు శ్రీను, శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నారాయణ, బోల్ల రాజు, ఎడ్ల రమేష్, ధూపాతి వినయ్, ఫరూక్, యూత్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులు, లబ్ధిదారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు ఘన స్వాగతం

**పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల ఛైర్మన్ వీర్లపల్లి శంకర్**



**విశ్వంభర, షాద్ నగర్:** అభివృద్ధి, సంక్షేమం విషయంలో షాద్ నగర్ శాసనసభ్యులు, ప్రభుత్వ రంగ సంస్థల ఛైర్మన్ వీర్లపల్లి శంకర్ కు పట్టుదల ఎక్కువ అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కీర్తించారు.

శుక్రవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని బైపాస్ జాతీయ రహదారిపై మంత్రి శ్రీధర్ బాబును స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. మహబూబ్ నగర్ పర్యటనకు మంత్రి శ్రీధర్ బాబు వెళ్తున్న సందర్భంగా బైపాస్ ఎమ్మి హొటల్ ఎదుట కొద్దిసేపు నిలబడి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తో మాట్లాడారు. తదనంతరం మీడియాతో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్‌కు రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల ఛైర్మన్‌గా నియమించి రాష్ట్ర అభివృద్ధి విషయంలో అవకాశం కల్పించడం గొప్ప విషయం అని తెలిపారు. పరిశ్రమలకు సంబంధించి ఇంకా ఇతర అనేక విషయాలపై చర్చించడం కోసం కార్యక్రమం ఏర్పాటు చేయబడిందని ప్రభుత్వ రంగ సంస్థల్లో పారిశ్రామిక అభివృద్ధికి కూడా పెద్దపీట వేసే విధంగా ఛైర్మన్ వీర్లపల్లి శంకర్ సాకారం ఉంటుందని పేర్కొన్నారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్ విశ్వం సీనియర్ నేత బస్వం, కౌన్సిలర్ సర్వర్ పాషా, మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, దంగు శ్రీనివాస్ యాదవ్ తదితరులు మంత్రిని స్వాగతించారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి**



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని నారాయణ ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రామోజీ పల్లి, శివాయ పల్లి, జమ్మికుంట గ్రామాలలో ఐకేపీ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారం భించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం అని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడా లని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రైతు పండించిన ప్రతి చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధరను అందిస్తామని, రైతులకు అన్ని విధాలుగా మా ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. ఐకేపీ పీఏసీఎస్ అధికారులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు మధుసూదన్ నారాయణ గౌడ్, మాజీ ఎంపీపీ రాజు, దాచ సంగమేశ్వర్, దేవేందర్, పెరుమాళ్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

## హిందూ సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



**విశ్వంభర, పెద్ద శంకరంపేట.** హిందూ ఆరాధ్య దేవి దేవతల విగ్రహాలను ధ్వంసం చేయడానికి నిరసిస్తూ శుక్రవారం మండల కేంద్రమైన పెద్ద శంకరంపేటలో హిందూ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టి బంద్ కార్యక్రమం నిర్వహించారు. పెద్ద శంకరంపేటలోని వ్యాపార వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా తమ దుకాణాలను మూసివేసి నిరసన కార్యక్రమంలో పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించారు. పేటలోని రామాలయం నుండి హిందూ సంఘాల బాధ్యులు అధిక సంఖ్యలో పట్టణ పురవీధుల గుండా జై శ్రీరామ్, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ దేవి దేవతల విగ్రహాలను ధ్వంసం చేసిన వారిపై ప్రభుత్వం చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్. మండల బీజేపీ అధ్యక్షులు కోణం విట్టల్, హిందూ సంఘాల ఐక్యవేదిక బాధ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 317 జీవోలోని లోపాలను సవరించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

## జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్



**విశ్వంభర, హైదరాబాద్:** 317 జీవో ద్వారా నష్టపోయిన ఉద్యోగుల యొక్క ప్రతి దరఖాస్తును పరిశీలించి న్యాయం చేయాలని, అవసరమైతే సూపర్ న్యూమరరి పోస్టులను ఏర్పాటు చేసి సర్దుబాటు చేయాలని చైర్మన్ మారం జగదీశ్వర్,సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావులు అన్నారు. సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధ్యక్షతన 317 జీవో వల్ల నష్టపోయిన ఉద్యోగుల యొక్క సమస్యలను పరిష్కరించడం కోసం విస్తృతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రధానంగా 317 జీవో ద్వారా నష్టపోయిన ఉద్యోగుల యొక్క ప్రతి దరఖాస్తును పరిశీలించి న్యాయం చేయాలని అవసరమైతే సూపర్ న్యూమరరి పోస్టులను ఏర్పాటు చేసి సర్దుబాటు చేయాలని చెప్పి కోరడమైనది. 317 జీవో అనేది చాలా లోపభూ ఇస్తంగా ఉన్నదని ఉద్యోగ సంఘాలు గత ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినప్పటికీ అప్పటి ప్రభుత్వం నిరంకుశంగా ఉద్యోగుల ఆకాంక్షలకు వ్యతిరేకంగా వ్యవహరించి జీవోను తీసుకొచ్చి ఉద్యోగుల నెత్తి మీద రుద్దారని తెలిపారు. స్థానికతకు అవకాశం ఇవ్వకుండా కేవలం సీనియార్టీ ప్రాతిపదికన ఉద్యోగులకు ఆప్షన్లు ఇచ్చి బలవంతంగా తమ అభీష్టానికి వ్యతిరేకంగా స్థానికేతర ప్రాంతాల్లోకి సుదూరంగా ఉద్యోగులను పంపించడం వల్ల కుటుంబాలు కుటుంబాలు దూరం అయ్యారు అని తెలిపారు. భార్య ,భర్తలు, వికలాంగులు, విడో కేసులు, మెడికల్ కేసులు తదితర అనేక ఇబ్బందులు పడుతున్న ఉద్యోగుల యొక్క ఆకాంక్షలకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా ప్రవర్తించి ఉద్యోగుల కోపాన్ని చవిచూసి వారి అధికారాన్ని కోల్పోయారు అని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన అన్ని ఉద్యోగ వ్యతిరేక విధానాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ఉద్యోగుల ఆకాంక్షల మేరకు 317 జీవోలో జరిగిన లోపాలు అన్నింటినీ సవరించాలని చెప్పి తెలంగాణ ఉద్యోగులు చేసి కోరడమైనది అని అన్నారు. 37 జీవోకి కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తూ ఇటీవల కేబినెట్ సబ్ కమిటీ తమ రిపోర్టును ముఖ్యమంత్రికి అందజేసింది. కాబట్టి, ఆ రిపోర్టును బహిర్గతం చేసి ఉద్యోగులకు అందులో ఉండే వ్యతిరేక అంశాలను పరిశీలించిన పిమ్మట దాన్ని ఆమోదించి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఉద్యోగ సంఘ నాయకులు తెలియజేశారు. అదనపు చైర్మన్ శ్రీ పాల్ రెడ్డి, వైస్ చైర్మన్ చావా రవి ,సదానంద గౌడ్, లింగారెడ్డి, రెవెన్యూ ఉద్యోగుల సంఘం వంగ రవీందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్ ప్రధాన కార్యదర్శి గంగాధర్, ఖాదర్,డిప్యూటీ సెక్రటరీ జనరల్ లో ఎస్ఎం హుస్సేని ముజీబ్, సత్యనారాయణ , సెక్రటరీ కస్తూరి వెంకటేశ్వర్లు, పబ్లిసిటీ సెక్రటరీ శ్యాం, ఉపాధ్యాయ సంఘాల నేతలు అబ్దుల్లా, పంచాయతీరాజ్ నేతలు మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.


## కేటీఆర్‌కు జైలు భయం పట్టుకుంది

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు జైలు భయం పట్టుకుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. జైలుకు పోవాల్సి వస్తుందన్న టెన్షన్ లో ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. "పదేళ్లలో చేసిన అక్రమాలు బయటకు వస్తాయన్న భయం ఆయనలో కనిపిస్తోంది. మేం ఏం చేయగలమో రెండు ఎన్నికల్లో చేసి చూపించాం. నాలుగు రోజులు ఓపిక పడితే ఇంకా ఏం చేస్తామో మీకే తెలుస్తుంది. పార్టీ మారిన వారు వ్యభిచారులు అయితే ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలను మంత్రులు చేసిన వారిని ఏమనాలి పదేళ్లలో 60 మందికి పైగా ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను చేర్చుకున్న మీ తండ్రికి ఏం పేరు పెట్టాలో మీరే చెప్పండి. అధికారంలో ఉన్నన్ని రోజులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన మిమ్మల్ని ఎన్ని రాళ్లతో కొట్టాలి. కేటీఆర్.. ఎందుకు ఆనాడు ప్రతిపక్ష ఎమ్మెల్యేలను చేర్చుకున్నావ్. సిరిసిల్లలో అన్నిపార్టీల నుంచి పోటీ చేసిన ఎమ్మెల్యే అభ్యర్థులను భారాసలో చేర్చుకున్నావు. మీరు ఎన్ని చెప్పినా.. తెలంగాణ ప్రజలు మిమ్మల్ని పట్టించుకోరు" అని ఆది శ్రీనివాస్ అన్నారు.

## జీవన్‌రెడ్డి ఆవేదన చూసి బాధ కలిగింది : జగ్గారెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆవేదన మీడియాలో చూసిన తర్వాత తనకు చాలా బాధకలిగిందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. ఆయన విషయంలో ఏం జరుగుతుందో తనకు అర్థం అవ్వడం లేదని, ఏం మాట్లాడాలో కూడా అర్థం కావడం లేదని చెప్పారు. జీవన్‌రెడ్డికి జగ్గారెడ్డి అండగా ఉన్నాడని చెప్పడానికి,తన మనసులో మాట మీ మీడియా ద్వారా తెలియజేస్తున్నాట్లు తెలిపారు. అయితే తాను ఎవరిని తప్పుపట్టడం లేదని పేర్కొన్నారు. కానీ తాను ఒంటరినని అనుకోవద్దని ఈ సందర్భంగా జీవన్ రెడ్డికి ఆయన సూచించారు. సమయం వచ్చినప్పుడు జీవన్‌రెడ్డి వెంట జగ్గారెడ్డి ఉంటాడని చెప్పారు. జీవన్ రెడ్డి పక్కా కాంగ్రెస్ వాది అని,కానీ ఆయన జీవితమంతా కష్టాలేనని జగ్గారెడ్డి గుర్తు చేశారు.ఆయన నిత్యం ప్రజల మధ్య ఉంటారన్నారు. అలాంటి ఆయన్ని జగిత్యాల ప్రజలు ఎందుకు ఒడగొట్టారో కూడా తనకు అర్థం కావడం లేదన్నారు. అలాగే సంగారెడ్డిలో తాను ఎంతో అభివృద్ధి చేశానని.. అయినా తనను సైతం ఎందుకు ఓడగొట్టారో అర్థం కావడం లేదని జగ్గారెడ్డి సందేహం వ్యక్తం చేశారు. తాను పార్టీని కానీ.. ప్రజలను కానీ తప్పుపట్టడం లేదన్నారు. తమ టైం బాగోలేదని.. ఎవరేం చేస్తామని అందుకే సర్దుకు పోతున్నామని వివరించారు.ఇక ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి తన వయస్సుకు తేడా ఉందన్నారు. ఈ వయసులో ఆయనకు ఇలాంటి రాజకీయ ఇబ్బందులు రావడం నిజంగా బాధాకరంగా ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో జీవన్‌రెడ్డి సమస్యకు సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపాలని ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి, పిసిసి చీఫ్ మహేష్ గౌడ్, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతోపాటు పార్టీ అగ్రనేత రాహూల్ గాంధీని విజ్ఞప్తి చేస్తున్నానని జగ్గారెడ్డి తెలిపారు.

## నేడు డా.మండల స్వామి సంస్మరణ సభ

### సంస్మరణ సంచిక 'స్నేహ పరిమళం' పుస్తకావిష్కరణ



**విశ్వంభర, నల్లగొండ** తెలంగాణ గ్రామ నామాల పరిశోధకుడు డా. మండల స్వామి సంస్మరణ సభ శనివారం సాయంత్రం 6 గంటలకు యూటీఎఫ్ భవన్ నల్లగొండలో ఉంటుందని, సంస్మరణ సంచిక 'స్నేహ పరిమళం ' పుస్తకాన్ని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆవిష్కరించనున్నారని సభ నిర్వాహ కులు, సృజన సాహితి అధ్యక్ష , కార్యదర్శులు పెరుమాళ్ళ ఆనంద్, డా. సాగర్ల సత్తయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సాహితీవేత్తలు డా. ఏనుగు నరసింహా రెడ్డి, డా. తండు కృష్ణ కౌండిన్య పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని కవులు రచయితలు, కళాకారులు పాల్గొనాలని వారు కోరారు.

## జంగయ్య కుటుంబానికి అండగా ఎమ్మెల్యే



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మున్సిపాలిటి జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన జంతుక జంగయ్య అనారోగ్యంతో బాదపడుతూ శుక్రవారం ఉదయం మరణించారు. నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయసంస్థ మాజీ డైరెక్టర్ పసుపుల జంగయ్యతో కలిసి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు 5 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. మృతుని కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలియజేశారు. మెకానిక్ బాబా, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, తాల్ల రవీందర్, రమేష్, ఫిరోజ్, కొండల్, ఖాదర్, ఎంగలి ప్రసాద్, శీను పాల్గొన్నారు.

## రాజ్యలక్ష్మికి గవర్నర్‌చే సన్మానం



**విశ్వంభర, ఎల్బీనగర్:** మహిళా వికలాంగుల సాధికారిక సంఘం అధ్యక్షురాలు రాజ్యలక్ష్మిని ఫ్రెండ్లీ ఎన్విరాన్మెంట్ వైట్‌కెన్‌డే సందర్భంగా గవర్న విష్ణుదేవ్ వర్మ ఘనంగా సన్మానించారు. మహిళల కోసం వారి హక్కుల కోసం పోరాడుతున్న వారికి వివిధ రంగాలలో పనిచేస్తున్న నాయకులకు గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందించి సత్కరించారు. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ అవార్డు రావడంతో ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. మరింత బాధ్యత పెంచిందని తెలిపారు.

# కేసీఆర్ తెలంగాణను అల్లకల్లోలం చేసి పోయిండు

### చేసిన పాపాలన్నీ మర్చిపోయిన హరీష్ రావు కేటీఆర్

### కేటీఆర్ గజినీలాగా అయిపోయాడు

### కేటీఆర్ పొద్దున లేస్తే అబద్దాలు తప్ప నిజాలు చెప్పే పరిస్థితి లేదు



**విశ్వంభర, వికారాబాద్:** స్పీకర్ గడ్డం ప్రసాద్ కేసీఆర్ తెలంగాణను అల్లకల్లోలం చేసి పోయిండు.. ఏడు లక్షల కోట్లు అప్పుచేసి పోయిండని స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. నెలకు రూ.7 వేల కోట్లు మిత్తి కడుతున్నామని, కేసీఆర్ ప్రభుత్వంలో జీతాలు ఇచ్చే పరిస్థితి లేకుండే అని ఆయన వ్యాఖ్యానించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నెల నెల ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని, చేసిన పాపాలన్నీ మర్చిపోయారు హరీష్ రావు, కేటీఆర్ అని ఆయన ఆరోపించారు. కేటీఆర్ గజినీలాగా అయిపోయాడని, కేటీఆర్ పొద్దున లేస్తే అబద్దాలు తప్ప నిజాలు చెప్పే పరిస్థితి లేదన్నారు. ఇంతకుముందు ఉన్న ముఖ్య మంత్రి తనకోసం తన కుటుంబం కోసం చేసుకున్నాడని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోగ్యంగా ఉండాలన్నారు. వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ కు రాజకీయ అనుభవం లేదని, మేనిఫెస్టోలో పెట్టిన అన్ని కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు స్పీకర్ ప్రసాద్ కుమార్. డిసెంబర్ 9 న సోనియా గాంధీ పుట్టిన రోజు అని, వికారాబాద్ జిల్లా సమగ్ర అభివృద్ధి జరుగుతుందని, పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తాయన్నారు. చదువుకున్న పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని ఆయన తెలిపారు. గ్రామాలలో బండల ఇండ్లు లేకుండా చూస్తామని, ఐదు సంవత్సరాల లోపల అన్ని వాగ్దానాలను పూర్తి చేస్తామన్నారు. గ్రామాలలో బెల్ట్ షాపులు లేకుండా చేస్తామని, నేను స్పీకర్ ను కాదు మీ అన్న లాంటి వాడిని ఆయన అన్నారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ పొద్దున నుండి రాత్రి 11 గంటల వరకు పనిచేస్తున్నాడన్నారు.

# గాదరి.. నోరు అదుపులో పెట్టుకో..





**విశ్వంభర, నార్కెట్ పల్లి:** గాదరి... నోరు అదుపులో పెట్టుకో... కోమటిరెడ్డి వెంకటరెడ్డి గురించి మాట్లాడితే బట్టలిప్పేసి కొడతాం కోమటిరెడ్డి ముందు నువ్వెంత నీ బతుకెంత నీ సంగతి మేం కాదు మీ పార్టీ కార్యకర్తలే చూస్తారు. తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ నోరు అదుపులో పెట్టుకోవాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని నార్కెట్పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తుల ఉషయ్య డిమాండ్ చేశారు. లేకుంటే కాంగ్రెస్ కార్యకర్తలు బట్టలూడదీసి కొడతారని హెచ్చరించారు. నార్కెట్ పల్లి లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోమటిరెడ్డి బ్రదర్స్ అంటేనే ఒక బ్రాండ్, సేవకు ఆ కుటుంబం మారు పేరు. జిల్లాను సస్యశ్యామలం చేయాలని రైతులకు సాగునీటి ని, ఫ్లోరైడ్ బాధితులకు రక్షిత మంచినీటి ని అందించాలనే సంకల్పంతో మంత్రి పదవిని కూడా నిరాకరించిన వ్యక్తి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని, అలాంటి ది కోమటిరెడ్డి వెంకటరెడ్డి పై చిల్లర మాటలు మాట్లాడితే వాళ్ళు సహించినా కోమటిరెడ్డి అభిమానులు గా మేము నిన్ను సహించమని మండిపడ్డారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి రాజకేయాల్లో అడుగుపెట్టిన రోజు నువ్వు కనీసం లాగు తొడుక్కున్నావా నువ్వు ఎక్కడున్నావ్ అని ప్రశ్నించారు. పదేళ్ల పాటు ఎమ్మెల్యే గా కొనసాగి ఏ ఒక్క దళిత కుటుంబానికి న్యాయం చేశావా, ఏ ఒక్క దళిత విద్యార్థికి చదువు కోసం ఆర్థిక సాయం అందించావా అని ఉషయ్య నిలదీశారు. అసలు రామన్నపేట లో అంబుజ సిమెంట్ పరిశ్రమకు భూములు కొనిచ్చింది మీ గవర్నమెంట్ లోనే, అనుమతి ఇచ్చింది మీ బీఆరెస్ ప్రభుత్వం లోనే, పైగా ప్రజల ఆరోగ్యానికి హాని చేకూర్చే ఆ పరిశ్రమను వద్దని మొదటి నుంచీ అభ్యంతరం చెప్పింది కాంగ్రెస్ పార్టీనే, ప్రజాభిప్రాయ సేకరణలో వ్యతిరేకత ప్రదర్శించింది కాంగ్రెస్ నాయకులే, అయినా రాజకీయ లబ్ది కోసం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ని, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను ఉద్దేశించి అనవసర విమర్శలు చేస్తే ఉపేక్షించేది లేదని, చిరుమర్తి లింగయ్య కూడా కోమటిరెడ్డి వెంకటరెడ్డి పై విమర్శలు చేయడం దొంగే.. దొంగ అన్నట్లు ఉందన్నారు. సభ్య సమాజం సిగ్గుపడే విధంగా మాట్లాడిన వ్యక్తిపై చట్టరీత్యా చర్య తీసుకోవాలని పోలీస్ స్టేషన్లో కంప్లేయింట్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు వడ్డె భూపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పాశం శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సట్టు సత్తయ్య, ఐతరాజు యాదయ్య, యానాల రాంరెడ్డి, వేముల సత్తయ్య, పుల్లెంల అచ్చాలు, ధార యాదయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జేరిపోతుల భరత్, పల్లె నరేందర్ రెడ్డి, కొమ్మనబోయిన మల్లేష్, ఎల్లందుల లింగస్వామి (కిట్టు), పసునూరి కోటయ్య, రాధారపు బిక్షపతి, లింగాల రాములు, శిలువేరు గిరి, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తక్షణమే చర్య తీసుకోవాలి

### ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**విశ్వంభర, ఎల్బీనగర్:** మాన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని డంపింగ్ యార్డు పక్కన నుంచి పోచంపల్లికి పోయే రహదారి పునరుద్ధ రించడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దేవీరెడ్డి సుధీర్ రెడ్డి క్రిడ డైరెక్టర్ వినోద్ కుమార్ సింగ్‌ని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కోరారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ మన్సూరాబాద్ నుండి పాత జెడ్.పీ.రోడ్డు సంబంధించి పోచంపల్లి రోడ్డు 90 సంవత్సరాలకు పైగా ఉనికిలో ఉండే ఈ ప్రాంత వాసులకు అనుసంధానంగా ఉండేదని తెలిపారు. అటవీశాఖ (క్రిడ) ఈ రహదారికి అడ్డుగా గోడను నిర్మించడంతో ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందన్నారు. గోడ అడ్డంకులు తొలగించాలని విన్నవించినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. అటవీశాఖ గోడ కారణంగా ఏర్పడిన అడ్డంకి కీలకమైన ప్రజామార్గాన్ని అడ్డుకోవడమే కాకుండా చాలా మంది నివాసితులు తమ రోజువారీ రాకపోకలకు ఆధారపడే ఔటర్ రింగ్ రోడ్డు ప్రవేశానికి ఆటంకం కలుగుతుంది అని తెలిపారు. ప్రజా ప్రయోజనం, రహదారి ఉనికికి చారిత్రక, అడ్డంకిని తొలగించడం ద్వారా మార్గంలో ప్రజల స్వేచ్ఛగా ప్రయాణించే హక్కును నిర్ధారించి రహదారిని పునరుద్ధరించడానికి తక్షణమే చర్య తీసుకోవాలని కోరారు. తప్పకుండా ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లి మీ యొక్క సమస్య పరిష్కారం చేస్తా 0మని హామీ ఇచ్చారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం చౌదర్ పల్లి గ్రామానికి చెందిన చింతకాయల నరసింహ అనారోగ్యంతో గురువారం రాత్రి మరణించారు. స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకురి ప్రభాకర్ రెడ్డి దహన సంస్కారాల కోసం 3,000 రూపాయలు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమిరెడ్డి భగవాన్ రెడ్డి 2,500 రూపాయలు కలిపి మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. మాజీ సర్పంచ్ కాలేబాల మైసయ్య, నాయకులు భాస్కర్ రెడ్డి బాల్ రెడ్డి, చింతకాయల నరసింహ, వడ్ల ఆచారి, దుద్దు శ్రీశైలం, జాజాల నరేష్, జాజాల శేఖర్, కాలె మహేష్, పాల్గొన్నారు.

## ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా కొండా శ్రీకాంత్



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** నారాయణపురం మండల ప్రెస్ క్లబ్ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండ శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా ఎస్ కే పాషా, ప్రధాన కార్యదర్శిగా కలకొండ సంజీవ, కోశాధికారిగా ఉప్పల వెంకటేష్, సహాయ కార్యదర్శిగా గంగాపురం సాయి, గౌరవ సలహాదారుగా పాలకుర్ల యాదయ్య, గౌరవ అధ్యక్షుడిగా శ్రీధర్, కార్యవర్గ సభ్యులుగా పందుల నరసింహ, చిలువేరు అంజయ్య, చిలువేరు వీరేశం, కొండ శ్రీనివాస్, పందుల వెంకటేష్, గజవెల్లి వెంకటేశ్వర్లు, చిలువేరు సంజీవ, చిలువేరు రమేష్, బాకారం నాగార్జున, సికిలమెట్ల ప్రభాకర్, సిరి పంగి బాలరాజు, జలంధర్ నాయక్ ఎన్నికయ్యారు.

## రెండు ద్విచక్ర వాహనాలు డీకొని ఇద్దరు మృతి



**విశ్వంభర, మెట్ పల్లి:** మెట్ పల్లి పట్టణ శివారు లోని వెల్లుల్ల రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. బండ లింగాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ (50) అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన వెల్లుల్ల గ్రామానికి చెందిన స్వామి (42) మెట్ పల్లి ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కొరకు నిజామాబాద్ ఆసుపత్రికి తీసుకు వెళుతుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మెట్ పల్లి టౌన్ సీ ఐ నిరంజన్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చెరువుల సుందరీ కరణకు ప్రత్యేక నిధులు

### 11 కోట్లతో చెరువుల అభివృద్ధికై టెండర్లకు శ్రీకారం

### బోడుప్పల్ అభివృద్ధే తన ధ్యేయం మేయర్ అజయ్ యాదవ్



**విశ్వంభర, మేడిపల్లి:** బోడుప్పల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ చెరువులకై ప్రత్యేక చొరవ చూపిస్తూ అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతూ, నగరంలోని చెరువులను సుందరీకరంగా తీర్చిదిద్దే దిశగా ముందడుగు వేస్తున్నారు. ఇక బోడుప్పల్ చెరువుల రూపురేఖలు పూర్తిగా మారుస్తూ పునర్ వైభవం సంతరించుకోనున్నాయని ఆయన తెలిపారు. కార్పొరేషన్ మేయర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన అతి తక్కువకాలంలోనే చెరువుల సుందరీకరణ కోసం హెచ్ఎండీఏ నిధులు మంజూరు అయ్యేలా చొరవ తీసుకుని బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని సుద్దకుంట, చెరువు, అల్మాస్ కుంటా చెరువులను సుందరీకరించే ప్రక్రియలో భాగంగా మొదటి దశ పనుల్లో భాగంగా ట్రాక్ నిర్మాణం కోసం రూ 11 కోట్ల నిధులతో టెండర్లు పిలవడం జరిగిందని మేయర్ తోటకూర అజయ్ యాదవ్ తెలిపారు.

## మల్లికార్జున్ నగర్ అధ్యక్షులుగా అశోక్ చారి ...

### బీరప్ప గడ్డకు అధ్యక్షులుగా కోకొండ జగన్ ముదిరాజ్



**విశ్వంభర, సికింద్రబాద్:** చిల్కానగర్ డివిజన్లోని మల్లికార్జున నగర్, బీరప్పగడ్డలో నూతన కాలనీ సంక్షేమ సంఘం ఏర్పాటు చేశారు. మల్లికార్జున్ నగర్ కాలనీలో అశోక్ చారి, బీరప్ప గడ్డలో కోకొండ జగన్ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన అధ్యక్షులు కార్పొరేటర్ గీతా ప్రవీణ్ ముదిరాజ్‌ను కలిశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ వారిని సత్కరించి అభి నందనలు తెలిపారు. కాలనీలోని సమస్యలను కార్పొరేటర్, ఎమ్మెల్యే సహకారంతో పరిష్కరిం చుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకుడు ఎద్దుల కొండల్ రెడ్డి, మల్లికార్జున్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పెంటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్ రెడ్డి, ఉపాధ్యక్షులు సుందర్ ఉపేందర్, కార్యదర్శి పాండు, కోశాధికారి ప్రసాద్ చారి, బీరప్ప గడ్డ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పిట్టల రామచందర్, ఉపాధ్యక్షుడు నర్సింగ్ పసుపు, జాయింట్ సెక్రటరీ గణేష్, కోశాధికారి మార్కా శీను, ఆర్గనైజింగ్ సెక్రటరీ జాంగిర్, లీగల్ అడ్వైజర్ జగన్, సాలమన్, సత్యనారాయణ, యాదయ్య, మల్లేష్ ఉన్నారు.

## బాధితుడికి అండగా నిలిచిన ఎమ్మెల్యే గూడెం



**విశ్వంభర, సంగారెడ్డి:** పటాన్ చెరు నియోజకవర్గం జిన్నారం మండలంలో కాలుష్య జలాలు తాగి రైతు సాయికుమార్‌కు సంబంధించిన మూగజీవాలు మృతి చెందిన సంఘటనలో బాధితుడికి ఎమ్మెల్యే జీఎంఆర్ అండగా నిలిచారు. పరిశ్రమల యాజమాన్యాలతో చర్చించి నష్టపరిహారం అందించారు. జిన్నారం మండలం గడ్డపోతారం గ్రామ పరిధిలోని కిష్టాయపల్లి గ్రామానికి చెందిన రైతు బాశెట్టి సాయికుమార్‌కు సంబంధించిన 18 మూగజీవాలు ఇటీవల గ్రామ పరిధిలోని కుంటలో కాలుష్య జలాలు తాగి మృతి చెందాయి. ఈ అంశంపై స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్థానిక పరిశ్రమల యాజమాన్యాలతో చర్చించి బాధితుడికి నష్టపరిహారం అందించాలని ఆదేశించారు. ఇందుకు అనుగుణంగా స్థానిక మోదరన్ ఫ్యాక్టరీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 16 లక్షల రూపాయల నష్టపరిహారం అందించేందుకు అంగీకరించారు. శుక్రవారం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సమక్షంలో రైతు సాయికుమార్ కి పదహారు లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ కాలుష్యకారక పరిశ్రమలపై కఠినచర్యలు తీసుకోవాలని పీసీబీ ఉన్నత అధికారులకు ఇటీవల సూచించడం జరిగిందని తెలిపారు. గడ్డపోతారం మాజీ సర్పంచ్ ప్రకాష్ చారి, పరిశ్రమల సమాఖ్య ప్రతినిధి మూర్తి, స్థానికులు పాల్గొన్నారు.

## సాయి సన్నిధిలో ఎస్పీ ప్రత్యేక పూజలు



**విశ్వంభర, చింతపల్లి:** చింతపల్లి మండల కేంద్రంలోని షిరిడి సాయిబాబా దేవాలయాన్ని జిల్లా ఎస్పీ శరత్ పవర్ చంద్ర శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సాయి నాధునికి అష్టోత్తర శతనామావళి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయినాధుని ఆశీస్సులతో జిల్లా ప్రజలకు శాంతి భద్రతల పరిరక్షణ ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ డీఎస్పీ గిరిబాబు, నాంపల్లి సీఐ నవీన్, చింతపల్లి ఎస్ఐ బి.యాదయ్య, సాయిబాబా టెంపుల్ ట్రస్టు సభ్యులు తడకమళ్ళ శ్రీనివాస్, సుదర్శన్ పాల్గొన్నారు.

## పాఠశాలలు, వసతి గృహాలు తనిఖీ



**విశ్వంభర, మహబూబాబాద్:** నెల్లి కుదురు మండల కేంద్రం లోని తెలంగాణ మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ స్కూల్, ఎర్రబెల్లిగూడెం అంగన్వాడి స్కూల్స్, ప్రాథమికోన్నత పాఠశాలలను జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశాల మేరకు మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న తనిఖీ చేశారు. పాఠశాలలలో మరియన్న మాట్లాడుతూ మెరుగైన ఫలితాలు కోసం నిరంతరం మంచి విద్య ను అందించాలని టీచర్లు కు సూచించారు. చుట్టూ పరిసరాలు పరిశుభ్రతని నిర్వహించాలని, వేడి వేడి భోజనం విద్యార్థులకు అందించాలని, విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అన్నారు.

## గ్రామపంచాయతీని తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి



**విశ్వంభర, త్రిపురారం:** త్రిపురారం మండల ప్రత్యేక అధికారి వి శ్రీదేవి, మండల అభివృద్ధి అధికారి విజయ కుమారి గ్రామ పంచాయతీ తనిఖీల లో భాగంగా బెజ్జికల్ గ్రామపంచాయతీలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలు విధానాన్ని, అంగన్వాడి కేంద్రం పనితీరును, పల్లె ప్రకృతి వనంలో చేపడుతున్న సస్యరక్షణ పనులను, స్మశాన వాటిక, వర్మి కంపోస్టు, తడి చెత్త పొడి చెత్త, పలువిభాగాలలోని పనితీరును అయా శాఖల ఉద్యోగుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులు విధులలో అలసత్వం వహించరాదని, ఎలాంటి అనర్థాలకు తావివ్వకుండా ఎవరి బాధ్యతలు వారు సక్రమంగా నిర్వహించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె విజయ కుమారి ఏపీఓ శ్యామల, పంచాయతీ కార్యదర్శి, ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# మీట్ యువర్ ఎస్పీ కార్యక్రమానికి అనూహ్య స్పందన

- చింతపల్లి పోలీస్ స్టేషన్ ను సందర్శించిన ఎస్పీ శరత్ చంద్ర పవార్
- మీట్ యువర్ ఎస్పీ కార్యక్రమంలో పలు ఫిర్యాదులను పరిశీలన



**విశ్వంభర, చింతపల్లి:** చింతపల్లి మండల కేంద్రంలో ఉన్న పోలీస్ స్టేషన్ ను నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ పవర్ చంద్ర సందర్శించారు. పోలీస్ స్టేషన్ లోని సిబ్బంది పని తీరు, పోలీసు స్టేషన్ పరిసరాలు, స్థితిగతులు గురించి ఎస్ఐ ని అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్, స్టేషన్ రైటర్, లాక్ అప్, యస్.హెచ్.ఓ రూమ్ తదితర ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు ఎప్పుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందిస్తూ, భాదితులకు తగు న్యాయం జరిగేలా పనిచేయాలని ఆదేశించారు.

పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఫిర్యాదు దారులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించి బాధితులకు తగు న్యాయం జరిగేలా పోలీస్ సిబ్బంది పనిచేయాలని, సామాన్యుడు పోలీస్ స్టేషన్ కి వస్తే తగు న్యాయం జరుగుతుంది అనే నమ్మకం కలగజేసేలా పని చేయాలని, అప్పుడే ప్రజలలో పోలీస్ శాఖ పైన నమ్మకం కలుగుతుంది అన్నారు. అనంతరం మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న పోలీసు స్టేషన్ పనులను పరిశీలించి నాణ్యతతో త్వరితగతిన ముగించాలని అన్నారు. అనంతరం పోలీసు స్టేషన్లో నిర్వహించిన మీట్ యువర్ ఎస్పీ కార్యక్రమానికి మండల పోలీసు స్టేషన్ పరిధిలోని విశేష స్పందన వచ్చిందన్నారు. పిర్యాదారులతో వారి సమస్యల పట్ల ముఖాముఖీ మాట్లాడి, పరిశీలించి సత్వర పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. మారుమూల గ్రామాల్లోని ప్రజలు జిల్లా కేంద్రానికి రాలేక ఇబ్బందులు పడుతున్నారని దీని కొరకు ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను పరిస్కరించుటయే ధ్యేయంగా ఈ యొక్క ప్రోగాం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఇక నుంచి జిల్లా వ్యాప్తంగా పోలీసు స్టేషన్లో మీట్ యువర్ ఎస్పీ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం కొరకు కృషి చేస్తామని అన్నారు.

చింతపల్లి మండలంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో నిర్వహించిన మీట్ యువర్ ఎస్పీ కార్యక్రమానికి ప్రజల నుండి అనూహ్య స్పందన వచ్చిందని ఎస్పీ శరత్ పవర్ చంద్ర తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో మీట్ యువర్ ఎస్పీ కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. మొదటిసారిగా చేపట్టిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. ఈ కార్యక్రమానికి మండల వ్యాప్తంగా ప్రజలు నుండి వచ్చిన ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. బాధితుల సమస్యల పరిష్కారం కోసం వెంటనే అధికారులు చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ డీఎస్పీ గిరిబాబు, నాంపల్లి సీఐ నవీన్, చింతపల్లి ఎస్ఐ యాదయ్య, పోలీస్ సిబ్బంది, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివి

- పోలీసుల త్యాగాలకు గుర్తుగా పోలీస్ ఫ్లాగ్ డే
- ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్ పి రూపేష్
- విద్యార్థిని విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన ఎస్ పీ



**విశ్వంభర, సంగారెడ్డి:** ఫ్లాగ్ డే వారోత్సవాలలో భాగంగా రాయల్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా ఎస్ పీ రూపేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ పీ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 నుండి 31వ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి (ఏక్తా దివాస్) వరకు పోలీసు ఫ్లాగ్ డే వారోత్సవలను నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. సి.ఆర్.పి.యఫ్ ఎస్.ఐ కరమ్ సింగ్ నాయకత్వంలోని 20 మందితో లడక్ ప్రాంతంలో హాట్ స్ట్రింగ్ వద్ద విధులు నిర్వహిస్తున్న భారత జవాన్ల పై చైనా ఆర్మీ దొంగ దాడి చేసి 10 మందిని హత మార్చిందన్నారు. అప్పటి నుండి దేశ వ్యాప్తంగా విధి నిర్వహణ లో అసువులు బాసిన పోలీసు అమర వీరులను స్మరిస్తూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా (పోలీస్ ఫ్లాగ్ డే)గా నిర్వహిస్తున్నమన్నారు. ఫ్లాగ్ డే ను పురస్కరించుకొని బ్లడ్ డొనేషన్ క్యాప్ వంటి కార్యక్రమాలు, పోలీసు అమరుల కుటుంబ సభ్యులను కలిసి వారి యోగా క్షేమాలు తెలుసుకోవడం, స్కూల్స్, కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు పోలీసు శాఖ పని తీరు గురించి అవగాహన కార్యక్రమాలు, వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలంటే కఠోర శ్రమ తప్పదని, అందుకు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సకారం చేసుకునే విధంగా సాధన చేయాలని ఎస్ పీ సూచించారు. చెడుకు వ్యాసనాలకు ఆకర్షితులు కావద్దని, మన చుట్టూ జరుగుతున్న చట్ట వ్యతిరేక అసాంఘీక కార్యకలాపాలు, ర్యాగింగ్స్ వంటి చట్ట విరుద్ధమైన కార్యకలాపాలపై బాధ్యత గల భారత పౌరులుగా పోలీస్ శాఖకు సమాచారం అందించాలని అన్నారు. జిల్లా(ఎస్ పి) ఫోన్ నెంబర్ 8712656777 కు నేరుగా సమాచారం అందించవలసిందిగా సూచించారు. జిల్లా ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణలో జిల్లా పోలీసు శాఖ అహర్నిశలు కృషి చేస్తుందని అన్నారు. జిల్లాలో మహిళల భద్రతకు పెద్ద పీట వేస్తూ ఎస్ఎస్ఎస్సీ ఆధ్వర్యంలో షీ షట్లర్ బస్సులను ప్రారంభించడం జరిగిందని, ట్రాఫిక్ సమస్యలను అధిగమించడానికి ట్రాఫిక్ ఎన్ఫోర్స్మెంట్ బైక్ లను ప్రారంభించడం జరిగిందన్నారు. విద్యార్థిని విద్యార్థుల రక్షణ దృష్ట్యా షీ-టీం బృందాలు స్కూల్స్, కళాశాల, బస్ స్టాండ్ ప్రాంతాలలో నిఘా వేసి ఉంటాయన్నారు. ఎలాంటి అత్యవసర సమయంలోనైన డైల్ 100 కు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాయల్ కళాశాల ప్రిన్సిపల్ కృపానిధి, యువజన సంఘాల నాయకులు కూన వేణు, రాయల్ కళాశాల, శ్రీతేజ కళాశాల, ప్రభుత్వ మహిళా కళాశాలల లెక్చరర్స్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మంత్రులను విమర్శించే అర్హత మీకు లేదు

**విశ్వంభర, రామన్నపేట:** నల్లగొండలో జరిగిన మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డిని, నల్లగొండ జిల్లా అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని విమర్శించే అర్హత మాజీ ఎమ్మెల్యే గదారి కిషోర్ కు లేదని, తాను ఇష్టానుసారం మాట్లాడితే చూస్తూ ఊరుకోమని, రామన్నపేట మండల కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు గాదె శోభారాణి హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమంలో మంత్రి పదవిని సైతం లెక్కచేయకుండా రాజీనామా చేసిన ఉద్యమ నాయకుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి అని అన్నారు. అలాంటి నాయకునిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు అన్నారు. కిషోర్ మాట్లాడే అసభ్యకరమైన భాషను మార్చుకోవాలని, మరోసారి ఇలాంటి భాషను మాట్లాడితే కాంగ్రెస్ కార్యకర్తలుగా చూస్తూ ఊరుకోబోమని, తగిన విధంగా బుద్ధిచెబుతామన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి అభివృద్ధి చేయకుండా, ఇసుక మాఫియా, దొంగ నోట్ల వ్యవహారం వంటి అవినీతికి పాల్పడిన నీవు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, జిల్లాలో జరుగుతున్న అభివృద్ధిని జీర్ణించుకోలేక అసత్య ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ తక్షణమే సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి వెంకట్ రెడ్డికి క్షమాపణలు చెప్పాలని శుక్రవారం ఆమె డిమాండ్ చేశారు.

## ధాన్యం కొనుగోళ్ళు వేగవంతం చేయాలి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వడ్లు పడితేనే నాణ్యమైన గ్రేడ్ గా పరిగణిస్తామనే నిబంధనతో రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని, వడ్లు పట్టే నిబంధన ఎత్తివేయాలని, ధాన్యం కొనుగోళ్ళు వేగవంతం చేసి రైతులకు న్యాయం చేయాలని, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రామన్నపేట మండల కేంద్రంలో రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ లాల్ బహదూర్ కు వినతి పత్రం అందించి, అనంతరం మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వడ్లు పట్టాలనే నిబంధనతో కూలీలు దొరక్క జేసీబీ, ఫ్యాన్ కిరాయితో అదనపు ఆర్థిక భారం మోయాల్సి వస్తుందన్నారు. ఇతర జిల్లాల్లో లేని నిబంధన యాదాద్రి భువనగిరి జిల్లాలో పెట్టడం సరికాదని అన్నారు. వడ్లు పట్టాలనే నిబంధన పెట్టడంతో తక్కువ ధరకు ఇప్పటికే రైతులు దళారులకు అమ్ముకొని నష్టపోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా మండలంలో ధాన్యం కొనుగోళ్ళు వేగవంతం చేసి, లారీల కొరతను నివారించాలని, ప్రతి బస్తాకు 750గ్రా. బస్తా తూకం జోకాలని, నిబంధనలను తుంగలో తొక్కి ఒకటి నుండి రెండు కేజీల వరకు అదనంగా జోకడం మూలంగా ప్రతి క్వింటాల్ కు మూడు కేజీల వరకు రైతులు నష్టపోవాల్సి వస్తుందని, ఇది రైతులను దోపిడీ చేయడమేనని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం దీనిపై దృష్టి కేంద్రీకరించి చర్య తీసుకోవాలని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు గన్నబోయిన విజయభాస్కర్, మండల నాయకులు బల్గూరి అంజయ్య, గాదె నరేందర్, అంబటి సురేందర్ రెడ్డి, నాగటి ఉపేందర్, దోమలపల్లి నరసింహ, ఏళ్ల అనుగ్రహ రెడ్డి, వల్లమళ్ల రమేష్, ఎర్ర రవీందర్, నరసింహ పాల్గొన్నారు.

## సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ తరలిస్తే ఊరుకోం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ 1975 ప్రాంతంలో ఏర్పడింది. నేటికి 50 సంవత్సరాలు గడుస్తున్నా, ఆదాయం లేదు అన్న సాకుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మోత్కూర్ సబ్-రిజిస్ట్రార్ ఆఫీసును, రామన్నపేట సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్ ను ఇతర ప్రాంతాలకు తరలిస్తాం అనడం వారి చేతకానితనానికి నిదర్శనమని బీఆర్ఎస్ మండల నాయకులు, రైతు సమన్వయ సమితి మాజీ మండలాధ్యక్షులు బొక్క మాధవరెడ్డి అన్నారు. రామన్నపేట సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్ రెండు మండలాలు 61 గ్రామ పంచాయతీలతో కలిగి ఉన్నదని, కొంతమంది నాయకులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం ఇక్కడ నుండి తరలిస్తా అంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. పక్కనే ఉన్న చిట్యాల మండలాన్ని సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ పరిధిలో కలిపి యధాతథంగా కొనసాగించాలని, అప్పుడు ఈ ప్రాంతం ఇంకా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని బొక్క మాధవరెడ్డి తెలిపారు.

# రక్తదానం మహా దానం

- అది ఒక సామాజిక బాధ్యత
- జిల్లా ఎస్పీ కే నారాయణ రెడ్డి



**విశ్వంభర, వికారాబాద్:** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి ఆధ్వర్యం లో శుక్రవారం జిల్లా శిక్షణా కేంద్రం లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రక్తదాన కార్యక్రమంలో పోలీసులతో పాటు జిల్లాలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన యువకులు, శిక్షణ పోలీస్ కానిస్టేబుల్ లు తదితరులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అమరవీరులు సమాజం కోసం, దేశం కోసం, రేపటి తరాల మంచి భవిష్యత్తు కోసం సంఘ విద్రోహశక్తులతో పోరాడి ప్రాణత్యాగాలు చేశారన్నారు. వారి త్యాగాలను వెలకట్టలేనివని కొనియాడారు. అమరుల త్యాగ ఫలంగానే ఈరోజు దేశం, రాష్ట్ర ప్రజలందరూ శాంతియుతంగా, ప్రశాంతంగా ఉన్నారన్నారు. రక్త దానం చేయడం అనేది ఒక సామాజిక సేవా కార్యక్రమం అని, ఆపదలో ఉన్న వారి ప్రాణాలు రక్షించడానికి ఎంతో ఉపయోగపడుతుందని ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసి వారిపాలిట దేవుళ్ళుగా మారతారు అన్నారు. రక్తదానం మహాదానమని, రక్తదానంపై అపోహలు వద్దన్నారు. అనంతరం రక్తదానం చేసిన పోలీసులను, యువకులను, విద్యార్థులను జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి ప్రిన్సిపల్ పీవీ మురళీధర్, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఇన్స్పెక్టర్ లు, సర్కిల్ ఇన్స్పెక్టర్ లు, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ సాయి చౌదరి, వైస్ ఛైర్మన్ డా. సత్యనారాయణ గౌడ్, ట్రెజరీయర్ జీడీ నాయుడు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, యువకులు, విద్యార్థులు, పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది, శిక్షణ పోలీస్ కానిస్టేబుల్ లు పాల్గొన్నారు.

# ఫలక్‌నుమ రైల్వే స్టేషన్ ముందు డీవైఎఫ్ఐ నిరసన

## డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్



**విశ్వంభర, హైదరాబాద్:** డీవైఎఫ్ఐ హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫలక్ నుమ రైల్వే స్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులకు రైల్వే బోర్డు మళ్లీ ఉద్యోగాలు ఇవ్వనుందని, రైల్వేలలో సిబ్బంది కొరత పెద్ద సమస్యగా మారడంతో ఈ నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. దేశ వ్యాప్తంగా వివిధ జోన్లలో 25 వేల ఖాళీల భర్తీకి రిక్రూట్మెంట్ డ్రైవ్ ప్రారంభించిందని, 65 ఏళ్ల లోపు వయసు గల రైల్వే రిటైర్డ్ ఉద్యోగులను సూపర్వైజర్లు, ట్రాక్మెన్లుగా తాత్కాలికంగా విధు ల్లోకి తీసుకోనున్నదని అన్నారు. తమ సర్వీసులో చివరిసారి తీసుకున్న జీతం ఇవ్వడంతో పాటు ట్రావెల్ అలవెన్సు, అధికారిక టూర్లు వంటి ప్రయోజనాలు ఉంటాయని, అయితే జీతంలో పెరుగుదల లేదా ఇతర అదనపు ప్రయోజ నాలు ఉండవని అన్నారు. పదవీకాలం రెండేళ్ల పాటు ఉంటుందని, అవసరాన్ని బట్టి పదవీకాలాన్ని పొడిగించే అవకాశముంటుందని, రైల్వే ప్రమాదాలు, ఉద్యోగు లపై పని ఒత్తిడి పెరగడంతో సమస్య పరిష్కారానికి త్వరితగతిన రిటైర్డ్ ఉద్యోగులను తీసుకోవాలని నిర్ణయించారని తెలిపారు. ఇప్పటికే కేంద్ర రంగ సంస్థలు బీఎస్ఎన్ఎల్, రైల్వే, ఎల్ఐసీ బొగ్గు గనులు అనేక రంగాలు ప్రవేటీకరణ చేస్తుంది అని తెలిపారు.

### రైల్వే బోర్డులో ఖాళీ

పోస్టులను రిటైర్మెంట్ అయిన వారితో కాంట్రాక్టు పద్ధతిలో నియమించడం సిగ్గుచేటని, ఎందరో యువకులు డిగ్రీలు, ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు, బ్రతుకుదెరువు లేక ఖాళీగా ఉన్నారని ఉపాధిలేక జీవితాన్ని వెళ్లదీస్తున్నారని అలాంటి నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చి వారిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి కృష్ణ నాయక్, డీవైఎఫ్ఐ స్థానిక నాయకులు శ్రీను, మహేష్, భరత్, మురారి, గోపాల్, సురేష్, పాల్గొన్నారు.


## ముగిసిన జిల్లా స్థాయి క్రీడల పోటీలు



**విశ్వంభర, కల్వకుర్తి:** కల్వకుర్తి పట్టణంలోని మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయం లో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా స్థాయి 17 ఏళ్ల లోపు బాలికల క్రీడల పోటీలు ఘనంగా ముగిసాయి. 23 నుండి జరుగుతున్న క్రీడల్లో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా వివిధ జోన్ల వారీగా 2024- 25 సంవత్సరానికి గాను కబడ్డీ, ఖో-ఖో క్రీడల్లో క్రీడాకారులు పోటీపడ్డారు. శుక్రవారం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని క్రీడలు మానసిక, శారీరక దృఢత్వానికి మేలు చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పీసీబీ మెంబర్ ఠాగూర్ బాలాజీ సింగ్, ఆర్ సీ ఓ వెంకట్ రెడ్డి, సీఐ నాగార్జున, ప్రిన్సిపాల్ నాగమణి, సురేందర్ రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భూసేకరణను వెంటనే నిలిపివేయాలి

## సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం



**విశ్వంభర, పఠాన్ చెరు:** సంగారెడ్డి జిల్లా పఠాన్ చెరు నియోజకవర్గం పెద్ద కంజర్ల గ్రామంలోని సర్వేనెంబర్ 120, 121, 125 లలో గ్రామ రైతుల నుండి రాష్ట్ర ప్రభుత్వం సేకరిస్తున్న బలవంతపు భూసేకరణ కార్యక్రమాన్ని వెంటనే ఆపాలని సీపీఎం పటాన్ చేరు ఏరియా కమిటీ సంబంధిత అధికారులను డిమాండ్ చేసింది. శుక్రవారం సీపీఎం పటాన్ చేరు మండల కమిటీ ఆధ్వర్యంలో పెద్ద కంజర్ల గ్రామ రైతులతో కలిసి పటాన్ చేరు తాసిల్దార్ కార్యాలయం ప్రాంగణంలో ధర్నా చేసి తాహసిల్దార్ రంగారావు కు మెమోరండం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శి బి నాగేశ్వరరావు మాట్లాడుతూ పెద్దకంజర్ల గ్రామంలోని సర్వే నెంబర్లు 120, 121, 125 లలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ రైతుల నుండి దాదాపు 20 ఎకరాలను గత రాష్ట్ర ప్రభుత్వం టౌన్ షిప్ లా అభివృద్ధి పేరుతో భూసేకరణకు పూనుకున్నదని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల భూములకు ఒక ఎకరాకు 15 లక్షల 75 వేల రూపాయల చొప్పున ప్రకటించిందని. దాదాపు 100 మంది రైతులకు నష్టపరిహారం అందలేదని, గ్రామంలో గ్రామ సభ నిర్వహించకుండా రైతులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం బలవంతపు భూసేకరణ కార్యక్రమాన్ని చేపట్టిందని ఆరోపించారు. ప్రస్తుతం హెచ్ఎండీఏ అధికారులు వచ్చి రైతులకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా బలవంతపు భూసేకరణ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతున్నదని, హెచ్ఎండీఏ వారి చర్యల వలన గ్రామ రైతులు తమ విలువైన భూములను కోల్పోయే ప్రమాదం ఉందని గ్రామ రైతులకు నష్టపరిహారం ఇచ్చేంతవరకు ఇలాంటి భూసేకరణ కార్యక్రమాన్ని చేపట్ట వద్దని డిమాండ్ చేశారు. భూసేకరణ కార్యక్రమం చేపట్టిన యెడల పెద్ద కంజర్ల గ్రామ రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని సీపీఎం ఏరియా కమిటీ కార్యదర్శి పి నాగేశ్వరరావు హెచ్చరించారు. గతంలో ఈ సమస్య పరిష్కారం కోసం స్థానిక తాహసిల్దార్, జిల్లా కలెక్టర్, మంత్రులకు విన్నవించడం జరిగిందని అన్నారు. సంవత్సరం గడుస్తా ఉన్న గ్రామ రైతులకు ఎందుకు నష్టపరిహారం చెల్లించడం లేదని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. వందమంది రైతుల్లో పొజిషన్ లో ఉండి పట్టాదారు పాసు పుస్తకాలు కలిగి ఉన్నారని ఇలాంటి నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎందుకు నష్టపరిహారం చెల్లించడం లేదని ఆయన మండిపడ్డారు. గ్రామ రైతులకు 2013 చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, లేదా భూమికి భూమి ఇవ్వాలని, ప్రతి కుటుంబానికి 300 గజాల ఇళ్ల స్థలాలను కేటాయించాలని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని మాజీ ఎంపీటీసీ సభ్యులు వీరగళ్ల జంగయ్య, ముత్యాలు, నర్సింలు, దుర్గయ్య, నాగేష్ నాగభూషణం, గ్రామ రైతులు, పెద్దలు పాల్గొన్నారు.

# ఎన్సీపీలో చేరిన బాబా సిద్ధిఖీ తనయుడు జిశాన్

**ముంబయి:** మహారాష్ట్ర ఎన్సీపీ పవార్ వర్గం నేత బాబా సిద్ధిఖీ కుమారుడు జిశాన్ సిద్ధిఖీ కూడా ఎన్సీపీ కండువా కప్పుకున్నారు. కాంగ్రెస్‌లో టికెట్ దక్కకపోవడంతో అతడు అజిత్ పవార్ వర్గంలో చేరినట్లుగా సమాచారం. ఎన్సీపీ తరపున బాంద్రా ఈస్ట్ నుంచి జిశాన్‌ను బరిలో దింపుతున్నట్లుగా పార్టీ వెల్లడించింది. గతంలో జిశాన్ కాంగ్రెస్ టికెట్‌పై వంద్రే ఈస్ట్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. లెజిస్లేటివ్ కౌన్సిల్ ఎన్నికలో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలతో పార్టీ ఆయన్ను బహిష్కరించింది. దీంతో ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి అతడికి టికెట్ దక్కలేదు. ఎన్సీపీ పవార్ వర్గం నేత, జిశాన్ తండ్రి బాబా సిద్ధిఖీ కొద్దిరోజుల క్రితమే లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ చేతిలో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఆయన ఎన్సీపీలో చేరడంతో ప్రాధాన్యం సంతరించుకుంది.

పార్టీలో చేరిన అనంతరం జిశాన్ మాట్లాడుతూ "నాకు, నా కుటుంబానికి ఇది ఎంతో ముఖ్యమైన రోజు. మేము కష్టంలో ఉన్నప్పుడు మావెంట ఉండి ధైర్యం చెప్పిన అజిత్ పవార్, ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కరేలకు కృతజ్ఞతలు. బాంద్రా నుంచి ఎన్నికల బరిలో దిగుతున్నాను. ఇక్కడి ప్రజల ప్రేమ, మద్దతుతో మళ్లీ గెలుస్తానని నమ్ముతున్నాను" అని అన్నారు. బాబా సిద్ధిఖీ 1999, 2004, 2009లో బాంద్రా వెస్ట్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2004, 2009లో రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. దాదాపు ఐదు దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీలో ఉన్న సిద్ధిఖీ కొన్ని నెలల కిందట ఎన్సీపీలో చేరారు. ప్రజా సేవ చేయడం తో పాటు..గ్రాండ్‌గా పార్టీలునిర్వహిస్తుంటారని ఆయనకు పేరుంది.



### అభ్యర్థుల రెండో జాబితా విడుదల చేసిన ఎన్సీపీ..

మహారాష్ట్ర ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎన్సీపీ పవార్ వర్గం అభ్యర్థుల రెండో జాబితాను ప్రకటించింది. ఇందులోను బాబా సిద్ధిఖీ కుమారుడు జిశాన్‌కు బాంద్రా స్థానం నుంచి టికెట్ కేటాయించినట్లుగా ప్రకటించింది. ఇటీవల ఈ పార్టీ మొదటి జాబితాను విడుదల చేసిన విషయం తెలిసిందే. పార్టీ అధినేత అజిత్ పవార్ అతడి కుటుంబానికి కంచుకోట అయిన బారామతి స్థానం నుంచి పోటీ చేయనున్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు నవంబర్ 20న ఒకే దశలో పోలింగ్ జరగనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. నవంబర్ 23న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు వెల్లడించింది. అయితే శివసేన, ఎన్సీపీ చీలిక తర్వాత జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలు కావడంతో మహారాష్ట్ర ఎన్నికలపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

## గాలి నాణ్యత బాగా లేదు.. ఎక్కువగా బయట తిరగొద్దు: కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ



**ఢిల్లీ:** దేశ రాజధానితో సహా వివిధ ప్రాంతాల్లో వాయు కాలుష్యం తీవ్రతరం అవుతోంది. ఈక్రమంలో శీతాకాలం, పండుగలు సమీపిస్తుండడంతో వివిధ రాష్ట్రాల్లోని వైద్యారోగ్య శాఖలకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ పలు హెచ్చరికలు జారీ చేసింది. బహిరంగ ప్రదేశాల్లో ఉదయపు నడక, క్రీడలు వంటి వాటికి దూరంగా ఉండాలని పేర్కొంది. 'వాయు కాలుష్యం తీవ్రతరమై అనారోగ్య పరిస్థితులకు దారితీస్తోంది. కాబట్టి బహిరంగ ప్రదేశాల్లో క్రీడలు ఆడటం, ఉదయపు నడకకు వెళ్లడం వంటివి పరిమితం చేయాలి. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, పిల్లలు, వృద్ధులు, ట్రాఫిక్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి. ఈ ఆందోళనల దృష్ట్యా 'వాతావరణ మార్పు- మానవులపై ప్రభావం' జాతీయ కార్యక్రమాన్ని చేపట్టి ప్రజలకు అవగాహన కలిగించాలి. వాయు కాలుష్య సంబంధిత వ్యాధులను ట్రాక్ చేసే నిఘా వ్యవస్థలతో భాగ స్వామ్యాన్ని పెంచాలి. పంట వ్యర్థాలను కాల్చడం, పండగ సమయంలో బాణాసంచా వినియోగం, వ్యక్తిగత వాహనాలపై ప్రయాణించడం, డీజిల్ ఆధారిత జనరేటర్లపై ఆధారపడటం వంటివి తగ్గించడం అతి ముఖ్యమైన చర్యలు. వ్యక్తులు ప్రభుత్వ యాప్ ద్వారా గాలి నాణ్యతను పర్యవేక్షించాలి. ఇప్పటికే శ్వాసకోశ, హృదయ సంబంధ సమస్యలతో బాధపడుతున్నవారు కాలుష్యం ఎక్కువగా ఉండే సమయాల్లో బహిరంగ కార్యకలాపాలను తగ్గించాలి' అని ఆరోగ్యమంత్రిత్వ శాఖ పేర్కొంది.

## లారెన్స్ బిష్ణోయ్ సోదరుడి సమాచారమిస్తే..రూ.10 లక్షల రివార్డు




**ముంబయి:** బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్‌పై బెదిరింపులు, మహారాష్ట్ర రాజకీయ నేత బాబా సిద్ధిఖీ హత్య వంటి కారణాలతో దేశవ్యాప్తంగా లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పేరు మారుమోగుతోంది. ఈ తరుణంలో లారెన్స్ సోదరుడు అన్మోల్ బిష్ణోయ్ పై జాతీయ దర్యాప్తు సంస్థ రూ.10 లక్షల రివార్డు ప్రకటించింది. 2022లో నమోదైన రెండు కేసుల్లో అతడు అభియోగాలు ఎదుర్కొంటున్నాడు. అంతేగాకుండా సిద్ధిఖీ హత్య కు ముందు సైతం షూటర్లతో అన్మోల్ చాటింగ్ చేసినట్లు ముంబయి పోలీసులు వెల్లడించారు. ఈక్రమంలో అతడి గురించి సమాచారం ఇచ్చినవారికి ఈ రివార్డు ఇస్తామని ఎన్ఐఏ తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్ 14న సల్మాన్‌ఖాన్ ఇంటివద్ద కాల్పుల ఘటన చోటుచేసుకుంది. దానికి బాధ్యత వహిస్తూ అన్మోల్ సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టాడు. ఆ కేసు విచారణలో భాగంగా ముంబయి పోలీసులు అతడిపై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. అలాగే 2022లో ప్రముఖ పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా దారుణహత్యకు గురైన విషయం తెలిసిందే. ఆ కేసులో కూడా అభియోగాలు ఎదుర్కొంటున్నాడు. అతడిపై సుమారు 18 కేసులున్నాయి. భాను పేరుతో చెలామణి అవుతున్న అన్మోల్ నకిలీ పాస్‌పోర్టు ఉపయోగించి దేశం విడిచిపారిపోయాడు. ఆ తర్వాత గత ఏడాది కెన్యా, ఈ ఏడాది కెనడాలో దర్శనమిచ్చాడు. ఇదిలాఉంటే.. కొన్నిరోజుల క్రితం బాబా సిద్ధిఖీ ముంబయిలోని బాంద్రాలో తన కుమారుడి కార్యాలయంలో ఉండగా.. పలువురు దుండగులు అతడిపై కాల్పులకు పాల్పడ్డారు. వెంటనే ఆయన్ను లీలావతి ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ హత్య చేసింది తామేనని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటిం చింది. సిద్ధిఖీకి ముంబయి బాంబు పేలుళ్ల సూత్రధారి, భారత మోస్ట్‌వాంటెడ్ దావూద్ ఇబ్రహీం తో సంబంధాలు ఉండటం, తమ టార్గెట్ అయిన బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్‌కు అతడు స్నేహితుడు అవడం వంటి కారణాల వల్లే అతడిని హత్య చేశామని పేర్కొంది. ఈ కేసులో అన్మోల్ స్నాప్‌చాట్ వేదికగా నిందితులతో నేరుగా టచ్‌లో ఉన్నాడని పోలీసులు తెలిపారు. వారికి సిద్ధిఖీ కుమారుడు జిశాన్ సిద్ధిఖీ ఫొటోను కూడా షేర్ చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే జిశాన్ కూడా బిష్ణోయ్ గ్యాంగ్ హిట్‌లిస్ట్‌లో ఉన్నట్లు పోలీసువర్గాలు వెల్లడించిన సంగతి తెలిసిందే.


## ట్రూడో సన్నిహిత బృందంలో ఖలిస్థానీ ఉగ్రవాదులు

### హైకమిషనర్ సంజయ్‌వర్మ తీవ్ర ఆరోపణలు



**కెనడా:** కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో సన్నిహిత బృందంలో ఖలిస్థానీ ఉగ్రవాదులు, భారత వ్యతిరేకులు ఉన్నారని అక్కడ హైకమిషనర్‌గా వ్యవహరించిన సీనియర్ దౌత్యాధికారి సంజయ్‌వర్మ ఆరోపించారు. రాజకీయకారణాలతో వారికి ట్రూడో ప్రభుత్వం రక్షణ కల్పిస్తోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈమేరకు ఆయన ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. "ట్రూడో స్నేహితుల్లో భారత వ్యతిరేక శక్తులు, ఖలిస్థానీ ఉగ్రవాదులు ఉన్నారు. అలాంటి బృందం ఆయనకు ఉంది. 2018లో ఆయన భారత్ పర్యటనకువచ్చినప్పుడు.. ఏం జరిగిందో మనకు తెలుసు. ఖలిస్థానీపై సానుభూతి ఉన్న వారు ఆయన చుట్టూ ఉన్నారు" అని తెలిపారు. 2018 ఫిబ్రవరిలో ట్రూడో కుటుంబం ఎనిమిది రోజులపాటు భారత్‌లో పర్యటించింది. అప్పట్లో ఆయన గౌరవార్థం కెనడా హైకమిషన్ ఇచ్చిన విందుకు మాజీ ఖలిస్థానీ ఉగ్రవాదిజస్పాల్ అత్వాల్‌ను ఆహ్వా నించారు. ఇది ట్రూడోను దౌత్య పరమైన చిక్కుల్లోకి నెట్టింది. ఈ ఘటనల కారణంగా భారత్ ప్రభుత్వం అప్పట్లో ఆయ న పర్యటనకు అంతగా ప్రాధాన్యం ఇవ్వలేదు. దీంతో అధికారిక కార్యక్రమాలు తక్కువగా జరిగాయి. పర్యటక ప్రాంతాల సందర్శన కోసం ట్రూడో భారత్‌కు వెళ్లి నట్లుందని స్వదేశంలో విమర్శలను ఎదుర్కొన్నారు. "ఖలిస్థానీ గూండాలు నాకు హాని తలపెట్టడానికి ప్రయత్నించారు. నేను ఒక కార్యక్రమంలో భాగంగా ఆల్‌బర్టా వెళ్లాను. నేను వెళ్లాల్సిన మార్గం వద్ద అప్పటికే వారు కాపుకాచారు. వారి కత్తి నాకు అతిదగ్గరగా దూసుకొచ్చింది. అప్పుడు నేను భార్యతో ఉన్నాను" అని సంజయ్ వెల్లడించారు. "అక్కడ ఉన్న స్థానిక పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ కేసులో దర్యాప్తు జరిపారు. కానీ దర్యాప్తు విషయాలు మాత్రం నాకు వెల్లడించలేదు" అని పేర్కొన్నారు. ఒక్కసారిగా మాకు ఆ విషయం చెప్పారు.."కెనడాలోహైకమిషనర్‌గా నాకు ప్రతిఒక్కరితోనూ సత్సంబంధాలు ఉన్నాయి. అక్టోబర్ 12న ఆకస్మిక పరిణామం చోటుచేసుకొంది. నాతోపాటు ఆరుగురు దౌత్యవేత్తలు పోలీసు విచారణలో పాల్గొనాలని కెనడా విదేశాంగ శాఖ వెల్లడించింది" అని తెలిపారు. భారత్‌పై కెనడా ఇటీవల ప్రవర్తించిన తీరు అసహ్యంగా ఉందని, స్నేహపూర్వక ప్రజాస్వామ్యంగా భావించిన దేశం భారత్‌ను వెన్నుపోటు పొడిచిందని, అనైతికంగా ప్రవర్తించిందని ఆయన వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనక భారత్ ఏజెంట్ల హస్తం ఉండొచ్చని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన వ్యాఖ్యలు ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు రాజేసిన విషయం తెలిసిందే. తర్వాత భారత దౌత్యవేత్తలపై కెనడా ప్రభుత్వ చర్యలతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు క్షీణించిన విషయం తెలిసిందే. అందుకే వారిని వెనక్కి పిలిపించామని కేంద్రం ఇప్పటికే వెల్లడించింది.

## 63 శాతం పెరిగిన మైక్రోసాఫ్ట్ సీఈవో వేతనం



**ఢిల్లీ:** కార్పొరేట్ సంస్థల్లో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ (సీఈఓ)లు అత్యంత కీలకం. వ్యూహ రచనలోనూ, ఆదాయం పెంపులోనూ, సిబ్బంది పనితీరు మెరుగు పర్చడంతోపాటు సాధక బాధకాలు తీర్చడంలోనూ సీఈఓలే కీలకం. ఇక ఐటీ, టెక్ సంస్థల సీఈఓలైతే వేరే చెప్పనక్కర్లేదు. సంస్థ పురోగతి సాధించడంలో ఎంతో ముఖ్య భూమిక పోషించే సీఈఓల వేతన భత్యాలు కూడా అదే స్థాయిలో ఉంటాయి. కంపెనీ షేర్లు లాభపడే కొద్దీ వారి జీత భత్యాలు కూడా అదేస్థాయిలో పెరుగుతుంటాయి. తాజాగా మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల వేతనం భారీగా పెరిగింది. 2024 ఆర్థిక సంవత్సరంలో ఆయన వేతనం 79.1 మిలియన్ డాలర్లకు చేరింది. ఇది మన భారత కరెన్సీలో రూ.664 కోట్లతో సమానం. ఈ విషయాన్ని కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్ లో పేర్కొంది. 2023 ఆర్థిక సంవత్సరంలో ఆయన48.5 మిలియన్ డాలర్లు అందుకోగా.. దాంతో పోలిస్తే ఇది 63 శాతం అధికం. జూన్‌లో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో మైక్రోసాఫ్ట్‌వృద్ధిలో దూసుకెళ్లింది. దాంతో కంపెనీ షేర్లు సుమారు 31.2 శాతం లాభపడ్డాయి. ఈ కారణంగా మైక్రోసాఫ్ట్ మార్కెట్ విలువ 3 ట్రిలియన్ డాలర్లను అధిగమించింది. ఫలితంగా, నాదెళ్ల స్టాక్ అవార్డులు 39 మిలియన్ డాలర్ల నుంచి 71 మిలియన్ డాలర్లకు పెరిగాయి. ఇక సంస్థకు ఆయన అందించిన సేవలకు గానూ సత్య నాదెళ్లకు 5.2 మిలియన్ డాలర్లు నగదు ప్రోత్సాహకం అందనున్నట్లు కంపెనీ ఫైలింగ్‌లో తెలిపింది. అయితే ఆయనకు రావాల్సిన 10.7 మిలియన్ డాలర్ల కంటే ఇది తక్కువ. ఈ ఆర్థిక సంవత్సరంలో అనేక సైబర్ సెక్యూరిటీ ఉల్లంఘనల కారణంగా ప్రోత్సాహకం తగ్గినట్లు తెలుస్తోంది. మైక్రోసాఫ్ట్ సీఈఓగా గత పదేళ్ల కాలంలో సత్య నాదెళ్ల వినూత్న ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టారు. అనేక విషయాల్లో కీలక పాత్ర పోషించారు. 1975లో ప్రారంభించిన మైక్రోసాఫ్ట్‌లో నాదెళ్ల సీఈవోగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మైక్రోసాఫ్ట్‌లో కీలక మార్పులు జరిగాయి. క్లౌడ్ కంప్యూటింగ్, మొబైల్ అప్లికేషన్స్, కృత్రిమ మేధస్సు వంటి అంశాలపైనే ప్రధానంగా మైక్రోసాఫ్ట్ కేంద్రీకరించింది. దీంతో మైక్రోసాఫ్ట్ మార్కెట్ విలువ శరవేగంగా పెరిగింది. అసాధారణ రీతిలో కోవిడ్-19 ప్రభావం చూపినా నాదెళ్ల హయాంలో మైక్రోసాఫ్ట్ మంచి ఫలితాలు సాధించింది.

## జర్మనీ వీసాలు 20వేలు నుంచి 90 వేలకు పెంపు



**ఢిల్లీ:** నైపుణ్యం కలిగిన భారత శ్రామిక శక్తి కోసం వీసాల సంఖ్యను పెంచేందుకు జర్మనీ నిర్ణయించింది. ఈ సంఖ్యను 20వేల నుంచి 90వేలకు పెంచిందని ప్రధాని మోదీ తాజాగా వెల్లడించారు. 18వ ఆసియా ఫసిఫిక్ కాన్ఫరెన్స్ ఆఫ్ జర్మన్ బిజినెస్‌లో ప్రధాని మాట్లాడుతూ.. రాబోయే 25ఏళ్లకు వికసిత్ భారత్ కోసం రోడ్‌మ్యాప్ రూపొందించామని ఈ సందర్భంగా తెలిపారు. "ఫోకస్ ఆన్ ఇండియా పేరిట జర్మనీ క్యాబినెట్ ఒక పత్రాన్ని విడుదల చేయడం ఆనందంగా ఉంది. నైపుణ్యం కలిగిన భారతీయ ఉద్యోగులకు వీసాల సంఖ్యను 20 వేల నుంచి 90 వేలకు పెంచాలని జర్మనీ నిర్ణయించింది. భారత శ్రామిక శక్తిపై జర్మనీ ఉంచిన విశ్వాసం అద్భుతం. ఈ నిర్ణయం ఆ దేశ వృద్ధికి దోహదం చేస్తుంది. భారత్ తయారీ కేంద్రంగా మారింది. భారత్, జర్మనీ భాగస్వామ్యం కేవలం లావాదేవీలకే పరిమితం కాదు.. రెండూ బలమైన ప్రజాస్వామిక పరివర్తన భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయి. ప్రపంచం ఉద్రిక్తతలు, సంఘర్షణ, అనిశ్చితితో ఉన్న సమయంలో ఇరు దేశాల వ్యూహాత్మక బంధం బలోపేతమవుతోంది. యుద్ధం సమస్యలను పరిష్కరించలేదు.. శాంతి కోసం సాధ్యమైనంత సహకారం అందించేందుకు భారత్ సిద్ధంగానే ఉంటుంది" ప్రధాని మోదీ అన్నారు. మూడురోజుల పర్యటనలో భాగంగా గురువారం జర్మనీ ఛాన్సలర్ ఒలాఫ్ షోల్జ్ భారత్‌కు వచ్చారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో సమావేశం నిర్వహించుకుంటున్నామని వ్యాఖ్యానించారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థిక వ్యవస్థ అని కొనియాడారు.

## బిన్‌లాడెన్ అడ్డాలో పాక్ మెగా టెర్రర్ ఫ్యాక్టరీ..!



ఢిల్లీ: ప్రపంచం ఆశ్చర్యపోయే రీతిలో పాకిస్థాన్ ఓ మెగా టెర్రర్ ఫ్యాక్టరీని అబోటాబాద్‌లో నడుపుతోంది. ఈవిషయాన్ని భారత ఇంటెలిజెన్స్ వర్గాలు పసిగట్టాయి. ఈ ఉగ్ర క్యాంప్‌ను ఏకంగా సైన్యంలోని కీలక జనరల్ పర్యవేక్షిస్తున్నట్లు తెలుస్తోంది. ఈవిషయాన్ని ఆంగ్లపత్రిక ఎన్డీటీవీ కథనంలో పేర్కొంది. నిషేధిత ఉగ్ర సంస్థలు లష్కరే తోయిబా, జైషే మహమ్మద్, హిజ్బుల్ ముజాహిద్దీన్లు ఏకంగా పాక్ సైనిక స్థావరం పక్కనే సంయుక్తంగా ఓ మెగా టెర్రర్ క్యాంప్‌ను ఏర్పాటుచేశాయి. ఇందులోకి అనుమతి లేకుండా బయటి వ్యక్తులు అడుగుపెట్టడం అసాధ్యం. పాక్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీకి చెందిన ఓ గుర్తుతెలియని జనరల్ దీనిని పర్యవేక్షిస్తున్నారు. ఇక్కడ యువకులు, యువతులకు ఆయుధ వినియోగం, ఇతర ఉగ్ర కార్యకలాపాల్లోను శిక్షణ ఇస్తున్నారు. గతంలో అబోటాబాద్‌లోని ఓ సేఫ్ హౌస్‌లోనే అల్‌ఖైదా ఉగ్ర సంస్థ నాయకుడు దాక్కొన్నాడు. 2011 మే నెలలో అమెరికా కమాండోలు రహస్యంగా హెలికాప్టర్లలో ఇక్కడికి వచ్చి లాడెన్‌ను మట్టుబెట్టడంతో ప్రపంచం మొత్తం అవాక్కైంది. ఆ తర్వాత పాక్ ఆ ఇంటిని పూర్తిగా ధ్వంసం చేసింది. అదే స్థలంలో ఇప్పుడు అక్కడి సైన్యం కొత్తగా ఉగ్రవాద శిక్షణ శిబిరాన్ని ఏర్పాటుచేసినట్లు అనుమానిస్తున్నారు. ఈ ప్రదేశంపై మరింత స్పష్టత రావాల్సిఉంది. టెర్రర్ చీఫ్‌లు హఫీజ్ సయీద్, మసూద్ అజర్, సయ్యద్ సలాహుద్దీన్‌లు ఈ క్యాంప్‌ను సందర్శించినట్లు తెలుస్తోంది. ఇది పాకిస్థాన్‌లోనే అతిపెద్ద టెర్రర్ క్యాంప్‌గా ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. లష్కరే, జైషే, హిజ్బుల్ సంస్థలు ఇక్కడే నియామకాలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. కొన్నాళ్లుగా జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడులు తీవ్రం కావడంతో అబోటాబాద్‌లో ఉగ్రశిబిరం అంశం వెలుగులోకి రావడం గమనార్హం.

## సీఆర్పీఎఫ్ స్కూళ్లను మూసివేయండి

### భారత్‌కు ఉగ్రవాది పన్నూ హెచ్చరిక



**ఢిల్లీ:** భారత్‌లోని సీఆర్పీఎఫ్ పాఠశాలలను మూసివేయాలని అమెరికాలోని ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూ హెచ్చరికలు జారీ చేశాడు. అంతేకాదు.. కేంద్ర హోంశాఖ మంత్రి సమాచారం ఇచ్చినవారికి బహుమతి ప్రకటించాడు. ఈమేరకు అతడు ఓ ప్రకటనను విడుదల చేశాడు. ఒకప్పటి సీఆర్పీఎఫ్ అధికారి, పంజాబ్ మాజీ డీజీపీ కేపీఎస్ గిల్, మాజీ రా అధికారి వికాస్ యాదవ్‌లు తమ హక్కుల హననానికి పాల్పడ్డారని పన్నూ ఆరోపించాడు. పంజాబ్, విదేశాల్లోని సిక్కులపై దాడులు చేశారన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు సీఆర్పీఎఫ్ పాఠశాలలను బహిష్కరించాలన్నారు. స్వర్ణ దేవాలయంపై దాడి, 1984లో సిక్కుల ఊచకోతకు మనుషులను సమకూర్చడం వంటివి సీఆర్పీఎఫ్ చేసిందని ఆరోపించాడు.

"భారత సీఆర్పీఎఫ్‌కు హోం మంత్రి అమిత్‌షా నాయకత్వం వహిస్తున్నారు. హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్యకు కిరాయి హంతకులను ఆయనే నియమించారు. న్యూయార్క్‌లో నా హత్యకు కుట్ర పన్నారు" అని ఆరోపణలు చేశాడు. అమిత్‌షా విదేశీ పర్యటనల సమాచారం ముందస్తుగా ఇచ్చినవారికి మిలియన్ డాలర్లు నజరానా ఇస్తానని ప్రకటించాడు.

ఢిల్లీలోని రోహిణి ప్రశాంత్ విహార్ ప్రాంతంలో సీఆర్పీఎఫ్ పాఠశాల వద్ద పేలుడుకు 'జస్టిస్ లీగ్ ఇండియా' అనే ఖలిస్థానీ అనుకూల గ్రూపు బాధ్యతను తీసుకొంది. ఖలిస్థానీ వేర్పాటువాదులను మట్టుబెట్టడానికి ప్రతీకారంగా దుండగులు ఈ చర్యను చేపట్టినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ పేలుడు క్లిప్‌తోపాటు "కొందరు గూండాలతో భారత నిఘా ఏజెన్సీ మా సభ్యుల నోరు మూయించాలని చూస్తే.. ప్రపంచంలో వారే మూరు?లు. మేము వారికి ఎంత దగ్గరగా ఉన్నామో ఏమాత్రం ఊహించలేరు. ఏక్షణమైనా దాడి చేయగల సత్తా మాదగ్గర ఉంది. ఖలిస్థాన్ జిందాబాద్" అనే సందేశాన్ని టెలిగ్రామ్‌లో పోస్టు చేశారు. ఇప్పటికే తెల్ల టీషర్ట్ ధరించిన ఓ అనుమానితుడిని గుర్తించారు. పేలుడు జరగడానికి ముందురోజు రాత్రి ఆ ప్రదేశంలో అతడు ఏదో చేస్తున్నట్లు ఆ దృశ్యాల్లో ఉంది. ఆ తర్వాత దేశంలోని పలు సీఆర్పీఎఫ్ పాఠశాలలకు బెదిరింపులు రావడం మొదలైంది.

# జగన్ ఏదైనా నమ్మించగలడు

## వైఎస్సార్ అభిమానులకు షర్మిల బహిరంగ లేఖ

**విశ్వంభర, అమరావతి:** ఏపీ మాజీ సీఎం జగన్‌పై వైఎస్ షర్మిల మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు వైఎస్సార్ అభిమానులకు 3 పేజీల బహిరంగ లేఖ రాశారు. వైఎస్ అభిమానులకు వాస్తవాలు తెలియజేసే ప్రయత్నంలో భాగంగానే ఈ లేఖ రాసినట్లు పేర్కొన్నారు.“ఈరోజు పొద్దున సాక్షి పేపర్ చూశాను. సాక్షి మీడియా జగన్ మోహన్ రెడ్డి చేతిలో ఉంది. కాబట్టి ఏదైనా నమ్మించగలరు. అయినా వైఎస్సార్ అభిమానులకు అసలు వాస్తవాలు తెలియజేసే ప్రయత్నం నాది. అమ్మ వైఎస్ విజయమ్మ, నాన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి గురించి ఒక పుస్తకం రాశారు. అందులో నాన్న గురించి ప్రత్యేకంగా ఒక మాట రాశారు. ‘రాజశేఖర్ రెడ్డి గారికి లోకం అంతా ఒకెత్తయితే.. తన బిడ్డ షర్మిల ఒకెత్తు అని రాశారు. నాన్నకు నేనంటే ప్రాణం. నాన్న నన్ను ఎప్పుడూ ఆడపిల్ల కదా అని చిన్న చేసో, తక్కువ చేసో చూడలేదు. నాన్న బతికి ఉన్నన్ని రోజులూ ఒకే మాట అనేవారు. ‘నా’ నలుగురు గ్రాండ్ చిల్డ్రన్ నాకు సమానం.



### నలుగురు గ్రాండ్ చిల్డ్రన్‌కూ సమాన వాటా.. అది వైఎస్సార్ మ్యాండేట్

వైఎస్సార్ బతికి ఉండగా స్థాపించిన అన్ని కుటుంబ వ్యాపారాల్లో నలుగురు గ్రాండ్ చిల్డ్రన్‌కూ సమాన వాటా ఉండాలి. రాజశేఖర్ రెడ్డి ఉండగా స్థాపించిన అన్ని వ్యాపారాలు కుటుంబ వ్యాపారాలే. అవి జగన్ మోహన్ రెడ్డి సొంతం కాదు. ఉన్న అన్ని కుటుంబ వ్యాపారాలకు జగన్ ‘గార్డియన్’ మాత్రమే. అన్ని వ్యాపారాలు నలుగురు చిన్న బిడ్డలకు సమానంగా పంచి పెట్టాల్సిన బాధ్యత ఆయనదే. ఇది రాజశేఖర్ రెడ్డి మ్యాండేట్. వైఎస్సార్ ఈ ఉద్దేశం ఆయన బిడ్డలమైన మాకు, ఆయన భార్యకు, కేవీపీ రామచంద్రరావు, వైవీ సుబ్బారెడ్డి, విజయ సాయిరెడ్డి సహా సన్నిహితులందరికీ స్పష్టంగా తెలుసు. నాన్న బతికి ఉండగా స్థాపించిన అన్ని వ్యాపారాల్లో సరస్వతి, భారతి సిమెంట్స్, సాక్షి మీడియా, క్లాసిక్ రియాలిటీ, యలహంక ప్రాపర్టీ, ఇలాంటివి ఏమైనా.. నలుగురు గ్రాండ్ చిల్డ్రన్‌కు సమాన వాటా ఉండాలన్నది వైఎస్ఆర్ మ్యాండేట్.

### జగన్ చెబుతున్నవన్నీ కుటుంబ ఆస్తులే..

ఒక్క సండూర్ మినహా రాజశేఖర్ రెడ్డి బతికున్నంత వరకు ఏ ఒక్క ఆస్తి పంపకం కూడా జరగలేదు. వైఎస్సార్ హఠాత్తుగా మరణించారు. తర్వాత కూడా ఏ ఆస్తి పంపకాలు జరగలేదు. ఈరోజు వరకు నాకు న్యాయంగా రావాల్సిన ఒక్క ఆస్తి కూడా నా చేతుల్లో లేదు. స్వార్జితం అని జగన్ మోహన్ రెడ్డి చెబుతున్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులే. రాజశేఖర్ రెడ్డి బతికి ఉన్నప్పుడే ఆస్తులు పంపిణీ చేశారనేది అవాస్తవం. ఈరోజు సాక్షిలో చూపినట్లుగా మా తాతల ఆస్తి చిన్నప్పుడే నా పేరు మీద పెట్టినంత మాత్రాన, అది నాన్న నాకు పంచిన ఆస్తి కాదు. ఇతరులతో ఒక వ్యాపారంలో చిన్న భాగం నా పేరు మీద పెడితే అది ఆస్తి పంచి ఇచ్చినట్లు కాదు. ఆస్తి పంచడం అంటే ఇవిగో ఈ ఆస్తులు.. నీకు ఇక ఇంతే అని మా నాన్న నాకు చెప్పి ఉంటే అది ఆస్తి పంచేయడమంటే..! నేను జగన్ మోహన్ రెడ్డి ఆస్తుల్లో వాటా అడుగుతున్నాను అనేది హాస్యాస్పదం. ఇవన్నీ కుటుంబ ఆస్తులు కనుక రాజశేఖర్ రెడ్డి నలుగురు చిన్న బిడ్డలకు సమానంగా పంచాలి అనుకున్నారు. కాబట్టే ఈ రోజు వరకు వీటి గురించి మాట్లాడుతున్నాం.

### ఏ స్వార్థం లేకుండా ఆయన పార్టీని భుజాలపై మోశాను..

నాకంటూ వ్యక్తిగతంగా ఈ ఆస్తులపై మోజు లేదు. వీళ్లు పెట్టిన హింసలకు ఈ ఆస్తులు కావాలనే కోరిక కూడా లేదు. కేవలం నా బిడ్డలకు ఈ ఆస్తులు చెందాలి అనేది రాజశేఖర్ రెడ్డి అభిమతం గనుక.. ఈ రోజు వరకు కూడా అమ్మైనా, నేనైనా తపన పడుతున్నాం. ఇప్పటికీ అమ్మ వెయ్యి సార్లు వీళ్లను అడిగి ఉంటుంది. వందల కొద్దీ లేఖలు రాసి ఉంటుంది. అయినా నా బిడ్డలకు చెందాల్సిన ఆస్తిలో ఒక్కటి కూడా ఇవ్వలేదు. రాజశేఖర్ రెడ్డి చనిపోయిన తర్వాత 10 ఏళ్లు జగన్ ఇబ్బందులు పడితే, అవి నా ఇబ్బందులు అనుకొని.. నా శక్తికి మించిన సాయం చేశాను. తోడబుట్టిన వాడికోసం నా బిడ్డలను సైతం పక్కనపెట్టి ఆయన్ను, ఆయన పార్టీని ఏ స్వార్థం లేకుండా నా భుజాల మీద మోశాను. ఆ 10 ఏళ్లు నా అవసరం ఉంది అనుకున్నారో.. ఏమో.. నన్ను బాగానే చూశారు. పెద్ద కూతురు అన్నారు. రాజశేఖర్ రెడ్డి ఊహించినట్లుగానే గ్రాండ్ చిల్డ్రన్ నలుగురు సమానం అన్నట్లుగానే వ్యవహరించారు. ఆ 10 ఏళ్లలో రూ. 200 కోట్లు ఇచ్చామని చెప్తున్నది ఇందులో భాగంగానే. ఆ 10 ఏళ్లు నా బిడ్డలకు సమాన వాటా ఉందని గుర్తిస్తూ.. కంపెనీలోని డివిడెండ్‌లో సగం వాటా నాకు ఇవ్వడమే ఈ రూ. 200 కోట్లు. వాళ్లు చేసింది ఉపకారం కాదు. ప్రేమతో ఇచ్చింది అంతకంటే కాదు. నాకు సమాన వాటా ఉంది కాబట్టి డివిడెండ్‌లో సగం వాటా ఇచ్చారు. అది కూడా అప్పుగా చూపించమన్నారు.

### సీఎం కాగానే జగన్ మారిపోయారు..

సీఎం కాగానే జగన్ గుర్తుపట్టలేనంతగా మారిపోయారు. నాపై చిన్నచూపే కాదు.. సీఎం కాగానే విడిపోదామని ప్రతిపాదించారు. విడిపోవద్దని అమ్మ, నేను చెప్పాం. ఆస్తులు పంచుకుందామని విజయవాడకు రమ్మన్నారు. భారతి సిమెంట్స్, సాక్షిలో ఎక్కువ వాటా కావాలని అడిగారు. 60 శాతం తీసుకుంటా.. 40 శాతం ఇస్తా అని జగన్ ప్రతిపాదించారు. ఆ తర్వాత అరగంటలో ఆస్తుల వాటా తేలిపోయింది. కొద్ది వారాల్లోనే ఎంవోయూ కూడా తయారైంది. నాకు రావాల్సిన వాటా ఇచ్చారు తప్పితే.. ప్రేమాభిమానాలతో కాదు. 2021లో నేను రాజకీయాల్లో అడుగుపెట్టా. జగన్‌కు ఇష్టం లేకుండా వచ్చానని కోపమొచ్చింది. రాజకీయాల్లో నన్ను అణచి వేసేందుకు ఆయన చేయని ప్రయత్నం లేదు. ఆంధ్రాలో కాంగ్రెస్ తరఫున ప్రచారం చేస్తే అవమానించారు. సోషల్ మీడియాలో నాపై వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు. నన్నే కాదు.. వివేకాపైనా సాక్షి మీడియాలో అసభ్యకరంగా ప్రచురించారు. ఎన్నికల్లో ఓటమికి నేనే కారణమని బలంగా నమ్మారు. విరోధం వద్దు.. మాట్లాడుకుందామని బంధువు లను పంపారు. జగన్, భారతి, అవినాష్‌కు వ్యతిరేకంగా మాట్లాడొద్దని షరతు పెట్టారు. బంధువులు ఎంత ఒత్తిడి చేసినా ఆ షరతులకు నేను ఒప్పుకోలేదు. అదే కోపంతో మళ్లీ నాతో పాటు అమ్మపై ఎన్‌సీఎల్‌టీలో కేసు వేశారు. మేం మోసం చేసి షేర్లు తీసుకున్నామని పేర్కొన్నారు.

### తల్లిపై కేసు వేసిన దుర్మార్గుడనే పేరు వస్తుందనే..

ప్రజల్లో అమ్మపై కేసు వేసిన దుర్మార్గుడనే పేరు వస్తుందని మాట మార్చారు. జగన్ బెయిల్ రద్దుకు కుట్ర చేస్తున్నామనే అభియోగం మోపారు. నిజానికి బెయిల్ రద్దు కాదు.. ఎందుకంటే సరస్వతి షేర్స్ అటాచ్ కాలేదు. కంపెనీల్లో ఈడీ అటాచ్ చేసింది షేర్లను కాదు.. రూ.32కోట్ల విలువైన భూములనే. షేర్ల బదిలీకి, ఆయన బెయిల్ రద్దుకు ఎలాంటి సంబంధం లేదు. సొంత తల్లిని కోర్టుకు ఈడ్చడం.. ఆ తల్లికి ఎంత అవమానం? అమ్మను బాధపెట్టొద్దని.. అన్యాయంగా మాపై కేసు వేసిన సంగతి బయటపెట్టలేదు. కానీ కేసు వేసిన నెల రోజులకు ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీని వెనుక జగన్ కారణమని ఎందుకు అనుకోకూడదు? నేను జగన్‌కు లేఖ రాస్తే.. అది తెదేపా సోషల్ మీడియా ఖాతాలో పోస్టయితే నాకేంటి సంబంధం? నేను కానీ..నా మనుషులు కానీ బయటపెట్టలేదని బైబిల్‌పై ప్రమాణం చేస్తా. చంద్రబాబు చేతిలో బాణం కావాల్సిన అవసరం వైఎస్సార్ బిడ్డకు లేదు. జగన్ ఎవరి కొంగు చాటున ఉండి ఇదంతా చేస్తున్నారో అందరికీ తెలుసు. ఆస్తి, అధికారం కోసం ఇదంతా చేస్తున్నారని ప్రజలంతా గమనిస్తున్నారు.

### నా గురించి తెలియాలనే వాస్తవాలను మీ ముందుంచుతున్నా..

నా గురించి తెలియాలనే వాస్తవాలను మీ ముందు ఉంచుతున్నా. నేను మోసం చేసినట్లు, ఆస్తి కోసం అత్యాశ పడినట్లు భావించవద్దనే ఈ లేఖ రాశా. ఎంవోయూ నా చేతుల్లో ఐదేళ్లున్నా.. ఒక్క ఆస్తి కూడా ఇవ్వలేదు. ఏ ఒక్క మీడియా, కోర్టుకు ఎంవోయూ విషయాన్ని నేను బయటపెట్టలేదు. ఆర్థికంగా ఇబ్బంది పడినా కుటుంబ గౌరవం కోసం ఎంవోయూను బయటపెట్టలేదు. వైఎస్సార్ అభిమానులను మానసిక క్షోభకు గురిచేసిందెవరో మీకు తెలుసు. కుటుంబ బంధం, స్నేహబంధంతో మనుషులు ఒక్కటవుతారు. ‘వైఎస్సార్ బంధం’ ఏర్పరచుకున్న ప్రతి వైఎస్సార్ బంధువుకి వివరణ ఇస్తున్నా. అమ్మను, నన్ను తప్పుగా అర్థం చేసుకోవద్దనే వాస్తవాలు చెబుతున్నా”అని షర్మిల లేఖలో పేర్కొన్నారు.

## ఈ లక్షణాలు ఉన్న భక్తులు తిరుమలకు మెట్ల మార్గాన రావొద్దు : టీటీడీ



**విశ్వంభర, తిరుమల :** తిరుమల కొండపై ఉన్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు కాలినడకన మెట్లమార్గాన వచ్చే భక్తులకు టీటీడీ పలు సూచనలు చేసింది. ముఖ్యంగా పలు ఆరోగ్య సమస్యలున్నవారు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేసింది. వృద్ధులు, అధిక రక్తపోటు, మధుమేహం , కీళ్లవ్యాధులు, మూర్ఛ, గుండె సంబంధిత వ్యాధులున్నవారు మెట్లమార్గాన రావడం శ్రేయస్కరం కాదని వెల్లడించింది. తిరుమల కొండ సముద్ర మట్టానికి చాలా ఎత్తులో ఉండడం కారణంగా ఆక్సిజన్ స్థాయి తక్కువగా ఉంటుందని వివరించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న భక్తులు వారి రోజు వారి మందులు వెంట తెచ్చుకోవాలని అన్నారు. కాలినడకన ఏవైనా సమస్యలు ఎదురవుతే 1500 మెట్టు, గాలిగోపురం, భాష్యకార్ల సన్నిధి వద్ద వైద్య సహాయం పొందవచ్చని తెలిపారు. తిరుమలలోని ఆసుపత్రుల్లో అత్యవసర వైద్య సదుపాయం అందుబాటులో ఉంటుందని టీటీడీ అధికారులు పేర్కొన్నారు.

## తిరుమలను దర్శించుకున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు



**విశ్వంభర, అమరావతి :** కేంద్ర పౌరవిమానాయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు శుక్రవారం తిరుమలను దర్శించుకున్నారు. తెల్లవారుజామున వీఐపీ దర్శన సమయంలో సతీసమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కేంద్ర మంత్రి రాక సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయం బయట మీడియాతో మంత్రి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గడిచిన నాలుగు నెలల్లో తిరుమలను ప్రక్షాళన చేశామని, తిరుమలకు వచ్చే భక్తులు నేడు చాలా సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్రం సమన్వయంతో రాష్ట్రం గాడిలో పడిందని అన్నారు. ఏపీని అభివృద్ధి చేసే దిశగా ప్రధాని మోదీ నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు.

### తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ..

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 9 కంపార్టుమెంట్లలో వేచియుండగా టోకెన్లు లేని భక్తులకు 6 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని అధికారులు వివరించారు. గురువారం స్వామివారిని 61,004 మంది భక్తులు దర్శించుకోగా 20,173 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా రూ. 3.48 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.

## తెలుగు సినీ పరిశ్రమ విజయవాడకు తరలిరావాలి
### మంత్రి కందుల దుర్గేశ్



విశ్వంభర, విజయవాడః ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుస్థిర పర్యాటకంపై దృష్టిసారిస్తోందని రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. రాష్ట్రంలోని ఏదైనా పర్యాటక ప్రాంతానికి వెళ్తే మూడు నాలుగు రోజులు అక్కడే ఉండేలా ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు. విశాఖపట్నంలో సీఐఐ ఆధ్వర్యంలో నిర్వహించిన టూరిజం ,ట్రావెల్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణ, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్రంలో సినిమాల చిత్రీకరణలు ఎక్కువగా జరుగుతు న్నాయని చెప్పారు. సినిమాల చిత్రీకరణ జరిగితే రెవెన్యూ పెరుగుతుందని మంత్రి చెప్పారు. టికెట్ల ధరలు పెంచాలని అడుగుతున్నారని, తెలుగు సినిమాలకు తప్పకుండా సహకారం అందిస్తామని, అంతకంటే ముందు చిత్ర పరిశ్రమ విజయ వాడకు తరలివస్తే మరింత ఉపయుక్తంగా ఉంటుందని ఆయన అన్నారు. ఎక్కువ పెట్టుబడులు పెట్టే పరిస్థితుల్లో ప్రభుత్వం లేదని, అందుకే పీపీపీ విధానంపై దృష్టిపెడుతున్నామని తెలి పారు. అందరి సలహాలు తీసుకొని అందరికీ అనుకూలంగా ఉం డేలా త్వరలో టూరిజం పాలసీ తీసుకొస్తామని చెప్పారు. స్వదేశీ దర్శన్, ప్రసాద్ పథకాల కింద రాష్ట్రానికి త్వరలో రూ.1000 కోట్లు కేటాయిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని మంత్రి దుర్గేశ్ చెప్పారు. రాష్ట్రంలో భారీ తీర ప్రాంతం ఉన్నా బ్లూ ఫాగ్ బీచ్ ఒక్కటే ఉందని అన్నారు. మిగిలిన బీచ్‌లను అభివృద్ధి చేయడంపై దృష్టి సారిస్తామని చెప్పారు. ఏపీలోని పర్యాటక ప్రాంతాలపై అందరూ కలసి ప్రచారం చేయాలని సూచించారు. రాష్ట్రంలో చిత్రీకరణ జరుగుతున్న ప్రాంతాల అసలైన పేర్లను సినిమాల్లో ప్రస్తావించాలన్నారు. అప్పుడే ఈ ప్రాంతాల గురించి అందరికీ తెలుస్తుందని అభిప్రాయపడ్డారు.

## ఏపీలో ఉచిత సిలిండర్‌కు 29 తేదీ నుంచి బుకింగ్స్
### మంత్రి నాదెండ్ల మనోహర్



**విశ్వంభర, అమరావతి** : ఏపీ ప్రభుత్వం దీపావళి కానుకగా ప్రకటించిన ఉచిత సిలిండర్ పథకానికి ఈనెల 29 నుంచి బుకింగ్స్ చేసుకోవచ్చని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. ఈనెల 30న సీఎం చేతుల మీదుగా తొలి సిలిండర్‌ఇప్పిస్తామని పేర్కొన్నారు.గ్యాస్ కనెక్షన్‌కు అర్హత కలిగిన ఎల్పీజీ కనెక్షన్ (%బ్రా+ జశీ్రశ్రీవషఱశీఅం%) , తెల్లరేషన్‌కార్డు, ఆధార్‌కార్డు ఉండాలని సూచించారు. సిలిండర్ డెలివరీ అయిన 48 గంటల్లోపు వారి ఖాతాల్లోకి డబ్బు జమ అవుతుందని , పథకం అందకపోతే టోల్‌ఫ్రీ నెంబర్ 1967 ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చని అన్నారు.ఈరోజే దీనికి సంబంధించిన ఉత్తర్వులు ఇస్తామని వివరించారు.అక్టోబర్ 31 నుంచి మార్చి 31 వరకు మొదటి సిలిండర్‌ను బుక్ చేసుకోవచ్చని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ కంపెనీలకు రూ. 894 కోట్లను సీఎం చేతుల మీదుగా అందించబోతున్నామని వెల్లడించారు. రెండో సిలిండర్ ఏప్రిల్ 1 నుంచి జులై 31 వరకు , ఆగస్టు 1 నుంచి డిసెంబర్ 31 వరకు మూడో సిలిండర్ కోసం బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు.రాబోయే రోజుల్లో కొత్త రేషన్‌కార్డులు అందించబోతున్నామని, వాటి డిజైనింగ్ జరుగుతుందని తెలిపారు. కోటి 55 లక్షల కనెక్షన్‌లకు గ్యాస్ సిలిండర్‌లు పంపిణీ చేస్తున్నామని, వీటిలో కేంద్ర ప్రభుత్వం ఉజ్వల పథకం కేవలం 9 లక్షల 65 వేల సిలిండర్లు వస్తున్నాయని తెలిపారు.

## అల్లు అర్జున్‌కు ఏపీ హైకోర్టులో ఊరట



విశ్వంభర,అమరావతి: ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్‌కు ఏపీ హైకోర్టులో ఊరట లభించింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారనే కారణంతో నంద్యాల పోలీసులు అల్లు అర్జున్ పై కేసు నమోదు చేశారు. తమపై నమోదు చేసిన కేసులను కొట్టేయాలం టూ అర్జున్, మాజీ ఎమ్మెల్యే రవిచంద్ర కిశోర్‌రెడ్డి వేసిన వ్యాజ్యంపై హైకోర్టు విచారణ జరిపింది. ఎఫ్ఐఆర్ ఆధా రంగా నవంబరు 6 వరకు తదుపరి చర్యలు తీసుకో వద్దని న్యాయస్థానం ఆదేశించింది.నవంబరు 6న తగిన ఉత్తర్వులిస్తామని హైకోర్టు తెలిపింది.సార్వత్రిక ఎన్నికల సమయంలో నంద్యాల వైకాపా అసెంబ్లీ అభ్యర్థి శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ఇంటికి అల్లుఅర్జున్ వచ్చారు. వైకాపా శ్రేణులు పట్టణ శివారు నుంచే భారీ వాహ నాలు, మోటారు సైకిళ్లతో ప్రదర్శనగా పట్టణంలోకి ఆయన్ను తీసుకువచ్చాయి. ఆయన పర్యటనకు అధి కారిక అనుమతులూ లేకపోయినా పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఈ విషయాన్ని కొందరు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అల్లు అర్జున్, శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డిలపై అప్పట్లో నంద్యాల రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

## హొటళ్లకు బాంబు బెదిరింపు ఉలిక్కిపడ్డ తిరుపతి



విశ్వంభర,**తిరుపతి:** తిరుపతిలో బాంబు బెదిరింపులు కలకలం సృష్టించాయి. స్టార్ హొటళ్లను పేల్చేస్తామంటూ గుర్తుతెలియని వ్యక్తులు బెదిరింపులకు పాల్పడ్డారు. లీలామహల్‌సమీపంలోని మూడు ప్రైవేటు హొటళ్లు, కపిల తీర్థం, అలిపిరి సమీపంలోని హొటళ్లకు మెయిల్స్ ద్వారా బెదిరింపులు వచ్చాయి. నగదు ఇవ్వాలని, లేదంటే చంపుతామని, మీ హొటళ్లలో పలుచోట్ల బాంబులు పెట్టామని హెచ్చరించినట్లు తెలుస్తుంది. సమా చారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగారు. హొటల్స్‌లో విస్తృ తంగా తనిఖీలు చేపట్టారు. అయితే ఎక్కడా పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించారు. బాంబు బూచీ సమాచారంతో నగర వాసులు ఉలిక్కి పడ్డారు. కాగా, ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మెయిల్ ఎవరుచేశారు, ఎక్కడి నుంచి వచ్చాయనే విష యంపై ఆరాతీస్తున్నారు.తిరుపతి విమానాశ్రయంలో స్టార్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఎస్5-154 విమానానికి బాంబు బెదిరింపు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఆదమ్‌లాన్‌జా 333 పేరుతో ఉన్న ఎక్స్ (%శ%) ఖాతా నుంచి బెదిరింపు మెసేజ్ పంపినట్లు చెప్పారు. వెంటనే అప్రమత్తమై ఎయిర్?పోర్టుకు సమాచారం అందించినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### నేటి నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు
### రూ.100తో రూ.5 లక్షల వరకు బీమా

విశ్వంభర, అమరావతి: తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమంపై ఆ పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సమీక్షించారు. పార్టీని బలోపేతం చేయడం, నామినేటెడ్ పదవుల భర్తీపై ఉండవల్లిలోని తన నివాసంలో నేతలతో చర్చించారు. శనివారం (అక్టోబర్ 26) నుంచి ప్రారంభమయ్యే తెదేపా సభ్యత్వ నమోదును రికార్డు స్థాయిలో చేపట్టేలా తెదేపా ఏర్పాట్లు చేస్తోంది. రూ.100 సభ్యత్వంతో తెదేపా కార్యకర్తలకు రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా, వారి కుటుంబ సభ్యులకు విద్య, వైద్యం, ఉపాధి కోసం సాయం అందించనున్నారు.అలాగే, రెండో దఫా నామినేటెడ్ పదవుల భర్తీపై నేతలతో సీఎం చర్చించారు. సాధ్యమైనంత త్వరగా రెండో లిస్ట్ విడుదల చేసేలా కసరత్తు చేస్తున్నారు. మొదటి దశలో ఇచ్చిన 21 నామినేటెడ్ పదవులకు రెట్టింపు సంఖ్యలో రెండో జాబితా ఉంటుందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. నామినేటెడ్ పదవుల భర్తీ విషయంలో కూటమి పక్షాలతోనూ చంద్రబాబు సంప్రదింపులు జరుపుతున్నారు. కష్టపడిన వారికే పదవి అనే విధానంలో భాగంగా నామినేటెడ్ పోస్టులకు ఎంపికపై చర్చిస్తున్నారు.

## లయన్స్ జియో దీపావళి ధమాకా

### ప్లాన్‌లపై 3,350 విలువైన ప్రయోజనాలు




**ముంబయి:** ప్రముఖ టెలికాం సంస్థ రిలయన్స్ జియో 'దీపావళి ధమాకా' ఆఫర్లను తీసుకొచ్చింది. పండగ సందర్భంగా తీసుకొచ్చిన ఈ సదుపాయంతో ఎంపిక చేసిన రీఛార్జీలపై రూ.3,350 విలువైన ప్రయోజనాలు అందిస్తున్నట్లు ప్రకటించింది. ఈ ఆఫర్లు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. నవంబర్ 3లోపు రీఛార్జి చేసుకున్నవాళ్లు మాత్రమే ఈ బెనిఫిట్స్ పొందుతారు. దీపావళి ఆఫర్‌లో భాగంగా రూ.899, రూ.3,599 రీఛార్జి ప్లాన్లపై అదనపు ప్రయోజనాలను జియో అందిస్తోంది. ఆఫర్ ముగిసేలోగా ఈ ప్లాన్‌లతో రీఛార్జి చేసుకుంటే రూ.3,000 విలువ చేసే ఈజీ మై ట్రిప్ వోచర్ అందిస్తోంది. విమాన ప్రయాణాలు, హోటల్ బుకింగ్స్ చేసుకొనే వారు ఈ వోచర్ వినియోగించుకోవచ్చు. రూ.999 కంటే ఎక్కువ మొత్తంతో అజియో వేదికగా కొనుగోలు చేసినప్పుడు రూ.200 విలువైన అజియో కూపన్ వర్తిస్తుంది. రూ.150 విలువైన స్విగ్గీ వోచర్ కూడా ఈ ప్లాన్లతో ఇస్తోంది. 'మై జియో' యాప్ సాయంతో కూపన్లు క్లెయిమ్ చేసుకోవచ్చు. జియో అందిస్తున్న రూ.899 త్రైమాసిక ప్లాన్‌తో 90 రోజుల వ్యాలిడిటీ కలిగి ఉంటుంది. ఈ ప్లాన్ రీఛార్జితో రోజుకు 2జీబీ డేటా, అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లు పొందొచ్చు. జియో మరో ప్లాన్ రూ.3,599 ప్లాన్‌తో అపరిమిత కాలింగ్ లభిస్తాయి. రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లు, 2.5జీబీ డేటాను పొందొచ్చు. ఈ ప్యాక్ వ్యాలిడిటీ 365 రోజులుగా ఉంది.

## నిరాశ పర్చిన ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఆర్థిక ఫలితాలు

### 19 శాతం షేర్ పతనం




**ఢిల్లీ:** ప్రముఖ ప్రైవేట్ బ్యాంకు ఇండస్‌ఇండ్ బ్యాంకు షేర్లు శుక్రవారం 19 శాతం పతనం అయ్యాయి. దీంతో శుక్రవారం ఒక్క రోజే సంస్థ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.18,489.39 కోట్లు కోల్పోయింది. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే సెప్టెంబర్ త్రైమాసికం ఆర్థిక ఫలితాల్లో ఇండస్‌ఇండ్ బ్యాంకు మార్కెట్ వర్గాలను నిరాశ పరిచింది. గతేడాదితో పోలిస్తే 2024-25 ఆర్థిక సంవత్సర ద్వితీయ త్రైమాసికంలో నికర లాభం 40 శాతం తగ్గుముఖం పట్టి రూ.1,331 కోట్లకు పరిమితమైంది. దీంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలహీన పడింది. ఫలితంగా ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్ అమ్మకాల ఒత్తిడికి గురైంది. ట్రేడింగ్ ముగిసే సమయానికి ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్ బీఎస్ఈలో 19.82 శాతం నష్టంతో రూ.1,037లకు పడిపోయింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో స్టాక్ 19.88 శాతం నష్టంతో రూ.1,025.50లతో 52 వారాల కనిష్టాన్ని తాకింది. దీంతో ఇండస్‌ఇండ్ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.18,489.39 కోట్లు నష్టపోయి రూ.81,136.03 కోట్లతో సరిపెట్టుకున్నది.

## ట్రంప్ విజయం సాధిస్తే భారత్ ఐటీకి కష్టాలు..!

### అప్రమత్తంగా వ్యవహరిస్తున్న మార్కెట్లు



**ఢిల్లీ:** అమెరికాలో ఎన్నికల తేదీలు దగ్గరపడే కొద్దీ ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లు రానున్న ఫలితాలపై అంచనాలతో అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. తాజాగా ట్రంప్ విజయం భారత్‌పై ఎటువంటి ప్రభావం చూపిస్తుందనే అంశంపై ఫిలిప్ క్యాపిటల్ సంస్థ ఓ నివేదికను విడుదల చేసింది. రిపబ్లికన్ పార్టీ విజయంతో వీసా విధానాలు మరింత కఠినతరంగా మారతాయని.. ఇవి ఐటీ కంపెనీలకు సవాళ్లను విసురుతాయని పేర్కొంది. దీంతో కంపెనీలు ఇబ్బందులు తగ్గించుకోవడానికి అత్యధికంగా ఆన్‌సైట్ మార్కెట్లలో స్థానికులనే నియమించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అభిప్రాయపడింది. దీంతో పాటు నియర్ షోర్ డెలివరీ సెంటర్ల సంఖ్యను పెంచాల్సి ఉంటుందని పేర్కొంది. ఇక ఆటోమొబైల్ రంగంలో భారత్ నుంచి విడిభాగాల ఎగుమతులు తగ్గుముఖం పట్టొచ్చని పేర్కొంది. ట్రంప్ విద్యుత్తు వాహనాలకు ఇన్సెంటివ్‌లను తగ్గించే అవకాశాలుండటంతో భారత్ నుంచి ఎగుమతి అయ్యే వాటి స్పేర్‌పార్ట్‌లపై స్వల్పకాలం పాటు ప్రతికూల ప్రభావం ఉంటుందని అంచనా వేసింది. అదే సమయంలో హైబ్రీడ్ వాహనాల మార్కెట్ వృద్ధి చెందడంతో కుదురు కుంటుందని తెలిపింది. దీంతోపాటు ట్రంప్ భారీ ఇన్‌ఫ్రాప్లాన్లతో క్లాస్-8 శ్రేణి ట్రక్కులకు డిమాండ్ పెరగడం భారత ఆటోమొబైల్ స్పేర్ పార్ట్శ్ రంగానికి కలిసొస్తుందని చెప్పింది. ఇది కమోడిటీలు, లోహరంగానికి ఇన్‌ఫ్రాప్లాన్లు బలాన్నిస్తాయని తెలిపింది. ట్రంప్ అత్యధికంగా శిలాజ ఇంధనానికే ప్రాధాన్యం ఇస్తారని ఈ నివేదిక పేర్కొంది. ఫలితంగా అమెరికాలో ముడిచమురు, గ్యాస్ ఉత్పత్తి గణనీయంగా పెరిగి.. ప్రపంచవ్యాప్తంగా వాటి ధరలు పడిపోవచ్చని విశ్లేషించింది. ఇది రిఫైనరీ రంగానికి, వినియోగదారులకు ప్రయోజనకరంగా ఉంటుందని ఫిలిప్ క్యాపిటల్ వెల్లడించింది. కమల, ట్రంప్ ఇద్దరూ ఇండో-పసిఫిక్ వ్యూహానికి మద్దతు తెలిపారు. ఈనేపథ్యంలో హారిస్ గెలిస్తే.. రక్షణపరమైన సమన్వయం పెంచడంపై దృష్టిపెడతారని.. అదే ట్రంప్ ఆయుధ విక్రయాల వంటి లావాదేవీలను పెంచుకోవడానికి యత్నిస్తారని పేర్కొంది. ఇక చైనాపై ట్రంప్ టారీఫ్ యుద్ధం మళ్లీ మొదలుపెడితే మాత్రం భారత సంస్థలకు సరికొత్త అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా టెక్స్‌టైల్స్, ఆటోమొబైల్ విడిభాగాలు, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ సంస్థలు అమెరికా మార్కెట్లోకి బలంగా వెళ్లేందుకు మార్గం లభిస్తుందని ఆ నివేదిక చెప్పింది. అదే సమయంలో ప్రత్యక్ష పెట్టుబడులు భారత్ వైపు మళ్లుతాయని అభిప్రాయపడింది.

## 63 శాతం పెరిగిన సత్య నాదెళ్ల వేతనం

### భారతీయ కరెన్సీలో రూ.664 కోట్లు



**వాషింగ్టన్:** ప్రముఖ టెక్ సంస్థ మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల జీతం పెరిగింది. 2024 ఆర్థిక సంవత్సరంలో ఆయన 79.1 మిలియన్ డాలర్ల వేతనం అందుకోనున్నారు. అంటే మన భారతీయ కరెన్సీ ప్రకారం సుమారు రూ.664 కోట్లు అన్నమాట. ఈ విషయాన్ని కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. 2023 ఆర్థిక సంవత్సరంలో అందుకున్న 48.5 మిలియన్ డాలర్లతో (సుమారు రూ.407 కోట్లు) పోలిస్తే ఇది 63 శాతం ఎక్కువ. జూన్‌తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో మైక్రోసాఫ్ట్ వృద్ధిలో దూసుకెళ్లింది. దీంతో కంపెనీ షేర్లు దాదాపు 31.2 శాతం లాభపడ్డాయి. అలా మైక్రోసాఫ్ట్ మార్కెట్ విలువ 3 ట్రిలియన్ డాలర్లను దాటింది. దీంతో నాదెళ్ల స్టాక్ అవార్డులు 39 మిలియన్ డాలర్ల నుంచి 71 మిలియన్ డాలర్లకు పెరిగాయి. కృత్రిమ మేధ రేసులో రాణించేందుకు కంపెనీ ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. అందులో భాగంగానే చాట్‌జీపీటీ మాతృసంస్థ ఓపెన్ ఏఐలో పెట్టుబడులు పెట్టింది. మైక్రోసాఫ్ట్‌లో అందించిన సేవలకు గానూ నాదెళ్లకు 5.2 మిలియన్ డాలర్లు (రూ.43 కోట్లు) నగదు ప్రోత్సహకం అందనున్నట్లు కంపెనీ ఫైలింగ్ తెలిపింది. అయితే ఆయనకు రావాల్సిన 10.7 మిలియన్ డాలర్ల కంటే ఇది తక్కువ ఈ ఆర్థిక సంవత్సరంలో అనేక సైబర్ సెక్యూరిటీ ఉల్లంఘనల కారణంగా ప్రోత్సాహకం తగ్గినట్లు తెలుస్తోంది. ఇక కంపెనీ సీఈఓల వేతనాల విషయానికొస్తే.. యాపిల్ సీఈఓ టిమ్ కుక్ 2023లో 63.2 మిలియన్ డాలర్ల (రూ.531 కోట్లు) జీతం పొందారు. చిప్ తయారీ కంపెనీ ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ 2024లో 34.2 మిలియన్ డాలర్ల (రూ.282 కోట్లు) వేతనం అందుకోనున్నారు.

## కంటెంట్ క్రియేటర్లకు గుడ్‌న్యూస్

### యూట్యూబ్ కొత్త ఫీచర్‌తో మరింత ఆదాయం!




**ఢిల్లీ:** ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ కంటెంట్ క్రియేటర్ల కోసం కొత్త సదుపాయాన్ని తీసుకొచ్చింది. వారి ఆదాయాన్ని పెంచే దిశగా షాపింగ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. దీని సాయంతో అర్హులైన క్రియేటర్లు తన వీడియోల్లో ఉత్పత్తులను ట్యాగ్ చేసి ఆదాయాన్ని సంపాదించుకోవచ్చని తెలిపింది. దక్షిణ కొరియా, అమెరికాలాంటి దేశాల్లో యూట్యూబ్ ఈ అనుబంధ షాపింగ్ ప్రోగ్రామ్‌ను ఇదివరకే అందుబాటులోకి తెచ్చింది. ఈ సేవల్ని తాజాగా మరిన్ని దేశాలకు విస్తృతం చేసింది. తాజాగా భారత్‌లో ఈ సదుపాయాల్ని లాంచ్ చేసింది. దీనికోసం మింత్రా, ఫ్లిప్‌కార్ట్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు యూట్యూబ్ తెలిపింది. అర్హులైన కంటెట్ క్రియేటర్లందరికీ ఈ సదుపాయం అందుబాటులో ఉంటుందని పేర్కొంది. ఈ ఫీచర్‌ని ఎనేబల్ చేసుకొనేందుకు వీడియో క్రియేటర్లు యూట్యూబ్ షాపింగ్‌లో సైనప్ అవ్వాల్సి ఉంటుంది. మీ అప్లికేషన్‌ను ప్లాట్‌ఫామ్ ఆమోదించాక ఈ సదుపాయాన్ని యాక్సెస్ చేయొచ్చు. ఇక యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసే వీడియోలు, షార్ట్‌లు, లైవ్‌స్ట్రీమ్‌లో ఉత్పత్తులను ట్యాగ్ చేయొచ్చు. యూజర్లకు ఆ ఉత్పత్తులు నచ్చితే పక్కనే ఉన్న షాపింగ్ సింబల్‌పై క్లిక్ ఆ ప్రొడక్ట్ వివరాలు కనిపిస్తాయి. దీనికోసం వేరే బ్రౌజర్ పేజ్‌కు కూడా వెళ్లాల్సిన పనిలేదు. అక్కడే ఉత్పత్తి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నమాట. నచ్చిన ప్రొడక్ట్‌ని అక్కడే పిన్ కూడా చేసుకోవచ్చు. ఇలా ప్రమోట్ చేసిన ఉత్పత్తులను యూజర్లు కొనుగోలు చేస్తే క్రియేటర్లకు కమీషన్ అందుతుందని యూట్యూబ్ తెలిపింది. ఉత్పత్తులను ట్యాగ్ చేసే సమయంలోనే కమీషన్ వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొంది. అంతేకాదు ఒక వీడియోకు దాదాపు 30 ఉత్పత్తులను ట్యాగ్ చేసే సదుపాయాన్ని అందిస్తోంది. యూట్యూబ్ ప్రోగ్రామ్‌లో భాగస్వామ్యం అయిన కంటెట్ క్రియేటర్లకు ఈ సదుపాయం ఉంటుంది. అంటే వీరికి 10వేల మంది కంటే ఎక్కువ సబ్‌స్క్రైబర్లు ఉండాలన్నమాట. అయితే, పిల్లల కోసం ఛానళ్లు నడుపుతున్న వాళ్లకు, మ్యూజిక్ ఛానళ్లు నడిపేవారికి ఈ సదుపాయం ఉండదని వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ వెల్లడించింది.

## ప్రధానమంత్రి ముద్ర యోజన రుణ పరిమితి రెట్టింపు

### రుణాలు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంపు



**ఢిల్లీ :** ప్రధానమంత్రి ముద్ర యోజన రుణ పరిమితిని కేంద్రం పెంచింది. ఈ పథకం కింద అందించే రుణాలను రూ.10లక్షల నుంచి రూ.20లక్షలకు పెంచుతున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటించింది. సూక్ష్మ, చిన్నతరహా సంస్థలకు రుణాలను అందించడమే లక్ష్యంగా కేంద్రం తీసుకొచ్చిన ఈ పథకానికి సంబంధించి రుణ పరిమితిని పెంచుతున్నట్లు బడ్జెట్‌లో ఇదివరకే నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ పథకంలో మూడు రకాల రుణాలు ఉంటాయి. శిశు రుణాల కింద రూ.50,000 వరకు, కిశోర రుణాల కింద రూ.50,000 నుంచి రూ.5 లక్షల వరకు, తరుణ్ రుణాల కింద రూ.5-10 లక్షల మేర ఆర్థిక తోడ్పాటును అందిస్తున్నారు. అయితే తాజాగా తరుణ్ ప్లస్ పేరిట కొత్త కేటగిరీని జోడించారు. ఈతరహా రుణ పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అయితే ఇంతకుముందు ఎవరైతే ఈ తరహా రుణాలు పొంది వాటిని తిరిగి చెల్లించి ఉంటారో వారికి మాత్రమే ఈ రుణాలు అందుతాయని స్పష్టంచేసింది. 2015లో కేంద్రం పీఎంఎంవైను ప్రారంభించింది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు నిధులు సమకూర్చాలనే ఉద్దేశంతో కేంద్రం దీన్ని తీసుకొచ్చింది.

## చిన్న వయసులోనే ఫుట్‌బాలర్ కన్నుమూత..



**మొరాకో:** ప్రపంచ ఫుట్‌బాల్‌లో విషాదం నెలకొంది. మొరాకో మాజీ సాకర్ ఆటగాడు అబ్దెలాజిజ్ బరాద్ చిన్నవయసులోనే కన్నుమూశాడు. మిడ్‌ఫీల్డర్‌గా రాణించిన బరాద్ 35 ఏండ్లకే ఈ లోకాన్ని విడిచి పెట్టి వెళ్లాడు. తమ ఆరాధ్య ఆటగాడు ఇక లేడనే వార్త తెలిసి మొరాకో అభిమానులు షాక్‌లో ఉండిపోయారు. బరాద్ మృత్యుఒడికి చేరడంతో ఫుట్‌బాల్ దిగ్గజాలు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.'బరాద్ మరణం మొరాకోకు పూడ్చలేని లోటు అని ఆ దేశ ఫుట్‌బాల్ సమాఖ్య సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టింది. రాయల్ మొరాకో ఫుట్‌బాల్ సమాఖ్య బరాద్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తోంది' అని తన పోస్ట్‌లో రాసుకొచ్చింది. అయితే.. బరాద్ అకాల మరణానికి కారణాలు ఏంటనేది తెలియాల్సి ఉంది. ఫ్రాన్స్‌లో పుట్టిన బరాద్ ఫుట్‌బాల్ మీద ఇష్టంతో అదే ఆటను కెరీర్‌గా ఎంచుకున్నాడు. మొదట్లో పారిస్ సెయింట్ జర్మనీ క్లబ్‌కు ఆడిన బరాద్ అక్కడే తన ఆటకు మెరుగులు దిద్దుకున్నాడు. అనంతరం మొరాకో, మర్సీఎల్లే జట్లకు ఆడిన బరాద్ మిడ్ ఫీల్డర్‌గా పలు విజయాల్లో భాగమయ్యాడు. అయితే.. అతడి కెరీర్ సాగింది కొన్నాళ్లే. 26 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన బరాద్ చివరిసారిగా 2015లో మైదానంలోకి దిగాడు. ఆ తర్వాత ఆరేండ్లకు అంటే.. 2012లో సాకర్‌కు వీడ్కోలు పలికాడు. మొరాకో జాతీయ జట్టు తరఫునే కాకుండా.. అల్ నస్రీ(సౌదీ అరేబియా), అంటల్యాస్పొర్(టర్కీ) వంటి క్లబ్స్‌కు కూడా బరాద్ ప్రాతినిధ్యం వహించాడు.

## వార్నర్‌పై జీవితకాల నిషేధం ఎత్తేసిన ఆస్ట్రేలియా



**సిడ్నీ:** అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్ కు పెద్ద ఊరట. సుదీర్ఘ కెరీర్‌లో మాయని మచ్చలా నిలిచిన సాండ్ పేపర్ వివాదం నుంచి ఎట్టకేలకు డేవిడ్ భాయ్ బయటపడ్డాడు. ఆరేండ్లుగా అతడిని కెప్టెన్‌గా కాకుండా విధించిన జీవితకాల నిషేధాన్ని క్రికెట్ ఆస్ట్రేలియా ఎత్తేసింది. దాంతో, ఇకపై వార్నర్ బిగ్‌బాష్ లీగ్‌లో సారథిగా ఎంపికయ్యే అవకాశముంది. ఇంతకూ వార్నర్ ఈ వివాదంలో ఎలా చిక్కుకున్నాడో తెలుసా?..ఆస్ట్రేలియా జట్టు 2018 మార్చిలో దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లింది. కేప్‌టౌన్‌లో టెస్టు మ్యాచ్ సమయంలో ఆసీస్ ఆటగాడు కామెరూన్ బ్యాన్‌క్రాఫ్ట్ సాండ్‌పేపర్‌తో బంతిని రుద్దుతూ కెమెరా కంట పడ్డాడు. అతడిపై విచారణ జరపగా.. బాల్ ట్యాంపరింగ్‌లో వార్నర్, స్టీవ్ స్మిత్‌ల హస్తం కూడా ఉందని తేలింది. దాంతో, ఆసీస్ ఆటగాళ్లపై మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.

### 6 ఏండ్ల పోరాటం

ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఆస్ట్రేలియా బోర్డు.. వార్నర్, స్మిత్‌లు జాతీయ జట్టుకు కెప్టెన్సీ చేయకుండా జీవితకాల నిషేధం విధించింది. అయితే.. అందులో తన తప్పు లేదని వార్నర్ మొత్తుకున్నా ఎవరూ నమ్మలేదు. ఇప్పుడు ఆసీస్ బోర్డు వార్నర్‌పై సస్పెన్షన్‌ను ఎత్తేయడంతో 6 ఏండ్ల న్యాయపోరాటం ఫలించింది. ఓ దశలో తన కెరీర్‌ను ప్రశ్నార్థకం చేసిన సాండ్ పేపర్ వివాదం గురించి వార్నర్ వీడ్కోలు అనంతరం కీలక వ్యాఖ్యలు చేశాడు.'నేను నా ఆత్మకథ రాస్తున్నా. పుస్తకం ద్వారా ఎన్నో సంచలన విషయాలను మీతో పంచుకోబోతున్నా. ఆ బుక్ ఎందరినో షాక్‌కు గురి చేస్తుంది. అంతేకాదు నా కెరీర్‌ను కుదిపేసిన సాండ్‌పేపర్ వివాదం గురించి కూడా ప్రస్తావించబోతున్నా' అని వార్నర్ వెల్లడించాడు. దాంతో, డేవిడ్ భాయ్ ఏం సంచలన విషయాలు చెబుతాడు? అని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సాండ్ పేపర్ వివాదం నుంచి బిగ్ రిలీఫ్ లభించడంతో వార్నర్.. బీబీఎల్‌లో సిడ్నీ థండర్స్ జట్టుకు కెప్టెన్ అయ్యే అవకాశముంది.

### నాలుగు ఐసీసీ ట్రోఫీలు

ప్రపంచంలోని విధ్వంసక ఓపెనర్లలో ఒకడిగా పేరొందిన వార్నర్ ఆటకు విజయంతో వీడ్కోలు పలికాడు. అదే సమయంలో వన్డేలకు కూడా రిటైర్మెంట్ పలుకుతున్నానని ప్రకటించాడు. ఇకపై టీ20 లీగ్స్‌లో మాత్రమే కనిపిస్తానని చెప్పిన వార్నర్ .. శరీరం సహకరిస్తే చాంపియన్స్ ట్రోఫీ 2025కు అందుబాటులో ఉంటానని తెలిపాడు. కెరీర్ ఆసాంతం దూకుడే మంత్రగా ఆడిన ఈ లెఫ్ట్ హ్యాండర్ ఆస్ట్రేలియా విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. నాలుగు ఐసీసీ ట్రోఫీలు గెలిచిన ఆసీస్ జట్టులో సభ్యుడైన వార్నర్ ఓపెనర్‌గా పలు రికార్డులు నెలకొల్పాడు.

## క్రికెట్‌లో అరుదైన చెత్త ఫీట్..

**సిడ్నీ:** క్రికెట్‌లో బౌలర్లపై బ్యాటర్లదే హవా అంటుంటారు. అది తప్పని బౌలర్లూ నిరూపిస్తుంటారు. ఆరంభం అద్భుతంగా ఉన్నప్పటికీ.. క్షణాల్లో కుప్పకూలి కష్టాలను కొనితెచ్చుకుంటాయి కొన్ని టీమ్‌లు. ఆ జట్టు డిఫెండింగ్ ఛాంపియన్ అయితే.. అభిమానులను ఇంకాస్త బాధగానే ఉంటుంది. ఆస్ట్రేలియా దేశవాళీ క్రికెట్‌లోనూ ఇలాంటిదే చోటు చేసుకుంది. ఇంతకీ జరిగిందంటే? ఆస్ట్రేలియా దేశవాళీ క్రికెట్‌లో వన్డే కప్‌కు ప్రాధాన్యత ఉంటుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన వెస్టన్ ఆస్ట్రేలియాకు టాస్మానియా జట్టు చుక్కలు చూపించింది. ఆష్టన్ టర్నర్, జోష్ ఇంగ్లిస్, జే రిచర్డ్‌సన్ వంటి అంతర్జాతీయ ఆటగాళ్లు కలిగిన వెస్టన్ తొలుత బ్యాటింగ్ చేసింది. టాస్మానియా దెబ్బకు 53 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్ ఆర్కీ షార్ట్ (22) టాప్ స్కోరర్. అతడితోపాటు బాన్‌క్రాఫ్ట్ (14) మాత్రమే రెండంకెల స్కోరు చేయడం గమనార్హం. ఒక దశలో 51/2తో మంచి స్థితిలోనే ఉన్న వెస్టన్ ఆస్ట్రేలియాను టాస్మానియా బౌలర్లు కేవలం రెండు పరుగుల్లోపే మిగతా ఎనిమిది వికెట్లను పడగొట్టారు. మరీ ముఖ్యంగా ఆ జట్టులో వరుసగా ఆరుగురు బ్యాటర్లు డకౌట్‌గా పెవిలియన్‌కు చేరారు. టాస్మానియా బౌలర్ వెబ్‌స్టర్ కేవలం 17 పరుగులే ఇచ్చి ఆరు వికెట్లు పడగొట్టాడు. స్టాన్‌లేక్ (3/12), టామ్ రోజెర్స్ (1/12) సహకారం అందించారు.

## 'వాషింగ్టన్'పై రెండేళ్ల కిందటే గంభీర్ దృష్టి: మాజీ క్రికెటర్ శ్రీధరన్ శ్రీరామ్




**పుణె:** న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో భారత యువ స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ ఏడు వికెట్ల ప్రదర్శన చేశాడు. దాదాపు మూడేళ్ల తర్వాత అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌లోకి అడుగుపెట్టిన అతడిని తీసుకోవడంపై ఎన్నో విమర్శలు వచ్చాయి. కానీ, తొలి ఇన్నింగ్స్‌లో బౌలింగ్‌ను చూశాక చాలామంది ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ నిర్ణయాన్ని అభినందించారు. సుందర్ ఎంపిక తనను మాత్రం ఎలాంటి ఆశ్చర్యానికి గురి చేయలేదని మాజీ క్రికెటర్, కోచ్ శ్రీధరన్ శ్రీరామ్ వ్యాఖ్యానించాడు. సుందర్ గురించి గంభీర్ రెండేళ్లకిందటే తనతో కీలక వ్యాఖ్యలు చేశాడని గుర్తుచేసుకున్నాడు. గంభీర్‌తో కలిసి ఐపీఎల్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు శ్రీరామ్ పనిచేశాడు. "రెండేళ్ల కిందట లఖ్‌నవూ డగౌట్‌లో గంభీర్‌తో కూర్చొని ఉన్నా. ఆ సమయంలో వాషింగ్టన్ సుందర్ గురించి ప్రస్తావన వచ్చింది. అతడిని జట్టు కోసం అత్యంత తక్కువగా వాడుకుంటున్నారనేది అతడి భావన. గౌతమ్ గంభీర్ ప్రధాన కోచ్‌గా బాధ్యతలు తీసుకున్నప్పటినుంచి తప్పకుండా సుందర్‌కు అవకాశాలు వస్తాయని అనుకున్నా. అన్ని ఫార్మాట్లలోనూ ఆడతాడు. సుందర్ ప్రదర్శనపై గంభీర్‌కు ఉన్న నమ్మకం అలాంటిది. కేవలం బౌలర్‌గానే కాకుండా.. అతడిలో మంచి బ్యాటర్ ఉన్నాడనేది గంభీర్ అభిప్రాయం. ఇలాంటి క్రికెటర్లను కోచ్ ఎప్పుడూ ప్రోత్సహిస్తూ ఉంటాడు. రిస్ట్ స్పిన్నర్ కంటే ఫింగర్ స్పిన్నర్ అవసరం ఉందనే భావనతో సుందర్‌కు అవకాశం దక్కింది" అని తెలిపాడు.

**నేనిచ్చే సూచనదే..** "ఐపీఎల్ 2022 సీజన్ సందర్భంగా.. బంతితో కొత్తగా ఏమైనా ప్రయత్నించాలా? అని సుందర్ నన్ను అడిగాడు. ఆ సమయంలో ఒకటే సలహా ఇచ్చా. బంతిని మరింత స్పిన్ తిప్పడంపై దృష్టిసారించమన్నా. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో ఉన్నప్పుడు మేమిద్దరం కలిసి పనిచేశాం. ఇప్పుడూ నేను అతడికి ఇదే సందేశం ఇస్తా. సుందర్‌కు ఎత్తు అడ్వాంటేజ్. దాంతో బౌన్స్‌ను రాబట్టడం సులువు. అదే సమయంలో బంతిని కాస్త ఎక్కువగా తిప్పితే పిచ్ నుంచి ఇంకా సహకారం దొరుకుతుంది. పుణె తొలి ఇన్నింగ్స్‌లో అదే చేశాడు. ఫలితం అనుకూలంగా రాబట్టాడు" అని శ్రీధరన్ శ్రీరామ్ వెల్లడించాడు.

## రోహిత్ శర్మా.. వ్యూహం మార్చాలి కదా!: రవిశాస్త్రి



**పుణె:** న్యూజిలాండ్‌తో పుణె వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో భారత్ ఆటతీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా కెప్టెన్ రోహిత్ శర్మ నిర్ణయాలపై క్రికెట్ అభిమానులు మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే టీమ్‌ఇండియా మాజీ కోచ్ రవిశాస్త్రి కీలక వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ శర్మ ఫీల్డింగ్‌ను సరిగా సర్దుబాటు చేయలేదని విమర్శించాడు. " అప్పటికే అధిక్యంలో కొనసాగుతున్న జట్టును కట్టడి చేయాలంటే.. వికెట్లు తీయడమే లక్ష్యంగా బౌలింగ్ ఉండాలి. అందుకు తగ్గట్టుగా ఫీల్డింగ్ ప్లేస్‌మెంట్స్ ఉండాలి. కానీ, న్యూజిలాండ్ 85 పరుగులు చేసే వరకు భారత్ కేవలం 2 వికెట్లు మాత్రమే తీసింది. ఇక్కడ రోహిత్ శర్మ కెప్టెన్సీ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది" అని రవిశాస్త్రి పేర్కొన్నాడు.

తొలి ఇన్నింగ్స్‌లో 259 పరుగులు చేసిన న్యూజిలాండ్ భారత్‌ను 156 పరుగులకే ఆలౌట్ చేసి.. 103 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. ఈ పరిస్థితుల్లో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆ జట్టును కనీసం 120 పరుగులకు కట్టడి చేసే విధంగా టీమ్ ఇండియా వ్యూహం పన్నినట్లయితే.. విజయావకాశాలు ఎక్కువగా ఉండేవని రవిశాస్త్రి అభిప్రాయపడ్డాడు. " న్యూజిలాండ్ ఒక్క వికెట్ కోల్పోకుండా 60 పరుగులు చేసినప్పుడే రోహిత్ శర్మ తన వ్యూహాన్ని మార్చాల్సింది. ఔట్ ఫీల్డ్‌లో ఆటగాళ్లను మోహరించి.. పరుగులను తగ్గించే ప్రయత్నం చేయకుండా.. ఇన్‌ఫీల్డ్‌లో ఉంచి వికెట్లు తీసే ప్రయత్నం చేయాల్సింది. వెంట వెంటనే వికెట్లు పడితే వాళ్లపై ఒత్తిడి పడుతుంది. ఫలితంగా పరుగులను కట్టడి చేసేందుకు వీలుంటుంది" అని రవిశాస్త్రి చెప్పుకొచ్చాడు.

## పట్టు బిగించిన న్యూజిలాండ్.. 301 పరుగుల ఆధిక్యం




**పుణె:** పుణె వేదికగా భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టులో రెండో రోజు ఆట ముగిసింది. రెండో ఇన్నింగ్స్ ఆడుతున్న న్యూజిలాండ్ ఆట ముగిసే సమయానికి 5 వికెట్లు నష్టపోయి 198 పరుగులు చేసింది. ప్రస్తుతం 301 పరుగుల ఆధిక్యంలో ఉంది. టామ్ లాథమ్ (86బీ 133 బంతుల్లో 10ఐ4) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. విల్ యంగ్ (23), డేరియల్ మిచెల్ (18) ఫర్వాలేదనిపించారు. ప్రస్తుతం టామ్ బ్లండెల్ (30ఎ), ఫిలిప్స్ (9ఎ) క్రీజులో ఉన్నారు. భారత్ బౌలర్లలో వాషింగ్టన్ సుందర్ 4 వికెట్లు తీయగా, రవిచంద్రన్ అశ్విన్ ఒక వికెట్ పడగొట్టాడు.

తొలి ఇన్నింగ్స్‌లో బౌలింగ్‌లో అదరగొట్టిన భారత్.. బ్యాటింగ్‌లో తేలిపోయింది. కేవలం 156 పరుగులకే కుప్పకూలిపోయింది. తొలి ఇన్నింగ్స్‌లో 259 పరుగులు చేసి.. అప్పటికే ఆధిక్యంలో ఉన్న న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో మరింత పుంజుకుంది. ఓ వైపు వికెట్లు కోల్పోతున్నా బెదిరిపోకుండా భారీ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఒక వేళ శనివారం కూడా ఇన్నింగ్స్‌ను కొనసాగించగలిగితే.. భారత్ ఎదుట కొండంత లక్ష్యాన్ని ఉంచే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి.



# నవంబర్ 8న రాబోతున్న జాతర

గల్లా మంజునాథ్ సమర్పణలో మూవీటెక్ ఎల్ఎల్సితో కలిసి రాధా కృష్ణ ప్రొడక్షన్ కంపెనీ పతాకంపై రాధాకృష్ణారెడ్డి, శివశంకర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. సతీష్ బాబు రాటకొండ నటిస్తూ, దర్శకత్వం వహించిన జాతర చిత్రానికి సంబంధించి ఇది వరకు రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ అందరినీ ఆకట్టుకుంది. ఇంత వరకు ఎవ్వరూ టచ్ చేయని పాయింట్‌తో రగ్డ్‌గా, ఇంటెన్స్ డ్రామాతో జాతర చిత్రం రాబోతోంది. చిత్తూరు జిల్లా బ్యాక్ డ్రాప్‌లో జరిగే జాతర నేపథ్యంలో ఈ సినిమా నవంబర్ 8న థియేటర్లోకి రాబోతోంది. ఈ చిత్రంలో దీయా రాజ్ కథానాయికగా నటించగా.. ఆర్.కె. పిన్నపాల, గోపాల్ రెడ్డి, మహబూబ్ బాషా, సాయి విక్రాంత్ సహాయక పాత్రల్లో నటించారు. కె.వి. ప్రసాద్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, శ్రీజిత్ ఎడవణ సంగీతం అందిస్తున్నారు. ఈ మూవీ నవంబర్ 8న భారీ ఎత్తున రిలీజ్ కాబోతోంది. నటినటులు..సతీష్ బాబు రాటకొండ, దీయా రాజ్, ఆర్.కె. పిన్నపాల, గోపాల్ రెడ్డి, మహబూబ్ బాషా, సాయి విక్రాంత్ తదితరులు.

### 28న ఘనంగా

# ఏఎన్ఆర్ అవార్డు వేడుక



ఈ నెల 28న ఘనంగా ఏఎన్ఆర్ అవార్డు వేడుక ఘనంగా జరుగనుంది. మెగాస్టార్ చిరంజీవికి అవార్డును బిగ్ బి అమితాబ్ బచ్చన్ అందజేయనున్నారు. లెజెండరీ అక్కినేని నాగేశ్వరరావు గారి శత జయంతి గత నెల (సెప్టెంబర్ 20) న అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భారత ప్రభుత్వం స్మారక ప్రత్యేక పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేసింది. అక్కినేని కుటుంబం, అనేక మంది గౌరవనీయ అతిథులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో తమ జ్ఞాపకాలను పంచుకున్నారు.

ఏఎన్ఆర్ లెగసీకి తగిన ట్రిబ్యూట్ గా, ఇండియన్ సినిమాకి చేసిన అసాధారణ సేవలకు గుర్తింపుగా పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత చిరంజీవి ప్రతిష్టాత్మక అవార్డును ప్రదానం చేయనున్నట్లు అక్కినేని కుటుంబం ప్రకటించింది. ఈ అవార్డు ప్రదానోత్సవానికి సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.

ఏఎన్ఆర్ అవార్డు వేడుకకు ఆహ్వానించేందుకు నాగార్జున లాంఛనంగా చిరంజీవిని కలిశారు. పద్మవిభూషణ్‌ను అందుకున్న రెండవ తెలుగు వ్యక్తి చిరంజీవి, 2011లో ఏఎన్ఆర్ తొలిసారిగా ఈ అవార్డును అందుకున్నారు.

"మా నాన్న శత జయంతి వేడుకలు జరుపుకుంటున్న ఈ సంవత్సరం చాలా ప్రత్యేకమైనది. ఈ మైలురాయికి గుర్తుగా అవార్డ్స్ 2024కి అమితాబ్ బచ్చన్, చిరంజీవిని ఆహ్వానించడం ఆనందంగా వుంది. ఈ అవార్డు ఫంక్షన్‌ను మరపురానిదిగా చేద్దాం. అని నాగార్జున తన X అకౌంట్ లో పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా కొన్ని డిలైట్ ఫుల్ ఫోటోలని సోషల్ మీడియాలో షేర్ చేశారు. నాగార్జున, చిరంజీవిని ఒకే ఫ్రేం లో చూడటం అభిమానులకు స్పెషల్ ట్రీట్ గా నిలిచింది. నాగార్జున, చిరంజీవి, అమితాబ్ బచ్చన్, పలువురు ప్రముఖులు పాల్గొనే ఈ ఈవెంట్ విజువల్ ఫీస్ట్‌గా వుండబోతోంది.

ఈ అవార్డు గతంలో పద్మభూషణ్ అవార్డు గ్రహీత దేవానంద్, పద్మశ్రీ అవార్డు గ్రహీత షబానా అజ్మీ, అంజలీ దేవి, డాక్టర్ వైజయంతిమాల బాలి, భారతరత్న అవార్డు గ్రహీత లతా మంగేష్కర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కె. బాలచందర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత శ్రీమతి హేమమాలిని, పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ శ్యామ్ బెనెగల్, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత అమితాబ్ బచ్చన్, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎస్.ఎస్.రాజమౌళి, పద్మశ్రీ అవార్డు గ్రహీత శ్రీదేవి బి కపూర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత శ్రీ రేఖ లాంటి దిగ్గజాలకు అందించారు.

# కన్నప్ప టీం ద్వాదశ జ్యోతిర్లింగాల సందర్శనం

ప్రముఖ నటుడు మోహన్ బాబు, విష్ణు మంచు, దర్శకుడు ముఖేష్ కుమార్, నటుడు అర్పిత్ రంకాతో కలిసి కేదార్‌నాథ్, బద్రీనాథ్ రిషికేశ్‌లో ఆధ్యాత్మిక తీర్థయాత్రకు బయలుదేరారు. ఈ బృందం దైవిక ఆశీర్వాదం కోసం ఈ పవిత్ర యాత్రను చేపట్టింది. పన్నెండు జ్యోతిర్లింగాలలో ఒకటైన కేదార్‌నాథ్‌ను కన్నప్ప టీం సందర్శించింది. ఆపై బద్రీనాథ్‌లో ప్రార్థనలు కూడా చేశారు. రిషికేశ్ సందర్శనతో వారి ప్రయాణం ముగిసింది. అనంతరం విష్ణు మంచు మాట్లాడుతూ.. 'కేదార్‌నాథ్, బద్రీనాథ్, రిషికేష్‌కు రావడం ఆనందంగా ఉంది. పరమ శివుడి పరమ భక్తుడి కథగా కన్నప్ప చిత్రం విడుదలకు ముందే మొత్తం 12 జ్యోతిర్లింగాలను సందర్శించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. మా ఎపిక్ యాక్షన్ చిత్రం విడుదల కోసం మేము ఎదురుచూస్తున్నాము' అని అన్నారు. విష్ణు మంచు కన్నప్ప ఫస్ట్ లుక్, టీజర్ అభిమానులలో ఉత్సాహాన్ని నింపిన సంగతి తెలిసిందే. ది లార్డ్ ఆఫ్ ది రింగ్స్ వంటి ఇతిహాసాల స్ఫూర్తితో, ప్రముఖ హాలీవుడ్ సినిమాటోగ్రాఫర్ షెల్డన్ చౌ చే న్యూజిలాండ్‌లోని సుందరమైన ప్రకృతి దృశ్యాలలో చిత్రీకరించిన ఈ చిత్రం విజువల్ వండర్‌గా రాబోతోంది. ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మోహన్‌లాల్, అక్షయ్ కుమార్, ప్రభాస్, శరత్ కుమార్ తో సహా భారీ తారాగణం ఉంది. కథానాయకుడిగా నటిస్తున్న విష్ణు మంచు ఈ చిత్రాన్ని.. భక్తి, శౌర్యం, ఆధ్యాత్మిక అన్వేషణతో కూడిన ప్రయాణంగా అభివర్ణించారు.



### అవకాశాల్ని మనమే

# సృష్టించుకోవాలి

అవకాశాలు వెతుక్కుంటూ రావు. మనమే వాటిని సృష్టించుకోవాలని అంటోంది బాలీవుడ్ నాయిక కృతి సనన్. ఈ ఏడాది 'తేరే బాతోన్ మే ఐసా ఉల్జా జియా', 'క్రూ' లాంటి భిన్నమైన కథలతో తెరపై సందడి చేసిన కథానాయికీమె. ఆమె, కాజోల్ ప్రధాన పాత్రలో శశాంక చతుర్వేది తెరకెక్కించిన చిత్రం 'దో పత్తి'. కృతి తొలిసారి ద్విపాత్రాభినయం, నిర్మాతగా వ్యవహరించడం ఈ సినిమాతోనే కావడం విశేషం. ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కృతి.. తన సినీప్రయాణం గురించి కొన్ని ఆసక్తికర సంగతుల్ని పంచుకుంది.

" చిత్రపరిశ్రమకు వచ్చి దశాబ్దం పూర్తి చేసుకున్నాను. ఎప్పుడూ నటిగానే పరిమితం కాకుండా ఏదైనా కొత్తగా చేయాలని మొదటి నుంచే అనుకునేదాన్ని. ఏ పని చేస్తే బాగుంటుంది? ఎలాంటి పాత్ర పోషిస్తే అందరికీ నచ్చుతుంది? అని ఆలోచించేదాన్ని. వచ్చిన ప్రతీ అవకాశాన్ని అందుకుంటూ నెమ్మది నెమ్మదిగా నాలో ఉన్న నైపుణ్యాలని ఎలా మెరుగు పరుచుకోవాలో అర్థం చేసుకున్నాను. చిత్ర పరిశ్రమకు వచ్చిన కొత్తలో ఎవ్వరికీ అంత తొందరగా అవకాశాలు రావు. సంవత్సరాలు గడుస్తున్న కొద్దీ సమయం, విజయం, అనుభవంతోనే మీకు అవకాశాలు వస్తాయి. కొన్ని సందర్భాల్లో అవకాశాల్ని మనమే సృష్టించుకోవాల్సి వస్తుంది. 'దో పత్తి'తో వచ్చిన అవకాశంతో నటిగానే కాకుండా నిర్మాతగా నిరూపించుకోవాలనుకున్నాను".

### ద్విపాత్రాభినయం ఊహించలేదు..


"నేను నిర్మాతగా మారడానికి రెండు కారణాలున్నాయి. మొదటిది ఇప్పటి వరకూ నేను పోషించని పాత్రల్ని సినిమాల్లో సృష్టించుకునే స్వేచ్ఛ నాకు ఉంటుంది. రెండోది ప్రస్తుతం చిత్రపరిశ్రమలో మహిళా ప్రాధాన్య కథలపై ఎక్కువగా ఆసక్తి చూపించడం లేదు దర్శక నిర్మాతలు. ఇలాంటి సమయంలో నేను ఒక నిర్మాతగా ప్రపంచానికి తెలియని కొత్త కొత్త కథలపై దృష్టిపెడుతూ ప్రేక్షకులకు పరిచయం చేయాలనుకుంటున్నాను. 'మిమీ' తర్వాత నేను లోతైన పాత్రల్లో నటించాలని కోరుకున్నాను. కానీ అస్సలు అలాంటి పాత్రలు మహిళల కోసం రాయట్లేదు. కనికా భిన్నమైన కథలను, పాత్రలను రాస్తుంది కాబట్టి నేను ఆమెతో పనిచేయాలని అనుకుంటున్నానని చెప్పాను. 'దో పత్తి' సినిమాలో నటించడానికి కూడా ఇదే ముఖ్య కారణం. కనికా ఇందులో నన్ను ద్విపాత్రాభినయంలో శక్తిమంతంగా చూపిస్తుందని ఊహించలేదు".

### నన్ను నేను నిరూపించుకోవాలని

"టైగర్ ష్రాఫ్‌తో కలిసి నటించిన 'హీరోపంతి'తోనే బాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయ్యాను. నేను సినీ కుటుంబానికి చెందిన అమ్మాయిని కాదు. కానీ అప్పటికే టైగర్ అందరికీ సుపరిచితం. ఆ సినిమా విడుదలైన రోజుల్లో అభిమానులు నన్ను గుర్తుపట్టడానికి 'టైగర్ ష్రాఫ్ సినిమాలో కనిపించిన అమ్మాయి' అని పిలిచేవారు. మీరు పరిశ్రమకు చెందిన వ్యక్తి కానప్పుడు మీ పేరు, ముఖాన్ని ప్రజల మనసుల్లో చెక్కడానికి ఎక్కువ సమయం పడుతుంది. దీంతో పాటు మరికొంత మంది నన్ను 'టైగర్ దీదీ' అని పిలిచేవారు. ఇలాంటి పేర్ల నుంచి బయటపడాలని.. నేనెవరో వారు తెలుసుకునేలా చేయడానికి ఎక్కువ కష్టపడి నన్ను నేను నిరూపించుకోవాలని నిర్ణయించుకున్నాను".

### పదేళ్ల తర్వాత లోతు తెలిసింది

"ఇప్పటి వరకూ ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించాను. అద్భుతమైన నటులతో, అనుభవమున్న దర్శకులతో పనిచేశాను. కానీ.. నేను ఛాలెంజింగ్ పాత్రలో నటిస్తేనే.. సెట్‌లో ఉత్సాహంగా ఉంటాను. ఎప్పుడెప్పుడు వెళ్లి నా పాత్రకు సంబంధించిన సన్నివేశాన్ని పూర్తి చేస్తానా అని ఆత్రుతగా ఎదురుచూస్తుంటాను. కొన్నిసార్లు సవాలు లేని పాత్రలు చేయాల్సి వస్తుంటుంది. అప్పుడు నేను సెట్‌లో ఉత్తేజంగా ఉండలేను. నిద్రపోవాలనిపిస్తుంది. ఇలాంటి పాత్రలతో నేను సంతృప్తి కూడా చెందలేను. మొదట్లో ఎలాంటి పాత్రల్ని ఎంచుకోవాలో కనీసం అవగాహన లేదు. ఇప్పుడు పదేళ్ల తర్వాత నేను పాత్రల లోతును, కథను అర్థం చేసుకొని ఎంచుకునే స్థాయికి చేరుకున్నాను".




### కిరణ్ అబ్బవరం

# 'క' ట్రైలర్ రిలీజ్

కాస్త గ్యాప్ తర్వాత హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న భారీ పీరియాడిక్ థ్రిల్లర్ 'క' సినిమా. నయన్ సారిక తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించారు. దర్శక ద్వయం సుజీత్ , సందీప్ విలేజ్ బ్యాక్ డ్రాప్ యాక్షన్ థ్రిల్లర్ కథతో ఈ సినిమాను తెరకెక్కించారు. ఈ నెల 31న దీపావళి పండుగ సందర్భంగా తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు ఈ సినిమా రెడీ అయింది. అయితే అనేక అవాంతరాలను దాటుకుని ఎట్టకేలకు శుక్రవారం ఈ మూవీ ట్రైలర్ రిలీజైంది. ఈ ట్రైలర్‌ను చూస్తే కిరణ్ ఈ సారి మంచి విజయాన్నే అందుకునేలా కనిపిస్తోంది. ఆరంభమే చుట్టూ కొండల మధ్య ఉన్న కృష్ణగిరి అనే అందమైన ఊరిలో పోస్ట్ మ్యాన్ గా పనిచేస్తుంటాడు అభినయ వాసుదేవ్. మధ్యాహ్నమే చీకటి పడే ఆ ఊరు భౌగోళికంగా ఎంతో ప్రత్యేకం. అక్కడ సత్యభామ అనే అందమైన అమ్మాయితో ప్రేమలో పడతాడు వాసుదేవ్. ఉత్తరాలు పంచే క్రమంలో 1979 ఏప్రిల్ 22న అభిషేక్ పేరుతో వచ్చిన ఉత్తరం వాసుదేవ్ జీవితాన్ని మలుపు తిప్పుతుంది. ఆ ఉత్తరంలో ఏముంది ?, ట్రైలర్ చివరలో 'జాతర మొదలుపెడదామా..' అంటూ ముసుగు వ్యక్తిగా వాసుదేవ్ రావడం సర్ ప్రైజ్ ట్విస్ట్ ఇచ్చింది. గ్రిప్పింగ్ సస్పెన్స్ యాక్షన్ థ్రిల్లర్ గా "క" సినిమా ఉండబోతున్నట్లు ట్రైలర్ తో తెలుస్తోంది. ట్రైలర్ లో హై క్వాలిటీ ప్రొడక్షన్ వ్యాల్యూస్,సంగీతం ఆకట్టుకుంటున్నాయి.

### రామ్ గోపాల్ వర్మ

# లేటెస్ట్ ఫిలిం శారీ



డిఫరెంట్ కంటెంట్‌లతో, నిజజీవిత సంఘటనల ఆధారంగా కొత్త వారితో ప్రయోగాలు చేయడంలో ముందుండే రామ్ గోపాల్ వర్మ లేటెస్ట్ థ్రిల్లర్ మూవీ 'శారీ'. ఆర్జీవీ డెన్ ద్వారా వెలుగు చూస్తున్న'టూ మచ్ లవ్ కెన్ బి స్కేరీ' అనే లాగ్ లైన్ తో పలు నిజజీవిత సంఘటనల మేళవింపుతో ఓ సైకలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందింది. ఈ చిత్రం గిరి కృష్ణ కమల్ దర్శకత్వంలో ప్రముఖ బిజినెస్ మాన్ రవి వర్మ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇందులో భయానక ప్రేమికుడిగా సత్య యాదు నటిస్తూండగా, అతనిలో సెగలు రేపే చీరలోని అమ్మాయి పాత్రలో ఆరాధ్య దేవి నటిస్తోంది. కాగా ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా తెలుగు, హిందీ, తమిళ్ , మలయాళ భాషల్లో డిసెంబర్ 20న విడుదల కానుంది. 'శారీ' చిత్రం ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలో వెంకట సాయి ఫిలిమ్స్ ద్వారా తెలుగులో విడుదల చేయడానికి ప్రముఖ పంపిణీ దారుడు ముత్యాల రాందాస్ మంచి ఫాన్సీ రేట్ తో థియేట్రికల్ హక్కులు సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. రామ్ గోపాల్ వర్మ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా భయానకమైన రిలేషన్స్ కు తెరలు లేపుతుంది. సోషల్ మీడియా అనేది జనానికి మేలు చేయకపోగా 'యాంటీ సోషల్ మీడియా'గా మారుతోంది. ఇన్ స్టాగ్రామ్ వంటి యాప్ ల ద్వారా చాలామందిలో విచ్చలవిడితనం పెరిగిపోతోంది. పడచు అమ్మాయిలు వాటిలోని నిజాలను గ్రహించలేక ఆకర్షితులవుతున్నారు. మితిమీరిన ప్రేమ ఎంత భయంకరంగా మారొచ్చు అనేది ఈ చిత్రంలోని ప్రధాన అంశం. వయసులో ఉన్న అమ్మాయిలకు కనువిప్పు కలిగేలా ఈ సినిమా తెరకెక్కింది అన్నారు.

నిర్మాత రవి వర్మ మాట్లాడుతూ,ఇటీవల ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ ప్రక్రియతో రికార్డు చేసిన ఐ వాంట్ లవ్ అనే తెలుగు, తమిళ్, హిందీ, మరియు మలయాళ లిరికల్, ఫుల్ వీడియో సాంగ్ ఆర్జీవీ డెన్ మ్యూజిక్ ద్వారా విడుదల చేసాము, మంచి రెస్పాన్స్ వచ్చింది. త్వరలో మరో లిరికల్ సాంగ్ విడుదల చేస్తాము. డిసెంబర్ 20న ప్రపంచ వ్యాప్తంగా నాలుగు భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం అన్నారు.

### ఉదయాన్నే ఇవి గుప్పెడు తింటే..

# ఆరోగ్యం మీ గుప్పిట్లో

ఉదయాన్నే ఇవి గుప్పెడు తినండి.. ఆరోగ్యం మీ గుప్పిట్లో

ఆరోగ్యంగా ఉండటానికి, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినడం చాలా ముఖ్యం. అలాంటి ఆరోగ్యకరమైన ఆహారంలో మొలకలు ప్రధాన పాత్రపోషిస్తాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం చాలా మంది రకరకాల మొలకలు తయారు చేసుకుని తింటున్నారు..? కానీ, మొలకెత్తిన మెంతుల గురించి మీకు తెలుసా? ఈ చిన్న విత్తనాలు మొలకెత్తినప్పుడు వాటి పోషక విలువ చాలా రెట్లు పెరుగుతాయని చెబుతున్నారు. మొలకెత్తిన మెంతులు ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తుందో తెలుసుకోండి. మొలకెత్తిన మెంతులు విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లుతో నిండి ఉంటాయి. ఇవి మన శరీరానికి అనేక రకాలుగా ప్రయోజనం అందిస్తాయి. మొలకెత్తిన మెంతుల్లో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం నుండి ఉపశమనం కలిగిస్తుంది. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారికి మొలకెత్తిన మెంతులు చాలా ఉపయోగకరంగా పనిచేస్తాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కీలకంగా పనిచేస్తాయి. మొలకెత్తిన మెంతుల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. రక్తపోటును తగ్గించడంలో కూడా ఇవి సహాయపడతాయి. మొలకెత్తిన మెంతులలో క్యాలరీలు చాలా తక్కువ ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉంటుంది. మొలకెత్తిన మెంతులు తినడం వల్ల ఆకలిని తగ్గించి, జీవక్రియను పెంచడం ద్వారా బరువు తగ్గడానికి సహాయపడతాయి. అంతేకాదు.. మొలకెత్తిన మెంతులు చర్మ సంక్రమణలను నివారించి, మొటిమలను తగ్గించడంలో సహాయపడతాయి. జుట్టు రాలడాన్ని నిరోధించి, జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తాయి. మొలకెత్తిన మెంతులు సహజంగా రక్తాన్ని శుభ్రపరుస్తాయి. రక్తంలో ఆక్సిజన్ ప్రవాహాన్ని పెంచుతుంది. రక్తంలో ఉన్న అన్ని రకాల విషాలను తొలగించడంలో కూడా సహాయపడుతుంది. మొలకెత్తిన మెంతుల్లో విటమిన్ సి సమృద్ధిగా లభిస్తుంది. రోగనిరోధక శక్తిని ఇది బలపరుస్తుంది. ఇవి ఈస్ట్రోజన్ ప్రొజెస్టరాన్ హార్మోన్ల అసమతుల్యతను కాపాడతాయి. మెనోపాజ్‌తో బాధపడే మహిళలకు మొలకెత్తిన మెంతులు ఎంతో ఉపయోగకరం. ఈ మొలకెత్తిన మెంతుల్లో క్యాల్షియం సమృద్ధిగా ఉంటుంది. దంతాలు, ఎముకులను బలోపేతం చేస్తాయి. పాలిచ్చే తల్లులు మొలకెత్తిన మెంతి గింజలను తినడం వల్ల ప్రయోజనం పొందుతారు. రక్తంలో చక్కెరను నియంత్రించడానికి, మొలకెత్తిన మెంతులు ప్రతిరోజూ తినాలి. శరీరంలో పెరుగుతున్న కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి మొలకెత్తిన మెంతులు కూడా తినాలి.




# సర్వైకల్ క్యాన్సర్ ప్రారంభ లక్షణాలు

దేశంలో అధిక మంది మహిళలు సర్వైకల్ క్యాన్సర్ వల్ల ప్రతీయేట మరణిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం ఈ క్యాన్సర్ ప్రారంభ దశలో గుర్తించకపోవడమే. చాలా కేసులో చివరి దశలో దీనిని గుర్తించడం వల్ల అధిక మంది మరణిస్తున్నారు. దీని లక్షణాలు, నివారణ చర్యలు ఇక్కడ తెలుసుకుందాం. మన దేశంలో గర్భాశయ క్యాన్సర్ కేసులు, మరణాల సంఖ్య ప్రతీయేట గణనీయంగా పెరుగుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం..2022 సంవత్సరంలో మన దేశంలో 1.27 లక్షలకు పైగా గర్భాశయ క్యాన్సర్ కేసులు నమోదయ్యాయి. సర్వైకల్ క్యాన్సర్ కారణంగా సంభవించే మొత్తం మరణాలలో 25 శాతం ఒక భారతదేశంలోనే సంభవిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం దేశంలో చాలా వరకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కేసులు అడ్వాన్స్‌డ్ అంటే చివరి దశలో గుర్తించడమే. ఈ క్యాన్సర్ లక్షణాల గురించి మహిళలకు తెలియకపోవడమే దీనికి ప్రధాన కారణం. దీని కారణంగా వ్యాధి ఆలస్యంగా గుర్తించబడుతుంది. అప్పటికి చాలా ఆలస్యం అవుతుంది. అటువంటి పరిస్థితిలో మహిళలు సర్వైకల్ క్యాన్సర్ ప్రారంభ లక్షణాల గురించి సరైన అవగాహన కలిగి ఉండాలి. ముందుగా సర్వైకల్ క్యాన్సర్ అంటే ఏమిటో తెలుసుకుందాం..

ఈ క్యాన్సర్ మహిళల్లో గర్భాశయ ముఖద్వారంలో మొదలవుతుంది. సెర్విక్స్ అంటే స్త్రీల ప్రైవేట్ పార్ట్‌లలో ఉండే భాగం. ఇది గర్భం దిగువ భాగంలో ఉంటుంది. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ గర్భాశయ ముఖద్వారంలో ప్రారంభమవుతుంది. దానిని సకాలంలో గుర్తించకపోతే, అది శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపిస్తుంది. మహిళల్లో హ్యూమన్ పాపిల్లోమావైరస్ వల్ల గర్భాశయ క్యాన్సర్ వస్తుంది. ఈ వైరస్ లైంగిక సంపర్కం ద్వారా వ్యాపించే ఒక సాధారణ సంక్రమణం. ఈ వైరస్ స్త్రీ శరీరంలోకి ప్రవేశించినప్పుడు రోగనిరోధక వ్యవస్థను నాశనం చేస్తుంది. కానీ కొన్ని సందర్భాల్లో ఈ వైరస్ నాశనం అవదు. ఫలితంగా సంవత్సరాల తరబడి గర్భాశయంలో పెరుగుతూనే ఉంటుంది. దీని కారణంగా ఈ ప్రాంతంలో ఉన్న కొన్ని కణాలు వేగంగా పెరగడం ప్రారంభిస్తాయి. కణాల అనియంత్రిత పెరుగుదల క్యాన్సర్‌కు దారితీస్తుంది. చాలా సందర్భాలలో మహిళలకు ఈ క్యాన్సర్ గురించి ప్రారంభ దశలో తెలియదు.

చికిత్స ఎలా జరుగుతుంది?

సఫ్దర్‌జంగ్ హాస్పిటల్‌లోని ఓంకో గైనకాలజీ విభాగంలో డాక్టర్ సలోని చద్దా మాట్లాడుతూ.. గర్భాశయ క్యాన్సర్ వచ్చినప్పుడు, క్యాన్సర్ కణితిని తొలగించడానికి శస్త్రచికిత్స ద్వారా చికిత్స చేస్తాం. ఇతర చికిత్సలలో క్యాన్సర్ కణాలను చంపే మందులు ఉండవచ్చు. ఇందులో రోగికి కీమోథెరపీ ఇస్తారు. రోగికి రేడియోథెరపీతో కూడా చికిత్స చేస్తారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను ముందుగానే గుర్తిస్తే సులువుగా నివారించవచ్చు. అయితే చాలా వరకు ఆలస్యంగా గుర్తిస్తారని డాక్టర్ సలోని చెప్పారు. లక్షణాల గురించి అవగాహన లేకపోవడమే దీనికి ప్రధాన కారణం. అటువంటి పరిస్థితిలో మహిళల్లో ఈ క్యాన్సర్ గురించి అవగాహన కల్పించడం చాలా ముఖ్యం. క్యాన్సర్‌ను సకాలంలో గుర్తిస్తే, సులభంగా చికిత్స చేయవచ్చు. ఇది క్యాన్సర్ మరణాలను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది.




Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com